చైతన్యరథం

సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

**చివరి ఆయకట్టు వరకూ సాగర్ జలాలు**

- మంత్రి డోలా ఆదేశం
- ప్రకాశం జిల్లా అధికారులతో సమీక్ష

7

# ప్రజాభిప్రాయానికే పెద్దపీట




- జిల్లాల పునర్విభజనలో కొద్దిపాటి మార్పుచేర్పులు
- 927 అభ్యంతరాలు, సూచనలపై సుదీర్ఘ చర్చ
- నెల్లూరు జిల్లాకే గూడూరు...
- నక్కపల్లి డివిజన్ బదులుగా అడ్డరోడ్డు జంక్షన్
- మార్కాపురం జిల్లాకు దొనకొండ, కురిచేడు మండలాలు
- జిల్లాల పునర్విభజనపై సమీక్షలో సీఎం చంద్రబాబు
- ఈనెల 31న తుది నోటిఫికేషన్ జారీ

- వివరాలు 4లో...

## నేడు అయోధ్యకు చంద్రబాబు

అమరావతి (చైతన్య రథం): అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి కాంప్లెక్స్‌లో కొలువుదీరిన శ్రీరాముడిని దర్శించుకునేందుకు సీఎం చంద్రబాబు ఆదివారం అయోధ్యకు వెళ్తున్నారు. ఆదివారం ఉదయం 9 గంటలకు హైదరాబాద్‌నుంచి బయలుదేరి 11 గంటలకు అయోధ్య చేరుకుంటారు. అయోధ్య శ్రీరామ జన్మభూమి కాంప్లెక్స్‌లో కొలువైన శ్రీరాముడిని దర్శించుకుంటారు. ఉదయం 11.30 గంటలనుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకూ అయోధ్య శ్రీరాముడి ఆలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్యాత్మిక చింతనతో గడుపుతారు. మధ్యాహ్నం 3 గంటలకు అయోధ్యనుంచి బయలుదేరి నేరుగా విజయవాడ చేరుకుంటారు.




2

### నాడు రాజకీయ తరగతులు...

# నేడు విద్యా బుద్ధులు

- గండిపేట గుర్తులు... అలనాటి స్మృతులు
- విలువలతో కూడిన విద్యను అభ్యసించండి
- కార్యకర్తల పిల్లలకు చదవు చెప్పేందుకే విద్యా సంస్థలు స్థాపించాం
- దేశంమెచ్చే విద్యా సంస్థగా ఎన్టీఆర్ విద్యా సంస్థలు వెలుగొందాలి
- ఎన్టీఆర్ పట్టుదలే నారా భువనేశ్వరికి వచ్చింది
- ఎన్టీఆర్ విద్యా సంస్థల వార్షికోత్సవ వేడుకల్లో సీఎం చంద్రబాబు

# కత్తులు దూస్తే కటకటాలే

- రప్పా రప్పా అని రెచ్చిపోతే జైలుకే
- ప్రపంచంలో ఎక్కడైనా పుట్టినరోజు కేకులను వేటకొడవళ్లు, తల్వార్లతో కట్ చేస్తారా?
- వికృత చేష్టలతో వైసీపీ సైకోమూకల ఉన్మాదం
- ప్రజలు బుద్ధిచెప్పినా హింసా నైజం మార్చుకోని జగన్
- అధికారం కోల్పోయినా రాజకీయ ముసుగులో రౌడీయిజం
- సమాజంలో భయత్పాతం సృష్టించే కుట్ర
- గర్భిణిపై దాడి కేసులో నీచుడిని అరెస్ట్ చేస్తే జనసేన కార్యకర్త అని విష ప్రచారం
- చంద్రబాబు నేతృత్వంలో శాంతిభద్రతలకు అత్యంత ప్రాధాన్యత

5



- కూటమి పాలనలో హింసా రాజకీయాలకు తావులేదు
- హెూం మంత్రి వంగలపూడి అనిత స్పష్టం

## గిరిజన రైతులకు సబ్సిడీతో పరికరాలు

*ఐటీడీఏలకు రూ.13.70 కోట్లు విడుదల : మంత్రి గుమ్మడి సంధ్యారాణి*

7

## గ్రేటర్ విజయవాడ.. ప్రస్తుతానికి వాయిదా

- గ్రేటర్ తిరుపతి కూడా
- జనాభా సర్వే తర్వాతే ప్రక్రియ ప్రారంభం
- పురపాలక మంత్రి పొంగూరు నారాయణ

6

## వైసీపీ నాయకురాలి బెదిరింపులు

- తప్పుడు కేసులు పెట్టి వేధిస్తోంది
- రిజిస్ట్రేషన్ ఉన్న భూమికి 22-ఏ ముద్ర
- ప్రజావినతుల్లో బాధితుల ఫిర్యాదులు
- అర్జీలు స్వీకరించిన ఏపీఐడీసీ చైర్మన్ ప్రభాకర్

7

## క్రూరత్వం, కుట్రలు @ జగన్



- ప్రజలు బుద్ధిచెప్పినా మారని నైజం
- అభివృద్ధిని అడ్డుకునే పన్నాగం
- ఉనికి కోసం జనంలో భయాందోళనలు సృష్టించే వ్యూహం
- సైకో నేత దారిలోనే వైసీపీ మూకల ఉన్మాదం
- జగన్ పుట్టినరోజు పేరుతో జంతుబలులు, రక్తాభిషేకాలతో రెచ్చిపోయి రంకెలు
- కత్తులు, తల్వార్లతో స్వైరవిహారం
- ఉన్మత్తమూకలపై ఎక్కడికక్కడ పోలీసు కేసులు

8

## ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడిన ప్రభుత్వం

7

- ఇప్పటివరకు 287 మందికి కారుణ్య నియామకాలు
- వ్యవసాయ కనెక్షన్ల మంజూరులో జాప్యం ఉండొద్దు
- ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

## తిరుమల వెంకన్నకు వైసీపీ ముఠా ద్రోహం

6

- తప్పుడు వదంతులకు అడ్డకట్ట వేయాలి
- బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్

చైతన్యరథం



## నాడు రాజకీయ తరగతులు...

# నేడు విద్యా బుద్ధులు

- గండిపేట గుర్తులు.. అలనాటి స్మృతులు
- విలువలతో కూడిన విద్యను అభ్యసించండి
- కార్యకర్తల పిల్లలకు చదవు చెప్పేందుకే విద్యా సంస్థలు స్థాపించాం
- దేశంమెచ్చే విద్యా సంస్థగా ఎన్టీఆర్ విద్యా సంస్థలు వెలుగొందాలి
- ఎన్టీఆర్ పట్టుదలే నారా భువనేశ్వరికి వచ్చింది
- ఎన్టీఆర్ విద్యా సంస్థల వార్షికోత్సవ వేడుకల్లో సీఎం చంద్రబాబు



హైదరాబాద్ (చైతన్య రథం): గండిపేట ప్రాంగణానికి రాగానే పాత స్మృతులు... అలనాటి జ్ఞాపకాలు గుర్తుకు వస్తాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. హైదరాబాద్‌లోని గండిపేటలో శనివారం ఎన్టీఆర్ విద్యా సంస్థల వార్షికోత్సవ వేడుకల్లో సీఎం చంద్రబాబు, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి పాల్గొన్నారు. కాలినడకన తిరుగుతూ ఎన్టీఆర్ స్కూల్ ప్రాంగణాన్ని సీఎం చంద్రబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుకు ఎన్టీఆర్ ఎడ్యుకేషనల్ సంస్థకు చెందిన విద్యార్థులు గాడ్ ఆఫ్ ఆనర్ సమర్పించారు. అక్కడ ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను సీఎం చంద్రబాబు దంపతులు ఆసక్తిగా తిలకించారు. జ్యోతి ప్రజ్వలన చేసి వార్షికోత్సవాలను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ... "గండిపేటకు వస్తే పాత విషయాలు గుర్తుకు వస్తాయి. గండిపేట తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంగా ఉండేది. ఒకప్పుడు రాజకీయ నాయకులకు శిక్షణ ఇచ్చే కేంద్రంగా గండిపేట ఉండేది. ఇప్పుడు విద్యార్థులకు శిక్షణనిస్తోంది. గండిపేటలో భావితరాల కోసం నాయకత్వాన్ని తయారు చేశాం. ఇప్పుడు విద్యార్థులు చదువుకుంటున్న తరగతుల్లోనే నాడు నాయకత్వ శిక్షణ శిబిరాలు నిర్వహించాం. ఫ్యాక్షన్ గొడవలు, రోడ్డు ప్రమాదాల్లో చనిపోయినవారి కుటుంబాల్లోని పిల్లలకు పెద్దదిక్కుగా ఉండేలా ఎన్టీఆర్ విద్యా సంస్థలు ప్రారంభించాం. చిన్న మొక్కగా ప్రారంభించిన విద్యా సంస్థలను పెద్ద వృక్షంగా మార్చారు. ఎన్టీఆర్ ట్రస్టు, విద్యా సంస్థలను నారా భువనేశ్వరి సమర్థవంతంగా నడిపిస్తున్నారు. ఎన్టీఆర్ విద్యా సంస్థల్లో చదువుకున్న వారు గ్రూప్-1 పరీక్షల్లో నలుగురు పాస్ అయ్యారు. ముగ్గురు జూనియర్ సివిల్ జడ్జీలుగా ఎంపికయ్యారు. ఎన్టీఆర్ విద్యా సంస్థల్లో విద్యనభ్యసించిన వారికి దేశంలోని ప్రముఖ విద్యా సంస్థల్లో 29మందికి సీట్లు వచ్చాయి. 131మంది విద్యార్థులతో విద్యా సంస్థను ప్రారంభించాం. ఇప్పుడు 1641మంది చదువుతున్నారు. సంస్థ ఈ స్థాయికి ఎదగడానికి నారా భువనేశ్వరినే కారణం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

**చదువు ముఖ్యం... విలువలు మరింత ముఖ్యం**

"ఎస్సెస్సీ 11 బ్యాచులు, సీబీఎస్ఈ 8 బ్యాచులు, ఇంటర్ 9 బ్యాచులు, డిగ్రీ 7 బ్యాచులు ఎన్టీఆర్ విద్యా సంస్థల నుంచి బయటకు వచ్చాయి. నల్సార్, ఎన్ఎల్‌యూ వంటి ప్రతిష్టాత్మక సంస్థల్లో సీట్లు సాధించారు. సమాజంలో సమానత్వం కోసం పరితపించే వ్యక్తి ఎన్టీఆర్. ట్రస్ట్‌పెట్టి పిల్లలకు చదువు చెప్పించే ఏకైక రాజకీయ పార్టీ తెలుగుదేశమే. మన సంస్కృతి-సంప్రదాయాలను మరిచిపోవద్దు. ఆధునాతన విధానాల్ని అందిపుచ్చుకోవాలి. విలువలను కాపాడుకోవాలి. విద్యార్థులందరూ లక్ష్యాలను నిర్దేశించుకోవాలి. ఆ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలి. టెక్నలాజీని అందిపుచ్చుకోవాలి. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. ఎడిషనల్ కోర్సులు చేయండి. నిరంతరం నేర్చుకునే అంశంపై ఫోకస్ పెట్టండి. విద్యతో పేదరికాన్ని జయించవచ్చు. అప్పుడు సంపద తనంతట అదే వస్తుంది. ప్రాణత్యాగాలు చేసిన కార్యకర్తల కుటుంబాల పిల్లలకు ఈ విద్యా సంస్థల ద్వారా విద్యను అందిస్తున్నాం. దేశంమెచ్చే విధంగా విద్యా సంస్థలను రన్ చేయాలి. విద్యార్థులు చక్కగా చదువుకుని సమాజంలో గుర్తింపు దక్కించుకోవాలి. ఎన్టీఆర్ విద్యా సంస్థలకు విద్యార్థులే బ్రాండ్ అంబాసిడర్లు. ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ద్వారా ఇప్పటి వరకు 10 లక్షలమందికి రక్తదానం చేశారు. 273మంది తలసేమియా బాధిత చిన్నారులకు ఉచితంగా రక్తమార్పిడి చేశారు. సంజీవని క్లినిక్‌ల ద్వారా 22 లక్షలమందికి ఆరోగ్య సేవలు అందించారు. ప్రకృతి విపత్తుల్లో బాధితులను ట్రస్ట్ ద్వారా ఆదుకుంటున్నారు. ట్రస్ట్ ద్వారా రక్షిత తాగునీటిని అందిస్తున్నారు" అని సీఎం అన్నారు.

**నేను టెక్నాలజీ గురించి చెబుతోంటే... భువనేశ్వరి టెక్నాలజీని వాడుతున్నారు**

"నన్ను చాలామంది ఐఏఎస్ చేయమన్నారు. కానీ రాజకీయాల్లోకి రావాలని డిసైడ్ అయ్యాను. యూనివర్శిటీ నుంచే ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచాను. రెండేళ్లల్లో మంత్రిని అయ్యాను. ఆ తర్వాత సీఎం.. ఇప్పుడు నాలుగోసారి సీఎంగా విధులు నిర్వహిస్తున్నాను. నేను రాజకీయాల్లో బిజీగా అయ్యాక... హెరిటేజ్ బాధ్యతలు చూడమని నారా భువనేశ్వరిని కోరాను. అయిష్టంగా హెరిటేజ్ బాధ్యతలు తీసుకున్న నారా భువనేశ్వరి ఆ సంస్థను అద్భుతంగా అభివృద్ధి చేశారు. పట్టుదలతో హెరిటేజ్ సంస్థను నడిపించారు. నేను ఇంకా పేపర్ చూసి స్పీచ్ ఇస్తున్నాను. భువనేశ్వరి ట్యాబ్ చూసి స్పీచ్ ఇస్తున్నారు. నేను టెక్నాలజీ గురించి మాట్లాడుతున్నాను. భువనేశ్వరి టెక్నాలజీని వినియోగిస్తున్నారు. ఎన్టీఆర్ మాదిరిగా భువనేశ్వరికి పట్టుదల ఉంది, మొండితనమూ ఉంది. భువనేశ్వరి ఏదైనా చేయాలని సంకల్పం తీసుకుంటే పట్టుదలతో చేస్తారు. భార్యగా, తల్లిగా, గృహిణిగా, ట్రస్టీగా, హెరిటెజ్ ఎండీగా భువనేశ్వరి చాలా విజయాలు సాధించారు. నేను సీఎంగా, పార్టీ అధ్యక్షునిగా పని చేస్తున్నాను. కానీ భువనేశ్వరి చాలా పాత్రలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. భువనేశ్వరి చేస్తున్న కృషికి లండన్‌లో ఇన్స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్ సంస్థ రెండు అవార్డులు ఇచ్చింది. వ్యక్తిగత అవార్డుతోపాటు... హెరిటెజ్ సంస్థను అద్భుతంగా నడిపిస్తున్నందుకు గోల్డెన్ పీకాక్ అవార్డు ఇచ్చారు" అని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశంసించారు.

**ఎన్టీఆర్ స్ఫూర్తితో సేవలందిస్తున్నాం: భువనేశ్వరి**

ఎన్టీఆర్ విద్యా సంస్థల వార్షికోత్సవంలో పాల్గొన్న ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి మాట్లాడుతూ... "విద్యార్థుల ఆశలకు అనుగుణంగా వారి భవిష్యత్తును రూపుదిద్దుతున్నాం. మానవ సేవే మాధవ సేవ అని ఎన్టీఆర్ నమ్మారు. దానికి అనుగుణంగానే ఎన్టీఆర్ ట్రస్ట్ పని చేస్తోంది. ఎన్టీఆర్ ట్రస్ట్‌నుంచి హెల్త్ కేర్ సర్వీసులు, తలసేమియా సెంటర్, ఎన్టీఆర్ సంజీవని క్లినిక్కులు పని చేస్తున్నాయి. పేద, అనాథ పిల్లలకు ఉచిత విద్య అందిస్తున్నాం. సివిల్ సర్వీసెస్ అకాడెమీ ద్వారా యూపీఎస్సీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యేవారికి శిక్షణ ఇప్పిస్తున్నాం. ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు... ప్రకృతి వైపరీత్యాలవల్ల కష్టాల్లో ఉన్నప్పుడు వారిని అన్ని విధాలా ఆదుకుంటున్నాం. స్త్రీశక్తి ద్వారా పేద మహిళలకు ఉపాధి కల్పిస్తున్నాం. ఎన్టీఆర్ సుజల ద్వారా రక్షిత తాగునీటిని సరఫరా చేస్తున్నాం. పేదల జీవితాల్ని బాగుపరిచేలా, విద్యార్థులకు అండగా నిలిచేలా, కుటుంబాలను ఆదుకునేలా ఎన్టీఆర్ ట్రస్ట్ పని చేస్తోంది. ఇదే ఎన్టీఆర్‌కు మేం ఇచ్చే నివాళి. ఎన్టీఆర్ విద్యా సంస్థల ద్వారా చదువుకున్న వారు వివిధ ప్రాధాన్యత రంగాల్లో రాణిస్తున్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే టీచర్లు ఎన్టీఆర్ విద్యా సంస్థల్లో ఉన్నారు. బాహ్య ప్రపంచంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొవాల్సి ఉంటుంది. దానికి ఇక్కడినుంచే సంసిద్ధమవ్వండి. కోట్లాది మంది హృదయాలను ఎన్టీఆర్ గెలుచుకున్నారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో.. ఆయన చూపిన దారిలో ఎన్టీఆర్ విద్యా సంస్థలను, ఎన్టీఆర్ ట్రస్టును నడుపుతున్నాం" అని భువనేశ్వరి పేర్కొన్నారు.

**స్ఫూర్తినిచ్చారు.. కెరీర్ తీర్చిదిద్దారు...**

ఎన్టీఆర్ విద్యా సంస్థల వార్షికోత్సవంలో ఆ సంస్థలో చదువుకున్న పూర్వ విద్యార్థులు పలువురు ప్రసంగించారు. తనకు విద్యాబుద్ధులు నేర్పించి... చక్కటి భవిష్యత్తు కల్పించిన సీఎం చంద్రబాబు దంపతులకు పూర్వ విద్యార్థి హరికృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం తాను సినాప్సిస్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నట్టు హరికృష్ణ వెల్లడించారు. అలాగే ఎన్టీఆర్ విద్యా సంస్థలే తన కెరీర్‌ను తీర్చిదిద్దాయని మరో పూర్వ విద్యార్థిని ఉమశ్రీ చెప్పారు. ఎయిర్ హోస్టెస్ అయిన తాను ఎంటర్‌ప్రెన్యూయర్‌గా కొనసాగుతున్నట్టు వెల్లడించారు. ఎన్టీఆర్ విద్యా సంస్థల యాన్యువల్ రిపోర్టులను స్కూల్, కాలేజీ ప్రిన్సిపాల్స్ జోజి రెడ్డి, రామరావు సమర్పించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ ట్రస్ట్, హెరిటెజ్ ఫుడ్స్ సంస్థలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

## దొండపాటి కుటుంబానికి సీఎం చంద్రబాబు పరామర్శ

అమరావతి (చైతన్య రథం): ఎన్-8 రహదారి విషయమై తుళ్లూరు మండలం మందడంలో రైతులతో నిర్వహించిన సమావేశానికి హాజరై.. ఆకస్మికంగా గుండెపోటుతో కుప్పకూలిన దొండపాటి రామారావు కుటుంబాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరామర్శించారు. శనివారం ఉదయం దొండపాటి కుటుంబంతో ఫోన్‌లో మాట్లాడిన సీఎం చంద్రబాబు.. బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఎన్-8 రహదారి విషయమై శుక్రవారం తుళ్లూరు మండలం మందడంలో రైతులతో మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ నిర్వహించిన సమావేశానికి రామారావు హాజరయ్యారు. అకస్మాత్తుగా గుండెపోటుకు గురవ్వడంతో.. ఆసుపత్రికి తరలించేలోపే రామారావు మృతి చెందారు. రామారావు కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడిన చంద్రబాబు.. కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రామారావు కుటుంబానికి అవసరమైన బాధ్యతలు నిర్వర్తించారని ఈ సందర్భంగా మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్‌కు సీఎం చంద్రబాబు సూచించారు.

చైతన్యరథం




హైదరాబాద్‌లో ఎన్టీఆర్ విద్యా సంస్థల వార్షికోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. చిత్రంలో ఆయన సతీమణి భువనేశ్వరి, అతిథులు


















# ప్రజాభిప్రాయానికే పెద్దపీట

- జిల్లాల పునర్విభజనలో కొద్దిపాటి మార్పుచేర్పులు
- 927 అభ్యంతరాలు, సూచనలపై సుదీర్ఘ చర్చ
- నెల్లూరు జిల్లాకే గూడూరు...
- నక్కపల్లి డివిజన్ బదులుగా అడ్డరోడ్డు జంక్షన్
- మార్కాపురం జిల్లాకు దొనకొండ, కురిచేడు మండలాలు
- జిల్లాల పునర్విభజనపై సమీక్షలో సీఎం చంద్రబాబు
- ఈనెల 31న తుది నోటిఫికేషన్ జారీ



అమరావతి (చైతన్య రథం): జిల్లాల పునర్విభజనపై స్వల్ప మార్పుచేర్పులతో ముందుకువెళ్లాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. జిల్లాలు, డివిజన్లు, మండలాల పునర్విభజన ప్రాథమిక నోటిఫికేషన్‌పై వ్యక్తమైన సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకుని తుది నోటిఫికేషన్ జారీ చేయాలని సూచించారు. గతనెల 27న జిల్లాల పునర్విభజనపై రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసింది. కొత్తగా 3 జిల్లాలు, 5 రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుతో సహా వివిధ మార్పులపై నోటిఫికేషన్ విడుదల కాగా... దీనిపై నెలపాటు ప్రభుత్వం అభ్యంతరాలను స్వీకరించింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 927 అభ్యంతరాలు, సూచనలు రాగా... వాటిపై క్యాంపు కార్యాలయంలో శనివారం మంత్రులు, అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు.

**నెల్లూరు జిల్లాలోకే తిరిగి 5 మండలాలు**

గూడూరు ప్రజల అభిప్రాయం మేరకు గూడూరు నియోజకవర్గంలోని 5 మండలాలలను తిరిగి నెల్లూరు జిల్లాలోనే కలపాలని ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టం చేశారు. అలాగే రైల్వే కోడూరును తిరుపతి జిల్లాలో, రాయచోటిని మదనపల్లి జిల్లాలో, రాజంపేట, సిద్ధవటం, ఒంటిమిట్టను కడప జిల్లాలో విలీనం చేయాలన్న అంశంపైనా చర్చ జరిగింది. అయితే దీనిపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. విస్తీర్ణపరంగా పెద్దదైన ఆదోనిని రెండు మండలాలుగా విభజించాలనే అభిప్రాయానికి వచ్చారు. మరోవైపు, అనకాపల్లి జిల్లాలోని నక్కపల్లి డివిజన్ బదులుగా అడ్డరోడ్డు జంక్షన్ డివిజన్ ఏర్పాటు చేయాలని నిర్దేశించారు. మునగపాకను అనకాపల్లి డివిజన్‌లోనూ, అచ్యుతాపురాన్ని అడ్డరోడ్డు జంక్షన్ డివిజన్‌లో చేర్చాలని సమావేశంలో నిర్ణయించారు. రంపచోడవరం కేంద్రంగా ఏర్పాటుకానున్న పోలవరం జిల్లాలో ఎటువంటి మార్పు చేయలేదు. ప్రాథమిక నోటిఫికేషన్‌లో పేర్కొన్నట్టుగా యధావిధిగా కొనసాగించాలని సీఎం సూచించారు.

**ప్రాథమిక నోటిఫికేషన్ మేరకు ఈ ప్రాంతాలు యథావిధిగానే...**

శ్రీకాకుళం జిల్లాలోని నందిగం మండలాన్ని పలాస డివిజన్ నుంచి టెక్కలి డివిజన్‌కు మార్చడం.

అనకాపల్లి జిల్లాలోని చీడికాడ మండలాన్ని నర్సీపట్నం డివిజన్ నుంచి అనకాపల్లి డివిజన్‌కు మార్చడం.

కాకినాడ జిల్లాలోని సామర్లకోట మండలాన్ని కాకినాడ డివిజన్‌నుంచి పెద్దాపురం డివిజన్‌కు మార్చడం.

అద్దంకి రెవెన్యూ డివిజన్‌లోని అద్దంకి, బల్లికురవ, సంతమాగులూరు, జె పంగులూరు, కొరిసపాడును ప్రకాశం జిల్లాలోకి మార్పు చేయడం.

కనిగిరి రెవెన్యూ డివిజన్‌లోని మర్రిపూడి, పొన్నలూరు మండలాల్ని కందుకూరు రెవెన్యూ డివిజన్‌లోకి మార్పు... ప్రకాశం జిల్లాలో విలీనం. కందుకూరు డివిజన్‌లోని 5 మండలాలను ప్రకాశం జిల్లాకు మార్చడంతో పాటు... కందుకూరు డివిజన్‌లోని మిగిలిన రెండు మండలాలైన వరికుంటపాడు, కొండాపురం మండలాలను కావలి డివిజన్‌లోకి మార్పు.

**పలమనేరు డివిజన్‌లోని బంగారుపాలెం మండలాన్ని చిత్తూరు డివిజన్‌కు మార్పు.**

చిత్తూరు జిల్లా పలమనేరు రెవెన్యూ డివిజన్‌లోని చౌడేపల్లి, పుంగనూరును మదనపల్లి రెవెన్యూ డివిజన్‌కు మార్చడం. చిత్తూరు జిల్లా పలమనేరు రెవెన్యూ డివిజన్‌లోని సదుం, సోమలను మదనపల్లి జిల్లాలోని పీలేరు రెవెన్యూ డివిజన్‌కు మార్పు.

శ్రీ సత్యసాయి జిల్లాలో కొత్తగా మడకశిర రెవెన్యూ డివిజన్ ఏర్పాటు.

కదిరి రెవెన్యూ డివిజన్‌లోని ఆమదగురు మండలాన్ని పుట్టపర్తి రెవెన్యూ డివిజన్‌లో విలీనం.

పుట్టపర్తి రెవెన్యూ డివిజన్‌లోని గోరంట్ల మండలాన్ని పెనుకొండ రెవెన్యూ డివిజన్‌లో చేర్చాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ మార్పుచేర్పుల తర్వాత డిసెంబర్ 31న తుది నోటిఫికేషన్‌ను ప్రభుత్వం విడుదల చేయనుంది. సమావేశంలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, నారాయణ, అనిత, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ప్రపంచానికి వెలుగు క్రీస్తు జననం

- ప్రేమ, దయ, త్యాగమే నిజమైన మార్గదర్శకం
- మంత్రి నిమ్మల రామానాయుడు ఉద్బోధ
- ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు



పాలకొల్లు (చైతన్యరథం): ఏసుక్రీస్తు జననం ప్రపంచానికి ఒక వెలుగు వంటిదని, ఆయనలోని ప్రేమ, దయ, త్యాగ గుణాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు ఉద్బోధించారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో శనివారం సాయంత్రం తన నివాసం వద్ద ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన క్రిస్మస్ ఆరాధన మహోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాలకొల్లు నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు, పట్టణంలోని అన్ని వార్డుల నుంచి వేలాదిగా క్రైస్తవ సోదర,సోదరీమణులు హాజరయ్యారు. ముందుగా మంత్రి రామానాయుడు క్రిస్మస్ కేకును కట్ చేసి అందరితో పంచుకున్నారు. వందమందికి పైగా పాస్టర్లను కుటుంబ సమేతంగా సత్కరించి నూతన వస్త్రాలు బహుకరించారు.

భారీ సెట్టింగ్, డిజిటల్ లైటింగ్ ఎఫెక్ట్స్‌తో గంటన్నర పాటు 70 మంది కళాకారులు ప్రదర్శించిన క్రీస్తు జననం నాటిక మంచి సందేశంతో అందరినీ ఆకట్టుకుంది. ప్రముఖ సినీ గాయకురాలు ఎం.ఎం. శ్రీలేఖ ఆలపించిన క్రైస్తవ గీతాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పాస్టర్ల సందేశాలు, భక్తిగీతాలు భక్తులను మంత్రముగ్ధులను చేశాయి. మంత్రి రామానాయుడు తన ప్రసంగంలో పవిత్ర బైబిల్ గ్రంథంలోని.. నీ మంచిని, ప్రేమని మాటల్లోనే కాదు, నీ చేతల ద్వారా కూడా చూపించు.. అప్పుడే నీవు నిజంగా క్రీస్తు మార్గాన్ని అనుసరిస్తున్నట్టు.. అనే వాక్యాన్ని గుర్తు చేశారు. క్రీస్తు మార్గం అనుసరణీయమని, ఆచరణీయమని అన్నారు. ఏసు ప్రభువును స్ఫూర్తిగా తీసుకొని సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలన్నారు. క్రీస్తు మార్గంలో క్రైస్తవ సంస్థలు, మిషనరీ సంస్థలు ఉచితంగా విద్య, వైద్యం, సామాజిక సేవలు అందించడం అభినందనీయమన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, కూటమి నాయకులు బోణం చినబాబు, ఉన్నమట్ల కబర్ది, ఎర్రంశెట్టి పద్మారావు, పెచ్చెట్టి వెంకట నరసింహారావు, తులా రామలింగేశ్వరరావు, పాస్టర్లు గోబేరు యేసు కృపా శాంసన్, బత్తుల దేవదానం, జిఎస్ కుమార్, విప్పర్తి విజయరత్నం, ఎస్ ఎబినైజర్, రాపాక రత్నం రాజు, దానియేల్ పాల్గొన్నారు. కార్యక్రమ సంధానకర్తలుగా పాముల రజిని కుమార్, ఫౌండేషన్ కన్వీనర్ ఆర్‌వి అప్పారావు వ్యవహరించారు. ఫౌండేషన్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు అందరికీ ప్రేమ విందు ఏర్పాటు చేశారు.

## రాజధాని రైతుల సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నాం

*- కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్*



అమరావతి (చైతన్యరథం): రాజధాని కోసం భూములిచ్చిన రైతులకు లింక్ డాక్యుమెంట్లు అడగకుండా రుణాలు ఇచ్చేందుకు బ్యాంకర్లు అంగీకరించారని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు. రిటర్నబుల్ ప్లాట్లకు సంబంధించి సీఆర్డీఏ ఇచ్చే డాక్యుమెంట్ ఆధారంగానే రుణాలు ఇచ్చేందుకు సమ్మతించారని పేర్కొన్నారు. రాజధాని రైతుల సమస్యలపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ సభ్యులైన పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే తాడికొండ శ్రవణ కుమార్.. సీఆర్డీఏ కార్యాలయంలో శనివారం సమావేశమై దాదాపు 3 గంటల పాటు వివిధ అంశాలపై చర్చించారు.

అనంతరం కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మీడియాతో మాట్లాడుతూ.. భూ వివాదాలకు సంబంధించిన అంశాలను త్వరలోనే ఓ కొలిక్కి తీసుకొస్తామన్నారు. జరీబు భూముల సమస్యపై సర్వే పూర్తి చేశామని, కమిటీ నివేదిక ఆధారంగా జరీబు రైతులకు న్యాయం చేస్తామన్నారు. అసైన్డ్ భూముల న్యాయ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. త్రీ మెన్ కమిటీ నిర్ణయం ప్రకారం లంక భూముల రిజిస్ట్రేషన్ విషయంలో 356 మందికి గాను ఇంకా 277 మంది నమోదు చేసుకోవాల్సి ఉందని, వారంతా త్వరగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. రైతుల సమస్యలను ఒక్కోటిగా పరిష్కరిస్తూ వస్తున్నామన్నారు. ఇప్పటి వరకు లంక భూములు, అసైన్డ్ భూముల సమస్యలను పరిష్కరిస్తూ వస్తున్నట్లు చెప్పారు. వీధి పోటుకు సంబంధించి మరో రెండు అంశాలు రైతుల కోరుతున్నారని. ఆ అంశాలను తర్వాత పరిగణిస్తామని స్పష్టం చేశారు. హెల్త్ కార్డులు, పెన్షన్లు, తదితర అంశాలపై కూడా చర్చించినట్లు చెప్పారు. రాజధాని నిర్మాణ పనుల్లో అమరావతి ప్రాంతానికి చెందిన దాదాపు 10వేల మందికి ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామాల్లో అభివృద్ధి పనులను జనవరి 1 నుంచి ప్రారంభించేందుకు సన్నహాలు చేస్తున్నామన్నారు.

**వారందరికీ పెన్షన్లు: ఎమ్మెల్యే శ్రావణ్**

ప్రతి గ్రామంలో కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ అన్నారు. రోడ్ల నిర్మాణలు, భారీ వాహనాల రాకపోకల వల్ల కొన్ని చోట్ల శ్మశాన ప్రాంతాలు ఇబ్బందికరంగా మారుతున్నాయన్నారు. మల్కాపురం, వెంకటాపురం గ్రామాల్లో శ్మశానాలు లేవని... అలాగే మరికొన్ని ప్రాంతాల్లో శ్మశాన వాటికలు ఏర్పాటు చేయాలని చెప్పామన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో నాలుగు వేలకు పైగా పెన్షన్లను తీసేశారని ఎవరెవరికి పెన్షన్లు రావటం లేదనే వివరాలు సేకరిస్తున్నామన్నారు. అలాగే కొత్తగా పెళ్లయిన వారికి కూడా పెన్షన్లు అందజేయాలని చూస్తున్నామని చెప్పారు.

# కత్తులు దూస్తే కటకటాలే

- రప్పా రప్పా అని రెచ్చిపోతే జైలుకే
- ప్రపంచంలో ఎక్కడైనా పుట్టినరోజు కేకులను వేటకొడవళ్లు, తల్వార్లతో కట్ చేస్తారా?
- వికృత చేష్టలతో వైసీపీ సైకోమూకల ఉన్మాదం
- ప్రజలు బుద్ధిచెప్పినా హింసా నైజం మార్చుకోని జగన్
- అధికారం కోల్పోయినా రాజకీయ ముసుగులో రౌడీయిజం
- సమాజంలో భయత్పాతం సృష్టించే కుట్ర
- గర్భిణిపై దాడి కేసులో నీచుడిని అరెస్ట్ చేస్తే జనసేన కార్యకర్త అని విష ప్రచారం
- చంద్రబాబు నేతృత్వంలో శాంతిభద్రతలకు అత్యంత ప్రాధాన్యత
- కూటమి పాలనలో హింసా రాజకీయాలకు తావులేదు
- హోం మంత్రి వంగలపూడి అనిత స్పష్టం

అమరావతి (చైతన్యరథం): కత్తులు పట్టుకుని రోడ్లమీద ఉన్మాదుల్లా తిరిగితే కటకటాలు తప్పవని హోంమంత్రి వంగలపూడి అనిత హెచ్చరించారు. రాజకీయ ముసుగులో వైసీపీ నాయకులు, కార్యకర్తలు ప్రదర్శిస్తున్న ఉన్మాదపు చర్యలపై ఆమె తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పుట్టినరోజు వేడుకల పేరుతో సమాజానికి హానికరమైన సంప్రదాయాలను ప్రోత్సహించడం గర్హనీయమన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. సాధారణంగా పుట్టినరోజు అంటే అన్నదానం చేయడం, రోగులకు పళ్ళు, రొట్టెలు పంచడం, రక్తదానం చేయడం లేదా గుడిలో పూజలు నిర్వహించడం వంటి సేవా కార్యక్రమాలు చేస్తారు.. కానీ వైసీపీ నాయకులు దీనికి భిన్నంగా రౌడీయిజాన్ని రెచ్చగొట్టేలా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. కేక్ కట్ చేయడానికి చిన్న ప్లాస్టిక్ కత్తి వాడటం మన సంప్రదాయం. కానీ వైసీపీ శ్రేణులు కొడవళ్ళు, వేటకొడవళ్ళు, పెద్ద పెద్ద కత్తులతో కేక్ కట్ చేస్తూ భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. ఇది సైకో తత్వానికి పరాకాష్ట. కేవలం కత్తుల ప్రదర్శనతో ఆగకుండా, ఆ కత్తులతోనే మూగజీవాలను బలి ఇచ్చి, ఆ రక్తంలో వారి నాయకుడి ఫ్లెక్సీలకు అభిషేకం చేయడం అత్యంత అమానుషం. ఇలాంటి హింసాత్మక చర్యలు సమాజానికి ఏం సందేశాన్ని ఇస్తున్నాయో తెలుసుకోవాలి. "రప్పా రప్పామని నరుకుతాం.. 2029లో ఇదే రిపీట్ అవుతుంది" అంటూ నినాదాలు చేయడం వారి నేరపూరిత ఆలోచనలకు అద్దం పడుతోంది. అధికారం కోల్పోయినా ఇంకా ప్రజలను భయభ్రాంతులకు గురిచేయాలని చూడటం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం. రాష్ట్ర అభివృద్ధికి ఆటంకం కలిగించడానికి, ప్రజల్లో అలజడి సృష్టించడానికి ఎంతటి నేరానికైనా వీరు వెనకాడటం లేదనే విషయాన్ని ప్రజలు గమనించాలని హోం మంత్రి అనిత కోరారు.

### భయోత్పాతం సృష్టించేందుకే..

ఇంట్లో పిల్లల లేదా పెద్దల పుట్టినరోజులు మనందరం ఎంతో పవిత్రంగా, ప్రేమగా జరుపుకుంటాం. కానీ వైసీపీ నాయకులు గంగమ్మ జాతరలో పొట్టేలును కోసినట్లుగా వీధుల్లో కత్తులు తిప్పుతూ రౌడీయిజం చేయడం దారుణం. ఇలాంటి ఉన్మాద చర్యలను ప్రభుత్వం సహించబోదు. మాజీ మంత్రులు, సీనియర్ నాయకుల సమక్షంలోనే వైసీపీ కార్యకర్తలు వీధి రౌడీల్లా ప్రవర్తిస్తూ, సమాజంలో భయోత్పాతాన్ని సృష్టిస్తున్నారు. రాజకీయ ముసుగులో సాగుతున్న ఈ "ఫ్యాక్షన్ సంస్కృతి" రాష్ట్ర భవిష్యత్తుకు ప్రమాదకరం. వేడుకల పేరుతో ఇష్టానుసారంగా టపాసులు కాల్చుతుంటే, ఇబ్బంది కలిగి పక్కకు వెళ్లమని కోరిన ఒక గర్భిణీ స్త్రీని కడుపుపై కాలితో తన్నడం వారి ఉన్మాదానికి పరాకాష్ట. గర్భిణులకు గౌరవం ఇచ్చే మన సంస్కృతిని మంటగలిపి, పసికందు ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఇలాంటి సైకోలపై కఠిన చర్యలు తప్పవు. రోడ్ల మీద మూగజీవాలను నరుకుతూ వీడియోలు తీయడం ఆ పార్టీ సైకో తత్వానికి నిదర్శనం. రాష్ట్రవ్యాప్తంగా 11,12 నియోజకవర్గాల్లో ఒకే రోజు, ఒకే పద్ధతిలో జంతుబలులు, కత్తులతో ప్రదర్శనలు జరిగాయంటే.. ఇది యాదృచ్ఛికం కాదు, ముందస్తుగా పన్నిన కుట్ర అని స్పష్టమవుతోంది. కళ్యాణదుర్గం, ఉరవకొండ, సింగనమల, రాప్తాడు, కుప్పం, తదితర నియోజకవర్గాల్లో ఒకే రోజు, ఒకే తరహాలో జంతు బలులు, రక్తాభిషేకాలు జరిగాయంటే.. ఇది జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జరిగిన వ్యవస్థీకృత నేరమేనని స్పష్టమవుతోందని హోంమంత్రి అనిత అన్నారు.

### తల్లిదండ్రులు ఆలోచించాలి

మాజీ మంత్రులు పక్కనే ఉండి ప్రోత్సహిస్తుంటే, కార్యకర్తలు మేకల తలలు నరికి సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. "2029లో ఇలాగే నరుకుతాం" అని బహిరంగంగా ఫ్లెక్సీలు కట్టడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే. గర్భిణిపై దాడి చేసిన వ్యక్తిని కాపాడటానికి, అతను జనసేన కార్యకర్త అని వైసీపీ నేతలు అబద్ధాలు ప్రచారం



చేయడం సిగ్గుచేటు. జగన్ పుట్టినరోజు వేడుకల్లో జనసేన వారు టపాసులు ఎందుకు కాలుస్తారో ఆ మాత్రం ఇంగితం లేదా అని ప్రశ్నించారు. గతంలో చంద్రబాబు నాయుడు ఫ్యాక్షనిజాన్ని, మత విద్వేషాలను ఉక్కుపాదంతో అణిచివేసి రాష్ట్రాన్ని ప్రశాంతంగా ఉంచారు. కానీ నేడు వైసీపీ రాజకీయ ముసుగులో కొత్త తరహా రౌడీయిజాన్ని పురికొల్పుతూ, రాష్ట్ర అభివృద్ధికి ఆటంకం కలిగిస్తోంది. క్రోనలాజికల్ డేటా ప్రకారం చూస్తే, ఇటీవల జరిగిన హింసాత్మక ఘటనల్లో 18 ఏళ్ల లోపు పిల్లలు కూడా కత్తులు పట్టుకుని రోడ్ల మీదకు వస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు గంజాయితో యువతను పాడుచేసిన జగన్, ఇప్పుడు ప్రతిపక్షంలో ఉండి వారిని నేరస్థులుగా మారుస్తున్నారు. మీ పిల్లలను ఏ పార్టీ వెనుక పంపిస్తున్నారో తల్లిదండ్రులు ఆలోచించుకోవాలి. ఆస్తి కోసం తల్లిని, సొంత చెల్లిని కోర్టులకు ఈడ్చిన వ్యక్తి, రేపు మీ పిల్లలు కేసుల్లో ఇరుక్కుంటే రక్షిస్తాడని అనుకోవడం భ్రమ. అరాచక శక్తుల వెనుక పంపి పిల్లల జీవితాలను నాశనం చేసుకోవద్దని తల్లిదండ్రులకు హోంమంత్రి హితవు చెప్పారు.

### హింసను ప్రేరేపించటమే వైసీపీ నైజం

జగన్ హయాంలో డాక్టర్ సుధాకర్ వెంటాడి వేధించి ఆత్మహత్య చేసుకునే పరిస్థితులు కల్పించడం, ఎమ్మెల్సీ అనంతబాబు ద్వారా డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య (డోర్ డెలివరీ), చెల్లిని ఏడిపించారని ప్రశ్నించిన అమర్నాథ్ గౌడ్ అనే బాలుడిని పెట్రోల్ పోసి తగలబెట్టిన ఘటనలు మర్చిపోలేం. అధికారంలో ఉన్నా లేకపోయినా హింసను ప్రేరేపించడమే వైసీపీ నైజం. ఈ నేర రాజకీయాలతో విసిగిపోయిన ప్రజలు ఎన్నికల్లో 11 సీట్లకు పరిమితం చేసినా వారి తీరు మార్చుకోకుండా ఇంకా ఉన్మాదాన్ని ప్రోత్సహిస్తూనే ఉన్నారు. నాయకుడిగా కాకున్నా.. కనీసం మనిషిగా ఇలాంటి హింసను జగన్ ఎలా సమర్థిస్తున్నారో అర్థం కావటం లేదు. రాష్ట్రంలో వైద్య విద్యను పేదలకు చేరువ చేసేందుకు సీఎం చంద్రబాబు నాయుడు మెడికల్ కాలేజీలను నిర్మిస్తుంటే, టెండర్లు వేసే వారిని అరెస్ట్ చేస్తానంటూ జగన్ బెదిరించడం ఆయన వినాశకర ఆలోచనలకు నిదర్శనం. గతంలో లాగే మళ్లీ భయభ్రాంతులకు గురిచేయాలని చూస్తున్నారని హోంమంత్రి అనిత ఆగ్రహం వ్యక్తం చేశారు.

### సమాజంలో అలజడి రేపే కుట్ర

జగన్మోహన్ రెడ్డి తన మనుషులను పంపి ఎన్ని భయభ్రాంతులకు గురిచేయాలని చూసినా, వారిని ఎలా అరికట్టాలో మాకు తెలుసు. ఇక్కడ అధికారంలో ఉన్నది చంద్రబాబు నాయుడు. శాంతిభద్రతల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదు. రోడ్ల మీద కత్తులు, కొడవళ్లు పట్టుకుని "రప్పా రప్పా నరుకుతాం" అని తిరిగే ఉన్మాదులను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టం. ఫ్లెక్సీలపై రక్తాభిషేకాలు చేసిన ప్రతి ఒక్కరి జాతకం మా దగ్గర ఉంది. గతంలో లాగా ముసుగులేసి దాచడం కాదు.. ప్రతి నేరస్థుడిని రోడ్డు మీద నిలబెట్టి ప్రజలకు చూపిస్తాం. రౌడీయిజం చేస్తామంటే మా డిపార్ట్మెంట్ సిద్ధంగా ఉంది. ఇప్పటికే రౌడీ షీటర్లను రోడ్ల మీద నడిపిస్తున్నాం. పరిస్థితి విషమిస్తే, అరాచక శక్తులను రాష్ట్ర బహిష్కరణ చేయడానికి కూడా వెనుకాడం. ముఖ్యమంత్రి ఆదేశాలు చాలా స్పష్టంగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక క్రైమ్ రేట్ 4% తగ్గింది. శాంతిభద్రతలు బాగున్నాయి కాబట్టే రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు వస్తున్నాయి. ఈ అభివృద్ధిని చూసి ఓర్వలేకే జగన్ తన రౌడీ మూకలతో అలజడి సృష్టించాలని చూస్తున్నారు. బాబాయి హత్యను అడ్డం పెట్టుకుని అధికారంలోకి వచ్చి, ఎంతోమంది ప్రాణాలను తీసి, అవినీతికి పాల్పడిన చరిత్ర జగన్‌ది. ప్రజలు ఛీ కొట్టినా ఇంకా బుద్ధి తెచ్చుకోకుండా యువతను సైకోలుగా మారుస్తున్నారు. మీ బిడ్డలకు ఉద్యోగ అవకాశాలు ఇవ్వాలని మేము 'స్కిల్ డెవలప్మెంట్' సెంటర్లు పెడుతుంటే, జగన్ వారి చేతికి కత్తులు ఇస్తున్నారు. కత్తులు పట్టుకునే నాయకుడి వెనుక మీ పిల్లలను పంపి వారి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు. భరోసా ఇచ్చే నాయకుడిని ఎంచుకోండి. 17, 18 ఏళ్ల వయసున్న పిల్లలు ఇంటర్, డిగ్రీ చదువుకుంటూ రేపు పొద్దున తమను చూసుకుంటారని తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకుంటారు. అటువంటి బిడ్డల చేతికి కత్తులు ఇచ్చి, రక్తాభిషేకాలు చేయించి వారిని జైలు పాలు చేసిన జగన్మోహన్ రెడ్డి ఆ కుటుంబాలకు ఏం సమాధానం చెబుతారని హోంమంత్రి అనిత ప్రశ్నించారు.

### ఎవరైనా సరే.. చట్ట ప్రకారం చర్యలు

కార్యకర్తలు తప్పు చేస్తే సరిదిద్దాల్సింది పోయి, "రప్పా రప్పా నరుకుతామంటే తప్పేంటి?" అని ఆ పార్టీ అగ్రనేతలే మాట్లాడటం వారి ఉన్మాదానికి నిదర్శనం. మా నాయకుడు చంద్రబాబు నాయుడు ఎప్పుడూ మాటల్లో సంస్కారం ఉండాలని, మనం మాట్లాడే మాట కోట్లాది మందికి ఆదర్శంగా ఉండాలని మాకు నేర్పిస్తారు. బహిరంగంగా కత్తులు పట్టుకుని తిరగడం 'ఆర్మ్స్ యాక్ట్' కింద నేరం. ఇలాంటి ఉన్మాద చర్యలకు పాల్పడిన వారిపై చట్టం తన పని తాను చేసుకుపోతుంది. చట్టం ముందు ఎవరూ అతిథులు కాదు, నేరస్థులు మాత్రమే. అనకాపల్లి జిల్లాలో రౌడీ షీటర్లపై పీడీ యాక్ట్ నమోదు చేయడంపై స్పందిస్తూ.. పోలీసులు పూర్తి ఆధారాలతో, చట్టపరమైన నిబంధనల ప్రకారమే చర్యలు తీసుకుంటున్నారని మంత్రి అనిత స్పష్టం చేశారు. 19 కేసులు ఉన్నా కూడా బుద్ధి మారని వారిపై పీడీ యాక్ట్ ప్రయోగించడం తప్పేమీ కాదు. కోర్టులు కూడా దీనిని అర్థం చేసుకుంటాయి. గతంలో చంద్రబాబు నాయుడు ఫ్యాక్షనిజాన్ని అణిచివేసే క్రమంలో సొంత పార్టీ వారైనా సరే తప్పు చేస్తే కేసులు పెట్టిన చరిత్ర ఉంది. రాష్ట్ర అభివృద్ధికి, సంక్షేమానికి ఆటంకం కలిగించేలా ఎవరు ప్రవర్తించినా సహించేది లేదు. అది వైసీపీ అయినా, టీడీపీ అయినా, జనసేన లేదా బీజేపీ అయినా.. ఎవరైనా సరే రోడ్ల మీద ఉన్మాదుల్లా ప్రవర్తిస్తే చట్టం తన పని తాను చేసుకుపోతుంది. లా అండ్ ఆర్డర్ విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని హోంమంత్రి అనిత స్పష్టం చేశారు.

### రాష్ట్రంపై నమ్మకాన్ని దెబ్బతీసేందుకే..

ఈ ఒకటిన్నర ఏళ్లలో లక్షల కోట్ల పెట్టుబడులు, వేల ఉద్యోగాలు రాష్ట్రానికి వస్తున్నాయి. గూగుల్ వంటి డేటా సెంటర్లు, భారీ పరిశ్రమలు, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు అవుతున్నాయి. ప్రజల్లో భద్రతా భావం పెరిగింది. ఈ నమ్మకాన్ని దెబ్బతీసి, రాష్ట్ర ఉనికిని ప్రమాదంలో నెట్టడానికే జగన్మోహన్ రెడ్డి తన రౌడీ మూకలతో అలజడి సృష్టిస్తున్నారు. జగన్మోహన్ రెడ్డి చిన్న పిల్లల చేతికి కత్తులు ఇచ్చి వారి భవిష్యత్తును నాశనం చేస్తున్నారు. దీనికి విరుద్ధంగా మా యువ నాయకుడు, మంత్రి లోకేష్ విజ్ఞతను గమనించండి. ఎక్కడైనా చిన్న పిల్లలు పార్టీ జెండా పట్టుకున్నా, పార్టీ టీషర్టులు వేసుకున్నా.. బాబూ, నీది చదువుకునే వయసు, రాజకీయాలు ఎందుకు? అని జెండా పక్కన పెట్టించి చదువుకోమని పంపిస్తున్నారు. అంతటి ఉన్నతమైన సంస్కృతి మాది. ఏ నాయకుడు మన బిడ్డల భవిష్యత్తు కోరుకుంటున్నాడు, ఏ నాయకుడు వారిని నేరస్థులుగా మారుస్తున్నాడు అన్నది తల్లిదండ్రులు ఆలోచించాలి. ఇటువంటి ఉన్మాద రాజకీయ పార్టీలకు మద్దతు ఇవ్వడం అంటే మన బిడ్డల భవిష్యత్తును మనమే నాశనం చేసుకోవడమే. రాజకీయ పార్టీ నాయకుడిగా కాకుండా, ఒక బాధ్యత గల పౌరురాలిగా చెబుతున్నాను.. ఇలాంటి సైకోయిజాన్ని ప్రజలు గ్రహించాలి. చట్టాన్ని అతిక్రమించే ఎవరినైనా సరే కటకటాల వెనక్కి నెట్టడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని హోంమంత్రి అనిత తేల్చి చెప్పారు.

## మాజీ ఎంపీ కంభంపాటికి టీడీపీ సీనియర్ నేతల పరామర్శ



గన్నవరం (చైతన్యరథం): మాతృ వియోగానికి గురైన తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ కంభంపాటి రామ్మోహన్ రావును పార్టీ సీనియర్ నాయకులు పరామర్శించారు. కంభంపాటి రామ్మోహన్ రావు మాతృమూర్తి వెంకటనరసమ్మ ఇటీవల మరణించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గుంటూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పిల్లి మాణిక్యాలరావు, తెలుగుదేశం పార్టీ నాలెడ్జ్ సెంటర్ చైర్మన్ గురజాల మాల్యాద్రి, తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి బండారు వంశీకృష్ణ, పార్టీ నాయకుడు చిల్లర రాంబాబు శనివారం కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గం పెదఅవుటుపల్లి గ్రామంలోని వారి స్వగృహానికి వెళ్లి రామ్మోహన్‌రావును పరామర్శించారు.

## బనగానపల్లెలో మంత్రి జనార్ధన్‌రెడ్డి పర్యటన

**- హాస్టళ్లు, డిగ్రీ కాలేజీలో తనిఖీలు**

**- బోధన, మౌలిక వసతులపై ఆరా**



బనగానపల్లె (చైతన్యరథం): మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి శనివారం బనగానపల్లెలో పర్యటించారు. బీసీ బాలురు సంక్షేమ హాస్టల్‌ను సందర్శించి మౌలిక వసతులపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. టీచర్లు పాఠ్యాంశాలు బోధిస్తున్న తీరు, సిలబస్ ఎంత వరకు పూర్తయింది వంటి అంశాలపై ఆరా తీశారు. కిచెన్ రూమ్‌ను సందర్శించి ఆహార పదార్థాల నాణ్యతను స్వయంగా రుచి చూసి తెలుసు కున్నారు. హాస్టల్లో పారిశుధ్యం, మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టాలని హాస్టల్ వార్డెన్‌లకు ఆదేశించారు. అనంతరం బనగాన పల్లె ఏపీ మోడల్ స్కూల్‌ను సందర్శించారు. పాఠ్యాంశాల బోధన, మౌలిక వసతులపై విద్యార్థులను ఆరా తీశారు. ఈ సందర్భంగా గర్ల్స్ హాస్టల్ విద్యార్థులు తాగునీటి సమస్యను మంత్రి దృష్టికి తీసుకురాగా..తక్షణమే రూ.3 లక్షలు సొంత నిధులతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఆ తర్వాత బనగానపల్లె ప్రభుత్వ డిగ్రీ కాలేజీని సందర్శించారు. నూతనంగా నిర్మిస్తున్న భవనాలను పరిశీలించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టంను ఆదేశించారు.

# గ్రేటర్ నగరాలుగా విజయవాడ, తిరుపతి

**జనాభా సర్వే తర్వాతే ప్రాసెస్ ప్రారంభం: పురపాలక మంత్రి పొంగూరు నారాయణ**

అమరావతి(చైతన్యరథం): తిరుపతి, విజయవాడలను గ్రేటర్ నగరాలుగా తీర్చిదిద్దేందుకు నిర్ణయించినట్లు పురపాలక మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. అయితే వెంటనే చేయడానికి కొన్ని ఇబ్బందులు ఉన్నాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం జనాభా సర్వే ప్రారంభించింది. జనాభా సర్వే పూర్తయ్యే వరకు డీ లిమిటేషన్స్ చేయవద్దని నిబంధనలు ఉన్నాయి. సర్వే పూర్తయిన తర్వాత గ్రేటర్ తిరుపతి, గ్రేటర్ విజయవాడ ప్రాసెస్ ప్రారంభమవుతుందని తెలిపారు. భూ సేకరణ భూములలో ప్లాట్లు ఇచ్చిన వారికి ఫోన్లు చేశాం. 250 మందికి గాను 42 మంది మాత్రమే మార్చుకోవడానికి నిర్ణయించుకున్నారు. 42 మందిలో 16 మందికి ప్లాట్లు మార్చి లాటరీ తీయడం కూడా జరిగింది. మిగిలిన వారిలో 8 మంది మాత్రమే తీసుకుంటామని చెప్పారు. మిగతా వారు వేచి చూస్తామని చెప్పారని తెలిపారు. ఎవరికైనా భూ సేకరణ భూమిలో ఇస్తే మార్చుకోవాలంటే ప్రభుత్వాన్ని సంప్రదిస్తే వెంటనే మార్చి ఇచ్చేస్తామని వివరించారు. కొన్ని నిబంధనలకు అనుగుణంగా జరీబ్, నాన్ జరీబ్ గుర్తించడం జరిగింది.



కొంతమంది మా భూములు కూడా జరీబ్‌గా గుర్తించాలని విజ్ఞప్తులు చేశారు. ఈ విజ్ఞప్తులపై కలెక్టర్ ఆధ్వర్యంలో డిస్ట్రిక్ కమిటీని ఏర్పాటు చేశాం. ఈ కమిటీ పరిశీలన చేసి చాలా వరకు రిజెక్ట్ చేసింది. మరోసారి తమ భూములు పరిశీలించాలని రైతులు విజ్ఞప్తులు చేశారు. స్టేట్ లెవెల్‌లో ఒక కమిటీ ఏర్పాటు చేశాం. ఈ కమిటీ లు జాయింట్ కలెక్టర్, జాయింట్ కలెక్టర్ గ్రౌండ్ వాటర్ డిపార్ట్‌మెంట్‌తో కలిపి ఐదుగురు సభ్యులు ఉంటారు. 45 రోజుల్లో ప్రాసెస్ కంప్లీట్ చేయమని ఆదేశించాం. 2014 డిసెంబర్ 8 నాటి శాటిలైట్ పిక్చర్స్ ప్రకారం గుర్తించాలని ఆదేశాలు ఇచ్చాం. వచ్చే రిపోర్ట్ ఆధారంగా ఈ సమస్య ను పరిష్కరిస్తాం. రాజధానిలో ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతుంది. గతంలో 90 మంది రిజిస్ట్రేషన్ చేసుకునేవారు. ఇప్పుడు 10 నుంచి 30 మంది రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు. కొంతమంది విదేశాల్లో ఉన్నారని, కొంతమంది మంచి రోజు చూసుకొని చేసుకుంటామని, కొంతమంది అభివృద్ధి చెందిన తర్వాత చేసుకుంటామని కారణాలు చెబుతున్నారు. రైతులకు బ్యాంకు లోన్స్ కోసం 30 సంవత్సరాల లింక్ డాక్యుమెంట్స్ అడుగుతున్నారు. లింక్ డాక్యుమెంట్స్‌తో సంబంధం లేకుండా లోన్స్ ఇచ్చేం దుకు బ్యాంకులతో మాట్లాడాం. గన్నవరం భూములపై మూడు ప్రతిపాదనలు వచ్చాయి. ఈ మూడు ప్రతిపాదనలపై భూ యాజమా లతో మాట్లాడమని ఆదేశించాం. గ్రామాల్లో కల్పించే మౌలిక సదుపాయాల డిజైన్స్ పూర్తి చేశారు. ఆ డిజైన్స్ శాసనసభ్యులకు అందజే యమని చెప్పాం. డిజైన్స్‌పైన గ్రామ పెద్దలు, ప్రజలతో ఎమ్మెల్యేలు మాట్లాడాలని చెప్పాం. ప్రజల సూచనలు, సలహాలు చెబితే వాటిని డిజైన్స్‌లో కలపమని సూచించినట్లు తెలిపారు.

# అభివృద్ధికి కేరాఫ్ కూటమి ప్రభుత్వం

- **వైసీపీ నేతలు రప్పా రప్పా అంటున్నారు**
- **రక్తభిషేకాలతో రాక్షసుల్లా ప్రవర్తిస్తున్నారు**
- **చోరంపూడిలో రూ.2 కోట్ల పనులు సంతోషకరం**
- **ప్రారంభోత్సవాల్లో మంత్రి కొల్లు రవీంద్ర**



పెడన(చైతన్యరథం): కూటమి ప్రభుత్వం అభివృద్ధికి సంక్షేమానికి తొలి ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. కృష్ణా జిల్లా పెడన నియోజకవర్గం బంటుమిల్లి మండలం చోరంపూడిలో సుమారు రూ.2 కోట్ల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను స్థానిక ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌తో కలిసి ప్రారంభించారు. సీపీడబ్ల్యూఎస్ క్వార్టర్స్ వద్ద రూ.12.50 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు, రూ.5.90 లక్షల గ్రామ పంచాయతీ నిధులతో బైపాస్ రోడ్డు వరకు సీసీ రోడ్డు, జిల్లా పరిషత్ స్కూల్ నుంచి ఎస్టీ కాలనీ వరకు రూ.3.64 లక్షల సీఎస్‌ఆర్ నిధులతో నిర్మించిన పైపులైన్, ఉపాధి హామీ నిధులు రూ.10 లక్షలతో ఎంపీపీ స్కూల్ వద్ద, రూ.20 లక్షల నిధులతో ఆర్‌అండ్‌బీ రోడ్డు, రూ.23.94 లక్షలతో రైతు సేవా కేంద్రం, రూ.43.60 లక్షల పంచాయతీ కార్యాలయం, 15వ ఆర్థిక సంఘం నుంచి వచ్చిన రూ.20.20 లక్షలతో రీటైనింగ్ వాల్, సీసీ రోడ్డు పనులను ప్రారంభిం చారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి చేస్తుంటే.. జగన్‌రెడ్డి అండ్ బ్యాచ్ రాష్ట్రంలో రక్తపాతం సృష్టిస్తోందన్నారు. రాక్షసుల్లా రక్తభిషేకాలు చేయించుకుంటున్నారు. ఒక పంచాయతీలో సుమారు రెండు కోట్ల విలువైన పనులు పూర్తి చేసి ఒకేరోజు ప్రారంభించుకోవడం సంతోషంగా ఉంది. రైతు సేవా కేంద్రం, పంచాయతీ కార్యాలయం ఏర్పా టు సంతోషంగా ఉంది. నియోజకవర్గంలో ఈ స్థాయి అభివృద్ధి కాగిత కృష్ణ ప్రసాద్ చిత్తశుద్ధికి నిదర్శనం. బందరు పోర్టును 2026 నాటికి పూర్తి చేయబోతున్నాం. తద్వారా వచ్చే పరిశ్రమల్లో యువతకు ఉద్యోగాలు కల్పిస్తాం. పోర్టుకు అనుసంధానంగా 6 వరుసల రోడ్డు ఏర్పాటు చేస్తున్నాం. ఇంత అభివృద్ధి చేస్తుంటే వైసీపీ నేతలు ప్రభుత్వంపై కుట్రలు చేస్తున్నారు. ఇదే నియోజకవర్గ నుంచి ప్రాతినిధ్యం వహించిన వ్యక్తి కూటమి ప్రభుత్వాన్ని ఇరికించాలని ప్రయత్నించి కల్తీ మద్యం కేసులో తానే ఇరుక్కున్నాడు. ఇలాంటి అక్రమార్కుల విషయంలో ప్రజల అప్రమత్తంగా ఉండాలి. సూపర్ సిక్స్ హామీలను సూపర్ హిట్ చేశాం. త్వరలోనే అర్హులందరికీ ఇళ్ల పట్టాలు అందించనున్నాం. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి బాటలు నడిపించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. గ్రామస్థాయిలో అభివృద్ధి కోసం కమిటీలు ఏర్పాటు చేస్తున్నాం. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రజలు గమనించాలని కోరారు. ఈ కార్యక్ర మంలో జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ, లంకె నారాయణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల వెంకన్నకు వైసీపీ ముఠా ద్రోహం

**తప్పుడు వదంతులకు అడ్డకట్ట వేయాలి**

**బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్**

మంగళగిరి (చైతన్యరథం): తిరుమలలో వైకుంఠ ఏకాదశి ఏర్పా ట్లు పకడ్బందీగా జరుగుతున్నాయని ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్ అన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా 10 రోజులు ఏకాదశి దర్శనాలు సవ్యంగా జరిగేలా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందన్నారు. తిరుమలలో భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం ముగ్గురు వ్యక్తులతో కమిటీ వేసిందని పేర్కొన్నారు. ఇప్పటికే మంత్రులు అనగాని సత్యప్రసాద్, వంగలపూడి అనిత ఏర్పాట్లు పరిశీలించారని తెలిపారు. భక్తుల చాటున వైసీపీ ముఠా తిరుమలకు వచ్చి తప్పుడు వదంతులు వ్యాప్తి చేస్తారని.. అలాంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మొన్న సాక్షి మీడియాలో తిరుమల తొక్కిసలాట అంటూ ప్రచురించిన తప్పుడు వార్తను తీవ్రంగా ఖండించారు. తిరుమలలో ప్రశాంత వాతావరణం ఉందని.. అలాంటిది ఏం జరగలేదని వివరించారు. ఫేక్ ప్రచారాలకు వైసీపీ కేరాఫ్ అడ్రాస్ గా మారిందని విమర్శించారు. తాడేపల్లి పెద్ద జగన్మోహన్‌రెడ్డి ఇలాంటి ఫేక్ ఆర్టిస్టులను ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. గతంలో కాకినాడ వైసీపీ కార్యకర్త ఇలానే తప్పుడు వదంతులు సృష్టించారని పేర్కొన్నారు. టీటీడీ గురించి వైసీపీ చేస్తోన్న తప్పుడు ప్రచారాలను భక్తులు ఖండించాలని సూచించారు.

**నెయ్యి నుంచి తలనీలాల వరకు కుంభకోణాలు**

వైసీపీ పార్టీ అధికారం పేరుతో తిరుమలను ఆర్థిక వనరుగా మార్చుకున్నారని ఆరోపించారు. నెయ్యి నుంచి తల నీలాల వరకు వైసీపీ చెయ్యని కుంభకోణం లేదని విమర్శించారు. లడ్డు, శాలువాలు, బంగారం తాపడం పేరుతో అనేక కుంభకోణాలకు తెర తీశారని మండిపడ్డారు. వైసీపీ చేసిన నేరాలకు జైలు శిక్ష ఎలైనా తప్పదని.. కనీసం చెంపలు వేసుకొని దేవుని దుష్టిలోనైనా పడాలని పేర్కొన్నారు. గతంలో లడ్డు కల్తీ గురించి ప్రతిపక్షంలోనే ఉన్నప్పుడే చెప్పామని.. అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని బయటకు తీశామని వివరించారు.

**కోట్లు కొల్లగొట్టే జగన్‌రెడ్డికి పరకామణి చిన్న కేసే**

తండ్రి అధికారం అడ్డం పెట్టుకుని కోట్లు కొల్లగొట్టిన జగన్ రెడ్డికి పరకామణి చిన్న కేసులానే కనిపిస్తుంది. పరకామణి వ్యవహారంపై ప్రత్యేక ఎఫ్‌ఐఆర్ వేయాలని హైకోర్టే చెప్పింది. ఈ సందర్భంగా ఇటీవల ఈ కేసు గురించి హైకోర్టు చేసిన వ్యాఖ్యలను ఆయన గుర్తు చేశారు. భక్తుల మనోభావాలకు సంబంధించిన అంశంపై జగన్ ఇలా మాట్లాడటం సరైనది కాదని సూచించారు. కోట్లాది మంది మనోభావాలు దెబ్బతీసిన జగన్.. వెంటనే క్షమాప ణ చెప్పాలని డిమాండ్ చేశారు. దొంగలను సైతం దొరలా చూపిం చే నీచ సంస్కృతి వైసీపీదని ఎద్దేవా చేశారు. పట్ట పగలే దొంగ తనం చేసే సమర్థత వైసీపీ పార్టీకే చెందుతుందని విమర్శించారు.

**జగన్ హయంలో దేవాలయాలు ధ్వంసం**

వైసీపీ హయంలో దేవాలయం, పురోహితులపై దాడులు నిత్యకృత్యం అయ్యేవని ఆరోపించారు. 2019-24 మధ్య కాలం లో అనేక దేవాలయాలకు రక్షణ కరువైందన్నారు. బ్రిటిష్ పరిపా లనలో క్షేమంగా ఉన్న మన దేవాలయాలు జగన్ పరిపాలనలో ధ్వంసం అయ్యాయని తీవ్రంగా విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో దేవాలయాలకు, పురోహితులకు రక్షణ లభించిందని పేర్కొన్నారు. చంద్రబాబు అధికారం చేపట్టిన తరువాత ఒక్క దేవాలయంపై దాడి జరిగిందా? అని వైసీపీ వాళ్లను ప్రశ్నించారు. జగన్మోహన్ రెడ్డికి హిందూ మతంపై విశ్వాసం లేదని.. అందుకే అన్యమతస్థుడైన భూమన లాంటి వాళ్లకు అధికారం



ఇచ్చారని మండిపడ్డారు. ఈ సందర్భంగా గతంలో వెంకటేశ్వర స్వామి వారిపై భూమన చేసిన వ్యాఖ్యలను గుర్తు చేశారు. గతంలో వైఎస్ కూడా ఇలానే మాట్లాడని గుర్తు చేశారు. శ్రీవారి గురించి మాట్లాడి నప్పుడు జాగ్రత్తగా మాట్లాడాలని హితవు పలికారు. తిరుమల గోశాలలో గోవులు క్షేమంగానే ఉన్నాయని తెలిపారు. వైసీపీ అనవసర విష ప్రచారాలు చేస్తోందని... తిరుమలపై వైసీపీ ఫేక్ ప్రచారాలకు అడ్డుకట్ట వేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

చైతన్యరథం

# చివరి ఆయకట్టు వరకూ సాగర్ జలాలు

**- మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి ఆదేశం**
**- ప్రకాశం జిల్లా అధికారులతో సమీక్ష**



కొండపి(చైతన్యరథం): ప్రకాశం జిల్లాకు నాగార్జున సాగర్ జలాల సరఫరా మెరుగుపడేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అధికారులను ఆదేశించారు. టంగుటూరు మండలం తూర్పు నాయుడుపాలెంలోని క్యాంపు కార్యాలయంలో నీటిపారుదల శాఖ అధికారులతో శనివారం సాగర్ జలాల సరఫరాపై సమీక్ష నిర్వహించారు. నాగార్జున సాగర్ నుంచి విడుదలవుతున్న జలాలు జిల్లాకు తగిన స్థాయిలో రాకపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. 57 టీఎంసీల సాగర్ జలాలు జిల్లాకు రావాల్సి ఉండగా.. ఇప్పటివరకు 34 టీఎంసీల నీరు నీరు వచ్చిందని, మరో 23 టీఎంసీల నీరు అందిస్తేనే టేల్యార్డ్ ప్రాంతాలైన సంత నూతలపాడు, ఒంగోలు, కొండపి నియోజకవర్గాలకు అందు తుందని తెలిపారు. అలాగే 85/3 మైలు పాయింట్ వద్ద నిరం తరం 2,700 క్యూసెక్కుల నీటిని నిల్వ చేసి విడుదల చేయాలని మంత్రికి సమస్యను తెలిపారు. దీనిపై నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో మంత్రి స్వామి ఫోన్ ద్వారా మాట్లా డారు. జిల్లాకు సకాలంలో నీటిని విడుదల చేసేందుకు సహక రించాలని కోరారు. అలాగే పల్నాడు ఎస్ఈ వెంకటరత్నంతోనూ మంత్రి ఫోన్‌లో మాట్లాడి నీటిని విడుదల చేసేలా మంత్రి సూచన లు చేశారు. ఈ సందర్భంగా నీటి పారుదలశాఖ అధికారులతో మంత్రి మాట్లాడుతూ జిల్లాలోని చివరి ఆయకట్టు వరకూ నీరం దేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా ఉండేందుకు సమ్మర్ స్టోరేజీలు, ఇతర చెరువులను నీటితో నింపాలన్నారు. వరి, ఇతర పంటల సాగుకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించాలని తెలిపా రు. ఈ సమీక్షలో జిల్లాలోని డీఈలు, ఈఈ, ఏఈఈలు

# ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**- ఇప్పటివరకు 287 మందికి కారుణ్య నియామకాలు**
**- వ్యవసాయ కనెక్షన్ల మంజూరులో జాప్యం ఉండొద్దు**
**- ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్**



విశాఖపట్నం (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వ ర్యంలోని కూటమి ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశా రు. విశాఖపట్నంలోని ఏపీఈపీడీసీఎల్‌కు చెందిన సీఓఈఈటీ భవనంలో ఉన్నతాధికారులతో శనివారం మంత్రి సమీక్ష నిర్వహిం చారు. ఈ సందరరేగా ఈపీడీసీఎల్ పరిధిలో విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఉద్యోగుల కుటుంబాలకు చెందిన 34 మంది అర్హులకు కారుణ్య నియామక పత్రాలను అందజేశారు. కూటమి ఏర్పడిన 18 నెలల కాలంలో ఇప్పటివరకు 287 మంది కి కారుణ్య నియామకం కింద ఉద్యోగాలు కల్పించినట్లు మంత్రి వెల్లడించారు. ఉద్యోగ నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన కుటుం బాలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని తెలిపారు. విద్యుత్ రంగంలో సమగ్ర సంస్కరణలను ప్రవేశపెట్టింది ముఖ్య మంత్రి చంద్రబాబు అని పేర్కొన్నారు. సౌర శక్తిని ప్రోత్సహిస్తూ గతంలో విద్యుత్ లేని గ్రామాలు, గిరిజన ఆవాసాలకు వెలుగులు నింపుతున్నామని మంత్రి తెలిపారు. వినియోగదారులపై అదనపు భారం మోపకుండా విద్యుత్ అందించడమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. వినియోగదారుల విద్యుత్ బిల్లుల భారం తగ్గించడమే ముఖ్యమంత్రి లక్ష్యమని, ఇప్పటికే 13 పైసల టారిఫ్ ట్రూ-డౌన్ సాధించామని చెప్పారు.

***కూటమి ప్రభుత్వంలో రైతే రాజు***

కూటమి ప్రభుత్వంలో రైతే రాజని స్పష్టం చేశారు. వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరులో ఎలాంటి ఆలస్యం జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏపీఈపీడీసీఎల్ పరిధిలో అమలు చేస్తున్న ఆర్‌డీఎస్ఎస్ (Revamped Distri bution Sector Scheme) పనుల పురోగతిని మంత్రి సమీక్షించారు. ఫేజ్-1 పనులను వేగవంతంగా పూర్తిచేసి ఫేజ్-2కు వెళ్లేందుకు అధికారులు కృషి చేయాలని సూచించా రు. పనుల నాణ్యత, గడువులపై కఠిన పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు. మౌలిక వసతుల అభివృద్ధిలో భాగంగా ఏపీఈపీడీసీఎల్ పరిధిలో నిర్మిస్తున్న కొత్త సబ్‌స్టేషన్ల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. మార్చి 2026 నాటికి సుమారు 60కు పైగా సబ్‌స్టేషన్లు ప్రజలకు అందు బాటులోకి రానున్నాయని అధికారులు ఈ సందర్భంగా మంత్రికి తెలిపారు. పీఎం సూర్యఘర్ పథకంపై విస్తృత ప్రచారం చేపట్టి రూఫ్ టాప్ సోలార్ కనెక్షన్ల సంఖ్య పెంచాలని, దానికి తగిన కృషి చేయాలని మంత్రి ఆదే శించారు. స్వచ్ఛమైన, పునరుత్పాదక ఇంధనాన్ని ప్రజల్లో ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అన్నారు. విద్యుత్ శాఖలో మానవ తప్పిదాల వల్ల జరిగే ప్రమాదాలను నివారించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రమాదాల నివారణకు ఈపీడీసీఎల్ అధికారులు అభివృద్ధి చేసిన కొత్త యాప్ గురించి సీఎండీ పృథ్వీ తేజ్., మంత్రికి వివరించారు. ఈ సమీక్షలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస రావు, ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, సంస్థ డైరెక్టర్లు టి.వి.సూర్య ప్రకాష్, ఎస్.హరిబాబు, సీజీఎంలు, ఎస్ఈలు పాల్గొన్నారు.

# గిరిజన రైతులకు సబ్సిడీతో పరికరాలు

**ఐటీడీఏలకు రూ.13.70 కోట్లు విడుదల: మంత్రి గుమ్మడి సంధ్యారాణి**



అమరావతి(చైతన్యరథం): గిరిజన రైతుల కోసం అన్ని ఐటీడీఏలకు ట్రైకార్ ద్వారా పరికరాలు అందజేసేందుకు మంత్రి గుమ్మడి సంధ్యారాణి రూ.13.70 కోట్లు విడుదల చేశారు. గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారు.. ఐటీడీఏ ద్వారా 90 శాతం సబ్సిడీతో పరికరాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. గత జగన్ ప్రభుత్వం ట్రైకార్ రుణాలు ఆపి గిరిజ నులకు అన్యాయం చేసింది. కూటమి ప్రభుత్వంలో గిరిజన కుటుంబాల జీవనోపాధి బలోపేతం కోసం ప్రత్యేక అభివృద్ధి కార్యక్ర మాల అమలు చేస్తున్నామని తెలిపారు. లబ్ధిదారులకు వ్యవసాయ జీవనోపాధి పరికరాల పంపిణీ ద్వారా మేలు జరుగుతుందని తెలిపారు. రైతుల శ్రమ తగ్గించి ఉత్పాదకత పెంచేందుకు ట్రాక్టర్లు, మినీ ట్రాక్టర్ల మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. గిరిజనుల ఉత్పత్తులు మార్కెట్‌కు సులభంగా చేరవేసుకునేందుకు రవాణా కోసం ట్రక్కులు అందజేస్తున్నట్లు వివరించారు. పంటలు, నిల్వ సామగ్రి రక్షణ కోసం టార్పాలి న్‌లు పంపిణీ, వ్యవసాయ పనులు వేగంగా సాగేందుకు ఆయిల్ ఇంజిన్లు మంజూరు చేస్తున్నామన్నారు. గిరిజన కుటుంబాల అదనపు ఆదాయం కోసం పెద్దఎత్తున గోకులాలు మంజూరు చేసి పశుపోషణకు ప్రోత్సాహం ఇస్తున్నట్లు చెప్పారు.

# వైసీపీ నాయకురాలి బెదిరింపులు

- **తప్పుడు కేసులు పెట్టి వేధిస్తోంది**
- **రిజిస్ట్రేషన్ ఉన్న భూమికి 22-ఏ ముద్ర**
- **ప్రజావినతుల్లో బాధితుల ఫిర్యాదులు**
- **అర్జీలు స్వీకరించిన ఏపీఐడీసీ చైర్మన్ ప్రభాకర్**

మంగళగిరి(చైతన్యరథం): టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వ హించిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ దేగల ప్రభాకర్ అర్జీలు స్వీకరించారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరు మండలం వడ్డిపాళెం గ్రామానికి చెందిన విజయమ్మ నేడు తమ గ్రామంలో తన రెండవ కుమార్తె మల్లి నిర్మల వైసీపీ నాయకురాలు డబ్బుల విషయమై తనను, తన చిన్న కుమారుడు అమరేంద్ర బాబును నిరంతరం వేధిస్తూ తప్పుడు కేసులు పెట్టిస్తోంది. వృద్ధా ప్యం, అనారోగ్య సమస్యలతో ఉన్న తనకు, తన కుమారునికి తీవ్రమైన ప్రాణహాని ఉంది. కోవూరు పోలీస్ స్టేషన్ లో తగిన న్యాయం జరగడం లేదు. వారిపై చర్యలు తీసుకుని తమ సమస్య ను పరిష్కరించాలని అభ్యర్థించారు.

**అక్రమంగా రికార్డులు మార్చారు**

సత్యసాయి జిల్లా చెన్నకోత్తపల్లి మండలం వెంకటపల్లి గ్రామా నికి చెందిన నరసమ్మ గ్రీవెన్స్‌లో అర్జీ అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. సీకేపల్లి పరిధిలోని సర్వే నెం.508-3, 508-4లో య.4.94 సెంట్ల (ఖాతా నెం. 1133) ఉన్న భూమిని తమ భర్త పేరుపై ప్రభుత్వం ఇచ్చింది. ఆ భూమిని తమ కుటుంబం చట్టబద్ధంగా సాగు చేస్తూ జీవనం కొనసాగిస్తూ వచ్చింది. అయితే తన భర్త అనారోగ్యంతో మరణించిన తరువాత, తమకు తెలియకుండానే గత ప్రభుత్వ హయాంలో మాజీ ప్రజాప్రతినిధి ఎం.బీ.శివారెడ్డి ..తన రాజకీయ ప్రభావాన్ని ఉపయోగించి తన భర్త పేరులో ఉన్న భూమిని అక్రమంగా ఆన్‌లైన్ రికార్డులు అడంగల్, పాస్ బుక్‌లో మార్పులు చేయించాడు. వారిపై చర్యలు తీసుకుని తమ భూమి సమస్యను పరిష్కరించాలని కోరారు.

**అన్యాయంగా భూమిని 22-ఏ జాబితాలో చేర్చారు**

ఎన్టీఆర్ జిల్లా ఏ.కొండూరు మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన రాణి గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామ పరిధిలోని సర్వే నెం. 1018/100724, ఎకరాలు 0.25 సెంట్లు భూమిని చట్టబద్ధంగా 2014లో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాం. అయితే ఎటువంటి ముందస్తు నోటీసులు లేకుండా గత ప్రభుత్వ హయాంలో అన్యాయంగా ఈ భూమిని 22-ఏ జాబితాలో చేర్చారు. ఇటీవల కుటుంబ ఆర్థిక అవసరాల నిమిత్తం బ్యాంకు లోన్ కోసం అప్లై చేసిన సమయంలో ఈ భూమి 22-ఏలో ఉన్నట్లు తెలిసింది. పిల్లల చదువులు కూడా కొనసాగించలేని దుస్థితి ఏర్పడింది. సమస్యను పరిష్కరించాలని కోరారు.

**పట్టాను మోసపూరితంగా విక్రయించారు**

అనంతపురం జిల్లా గుమ్మగట్టు మండలం మారెంపల్లి గ్రామానికి చెందిన దండక్క గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..తమ తాత మల్లప్ప దంతక్క పేరుపై ప్రభుత్వం వారు అప్పట్లో దుంభూపసముద్రం పాలెం పరిధిలోని సర్వే నెం. 58ఏలో మొత్తం 5.45 ఎకరాల భూమిని దత్త పట్టాగా మంజూరు చేశారు. తమ తాతలకు ఇద్దరు కుమారులు ఉండగా, వారు ఎటువంటి అధికారిక భాగపంచాయితీ లేకుండానే భూమిని అనుభవంలో ఉంచుకున్నారు. అయితే కాలక్రమేణా ఈ భూమిలోని మిగిలిన 2.1 ఎకరాల పొలాన్ని మారెమల్ల గ్రామానికి చెందిన నాగమ్మ, రామాంజులు, మంజుల, చింత ముత్తిలు అనే వ్యక్తులు అక్రమంగా ఆన్‌లైన్‌లో తమ పేర్లపై నమోదు చేసుకున్నారు. ఇదే కాకుండా వజ్రవన్నార గ్రామానికి చెందిన అశోక్, బంకారప్పలు, తమ అవ్వకు సంబంధించిన అసలు పట్టాను మోసపూరితంగా వినియోగించి అక్రమ రిజిస్ట్రేషన్లకు



మద్దతుగా నిలిచారు. భూమి సమస్యను పరిష్కరించాలని కోరారు.

**పంట నాశనం చేశారు**

బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం పెదపులివర్రు గ్రామానికి చెందిన సురేంద్ర గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..తమ గ్రామంలో తాను పాలేటి సునీల్ పొలంలో 1.30 ఎకరాలు కౌలుకు తీసుకొని పసుపు పంట సాగు చేస్తున్నాను. ఈ క్రమంలో గ్రామానికి చెందిన యలవర్తి రామకృష్ణ అనే వ్యక్తి 14-11-2025న "24-డీ" అనే విషపూరిత మందును పం టపై చల్లడంతో, పసుపు పంట పూర్తిగా ఎండిపోయి సుమారు రూ.10 లక్షల మేర నష్టం వాటిల్లింది. ఈ ఘటనపై 18-11-2025న భట్టిప్రోలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పక్క రైతు తోట పాములు సాక్ష్యంగా ఇచ్చిన వాంగ్మూలాన్ని ఎస్ఐ నమోదు చేసినప్పటికీ, ఇప్పటివరకు యలవర్తి రామకృష్ణపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. గతంలో కూడా సదరు వ్యక్తి రైతుల ఒరికుప్పలు తగలబెట్టారు. వారిపై చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

# హింస, క్రూరత్వం, కుట్రలు @ జగన్!

- ప్రజలు బుద్ధిచెప్పినా మారని నైజం
- అభివృద్ధిని అడ్డుకునే పన్నాగం
- ఉనికి కోసం జనంలో భయాందోళనలు సృష్టించే వ్యూహం
- సైకో నేత దారిలో వైసీపీ మూకల ఉన్మాదం
- జగన్ పుట్టినరోజు పేరుతో జంతుబలులు, రక్తాభిషేకాలతో రెచ్చిపోయి రంకెలు
- కత్తులు, తల్వార్లతో స్వైర విహారం
- ఉన్మత్తమూకలపై ఎక్కడికక్కడ పోలీసు కేసులు





అమరావతి (చైతన్యరథం): రాజకీయంగా ఉనికి కోసం ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడాన్ని ఒక వ్యూహంగా వైసీపీ మార్చుకుంది. అధికారంలో ఉంటే పీకలు కోయడం, హింసాత్మక దాడులను ప్రోత్సహించిన జగన్.. అధికారం పోయాక కూడా అదే తరహాలో రప్పా రప్పా.. గంగమ్మ జాతరలో పొట్టేలు తల నరికినట్టు నరికితే తప్పేంటి అంటూ తన పార్టీ మూకలను రెచ్చగొడుతున్నారు. స్వయంగా అధినేతే హింసను, దాడులను ప్రోత్సహిస్తుండడంతో, వైసీపీ మూకలు గంజాయి మత్తులో మారణాయుధాలతో రాష్ట్రంలో స్వైర విహారం చేస్తున్నాయి.

వైసీపీ నేతల హింసోన్మాదం సమాజ ప్రశాంతతను, రాష్ట్ర భవిష్యత్తుకు ఆటంకంగా తయారయింది. వైసీపీ అనుసరిస్తున్న తీరు గమనిస్తే, అది కేవలం రాజకీయ విమర్శలకు పరిమితం కాకుండా, ఒక రకమైన సామాజిక ఉన్మాదాన్ని ప్రేరేపించేలా ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. సోషల్ మీడియా వేదికల నుండి ప్రత్యక్ష దాడుల వరకు.. రప్పా రప్పా డైలాగుల నుండి కత్తులు, తల్వార్లు చూపిస్తూ చేసే హెచ్చరికల వరకు.. జంతు బలులతో రక్తాభిషేకాల వరకు.. ఇవన్నీ ఒక ప్రకడ్బందీ కుట్రలా కనిపిస్తున్నాయి. ఒకప్పుడు బీహార్‌లో ఉండే అరాచక సంస్కృతిని నేడు ఆంధ్ర రాష్ట్రానికి వైసీపీ నేతలు తీసుకువస్తున్నారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా రాష్ట్రంలో వైసీపీ నేతలు, కార్యకర్తలు పాల్పడ్డ వికృత చేష్టలు, అరాచకాలే ఇందుకు నిదర్శనం.

జగన్ బర్త్ డేను ప్రజలను తీవ్ర భయాందోళనలకు గురి చేసేలా వైసీపీ కార్యకర్తలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఒక చోట గర్భిణిని కాలితో తన్ని అరాచకం సృష్టించారు. బహిరంగ ప్రదేశాల్లో వేట కొడవళ్లను ప్రదర్శిస్తూ జంతు బలులు చేసి జగన్ చిత్రపటాలకు రక్తాభిషేకంతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారు. 'నువ్వు సృష్టించే విధ్వంసం చూడాలని ఉంది జగనన్నా' అంటూ కత్తులతో కూడిన ఆయన చిత్రాలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి భయానక వాతావరణం సృష్టించారు. వైసీపీ నేతలు సృష్టించిన ఈ అరాచకంపై వివిధ పోలీస్ స్టేషన్లల్లో ప్రజలు ఫిర్యాదులు చేశారు.

**పోలీసుల చర్యలు**

ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులతో వివిధ ప్రాంతాల్లో కేసులు నమోదయ్యాయి. బహిరంగ ప్రదేశాల్లో కత్తుల ప్రదర్శన, జంతు బలి చేసి రక్తాభిషేకాలు చేసిన వారిపై కేసులు నమోదు చేశారు. శ్రీసత్యసాయి జిల్లాలో బాణసంచా శబ్దాలతో తనకు ఇబ్బందిగా ఉందని చెప్పిన సంధ్యారాణి అనే గర్భిణిని మానవత్వం లేకుండా కాలితో తన్నిన వైసీపీ కార్యకర్త అజయ్ దేవానుఅదుపులోకి తీసుకుని తమదైన శైలిలో పోలీసులు ట్రీట్‌మెంట్ ఇచ్చి కదరి పట్టణ వీధుల్లో నడిపించుకుంటూ తీసుకెళ్లారు.

అనంతపురం జిల్లా కల్యాణదుర్గం, ఉరవకొండ, శింగనమల నియోజకవర్గాల్లో వైసీపీ కార్యకర్తలు గొర్రెల తలను నరికి, రక్తంతో జగన్ ఫ్లెక్సీకి అభిషేకం చేశారు. రాప్తాడు నియోజకవర్గంలో జగన్ ఫ్లెక్సీకి గొర్రెను బలిచ్చి వేడుకలు నిర్వహించారు. గొర్రె రక్తాన్ని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ఫ్లెక్సీపై చల్లి ప్రజలను వైసీపీ కార్యకర్తలు ఉన్మాదంతో పండుగ చేసుకున్నారు.

ఈ ఘటనలో ఓ వైసీపీ సర్పంచ్‌తో సహా 13మందిపై కేసు నమోదు చేసిన పోలీసులు పలువురిని అదుపులోకి తీసుకున్నారు. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి, ధర్మవరం నియోజకవర్గాల్లోనూ అదే ఉన్మాదంతో పుట్టిన రోజు వేడుకలు నిర్వహించి ప్రజలను భయాందోళనలకు గురిచేశారు.

తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం చోడవరంలోనూ వైసీపీ నేతలు రెచ్చిపోయారు. మేకను నరికి జగన్ ఫొటోకు రక్తాభిషేకం చేశారు. మేక తలకాయను ఎగరేస్తూ వీధుల్లో వైసీపీ కార్యకర్తల వీరంగమాడారు. రప్పారప్పా అంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలతో ఫ్లెక్సీలు ప్రదర్శించారు. ఆ తంతు మొత్తాన్ని వీడియో తీసి సోషల్ మీడియాలో ప్రచారం చేశారు.

ఈ ఘటన శుక్రవారం రాత్రి జరిగింది.. దీంతో పోలీసులు శనివారం ఉదయం చోడవరం గ్రామానికి చేరుకుని ఏడుగురు వైసీపీ నేతలను అరెస్టు చేసి కస్టడీలోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుండి నాటుసారా కూడా స్వాధీనం చేసుకున్నారు. నిందితులందరినీ జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపే నేపథ్యంలో వీధుల్లో నడిపించుకుంటూ తీసుకెళ్లారు. ఫ్లెక్సీల ముందు మేకపోతుల్ని బలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ స్పష్టం చేశారు. మేకపోతుల్ని బలి ఇచ్చే వీడియోలతో భయభ్రాంతులకు గురిచేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇలాంటి పనులు చేసి యువత భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. అదే జిల్లా గోపాలపురంలోనూ వివాదస్పద వ్యాఖ్యలతో జగన్ చిత్రంతో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఆ ఫ్లెక్సీని తొలగించిన పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ తరహా వ్యవహారాలపై వైసీపీ శ్రేణులపై కఠిన చర్యలకు ఏపీ పోలీస్ శాఖ సిద్ధమవుతోంది. అయితే ఉన్మాదుల వెన్నులో వణుకు పుట్టించేలా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని ప్రజలు కోరుతున్నారు.

# గిరిజన గ్రామాలకు మంచి రోజులు

**డోలిరహిత ఏపీ లక్ష్యంగా కూటమి ప్రభుత్వ పనితీరు**

**అడవి తల్లి బాటతో 1,069 కి.మీ. పొడవు రోడ్ల నిర్మాణం**

**పీఎం జన్మన్ కింద రూ.358 కోట్లతో రోడ్లు, వంతెనల నిర్మాణం**

**గిరిజన గూడెంల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.154 కోట్లు**

ఆదివాసీలు మన సాంస్కృతిక వైవిధ్యానికి ప్రతీకలు. ప్రకృతితో ఐక్యమై జీవించే మన గిరిజనుల పల్లెలను బంగారు పల్లెలుగా కూటమి ప్రభుత్వం తీర్చిదిద్దుతుంది. వారి సంక్షేమం చూస్తూనే.. ప్రతీ పల్లెల్లో మౌలిక సదుపాయాల కల్పనకు నడుంబిగించింది. రాష్ట్రంలో డోలి మోతలు ఇకపై ఉండకూడదని గట్టిగా సంకల్పించింది. అడవి తల్లి బాట కార్యక్రమంతో ప్రతీ పల్లెకు రహదారులు వేసి ప్రజా రవాణాను దగ్గర చేసింది. గిరిజన ఉత్పత్తులను సులువుగా మార్కెట్ చేసుకొనేలా స్థానికంగా కాఫీ, జీడి, పల్ప్ యూనిట్‌లను నెలకొల్పింది. గిరిజనుల జీవన ప్రమాణాలను పెంపొందించడానికి నారా చంద్రబాబు నాయుడు గారి ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం అన్ని రకాలుగా కృషి చేస్తోంది.

**అడవితల్లి బాటతో రోడ్లకు మహర్దశ:**

స్వాతంత్రం వచ్చి 78 ఏళ్లు గడిచిన ఇంకా అనేక గిరిజన ప్రాంతాలు ప్రపంచానికి దూరంగా బతుకుతున్నాయి. రహదారుల సదుపాయాలు లేక రోగం వస్తే డోలే దిక్కు అన్నట్లు బతుకు సాగిస్తున్నారు. గిరిజనుల సమగ్రాభివృద్ధి లక్ష్యంగా పని చేస్తున్న సీఎం నారా చంద్రబాబు నాయుడు.. అధికారంలోకి రాగానే అడవి తల్లి బాట కార్యక్రమంతో రోడ్లు వేయడానికి సిద్ధపడ్డారు. సుమారు రూ. 1005 కోట్లతో 1069 కి.మీ. పొడవు రహదారులు వేశారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన ఈ మహత్తర కార్యక్రమంతో 625 గిరిజన గ్రామాల రోడ్లకు మోక్షం లభించింది. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా గిరిజన ప్రాంతాల్లో ఒకేసారి ఇంత పెద్ద కార్యక్రమం చేయడం చాలా అభినందనీయం.

**పీఎం జన్మన్ కింద రూ. 358.82 కోట్లు మంజూరు:**

ఏళ్లుగా కనీస మౌలిక వసతులు లేక కాలం వెళ్లదీస్తున్న గిరిజన గూడేంల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుంది. కేంద్రం సహకారంతో రహదారులు, వంతెనల నిర్మాణాల కోసం పీఎం జన్మన్ పథకం కింద రూ. 358.82 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో వివిధ జిల్లాల్లో 97 రోడ్లు, 33 వంతెనల పనులు చేపట్టనున్నారు. పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో రహదారి సౌకర్యం లేని గ్రామాలను పీఎం జన్మన్ పథకానికి ఎంపిక చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం సయుక్తంగా ఈ పనులు చేయనున్నారు.

**కేంద్రం గ్రాంట్ కింద రూ.154 కోట్లు విడుదల:**

గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు కేంద్రం ప్రభుత్వం గ్రాంట్ రూపంలో మరో రూ. 154 కోట్లు విడుదల చేసింది. ఈ నిధులతో చిన్నచిన్న వాగుల దగ్గర బ్రిడ్జిలు, కల్వర్టుల నిర్మాణం, మౌలిక వసతుల కల్పించనున్నారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా నిధులు సమకూర్చుతాయి. ఈ సంవత్సరానికి సంబంధించి ఇప్పటికే రూ. 98 కోట్లను రా(ష్టానికి ఇచ్చింది. ఈ నిధులతో గ్రామాల్లో బీటీ రోడ్లు అభివృద్ధి చేస్తారు. అలాగే ఆశ్రమ పాఠశాలలో భవనాలు, ప్రహరి గోడల అలాగే ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ఉపయోగిస్తారు.

**కాఫీ, జీడిపప్పు, రబ్బరు యూనిట్లు మంజూరు:**

గిరిజన ఉత్పత్తులను స్థానికంగానే మార్కెట్ చేసుకునేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ప్రాంతాల వారిగా అక్కడ ఎక్కువగా పండే పంటలను ఆధారంగా చేసుకుని ప్రాసెసింగ్ యూనిట్స్ నెలకొల్పుతుంది. పాడేరులో రూ. 10 కోట్లతో కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ ను ఏర్పాటు చేస్తున్నారు. అల్లూరి సీతారామ రాజు జిల్లా మారేడుమిల్లిలో రూ. 5 కోట్లతో రబ్బరు యూనిట్ నెలకొల్పుతున్నారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు, గుమ్మ లక్ష్మీపురంలో రెండు జీడిపప్పు ప్రాసెసింగ్ కేంద్రాలు తీసుకొచ్చారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక కృషితో అరకు కాఫీకి బ్రాండ్ ఇమేజ్ తీసుకొచ్చారు. సుమారు 2.5 లక్షల ఎకరాల్లో కాఫీ పంటను విస్తరించారు. వైసీపీ హయంలో గంజాయి వనాలుగా ఉన్న గిరిజన గ్రామాలు.. నేడు కూటమి ప్రభుత్వంలో కాఫీ వనాలుగా మారాయి.

**కేంద్ర నిధులను రాబట్టడంలో జగన్ విఫలం:**

రాజ్యాంగంలోని ఆర్టికల్ 275 ప్రకారం షెడ్యూల్డ్ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్రం కొన్ని గ్రాంట్స్ విడుదల చేస్తోంది. దానికి రాష్ట్ర ప్రభుత్వాలు మరికొన్ని నిధులు సమకూర్చి గిరిజన ప్రాంతాలను అభివృద్ధి చేస్తాయి. గత వైసీపీ హయంలో ఈ విషయంలో పూర్తిగా నిర్లక్ష్యం వహించారు. కేంద్రం చేతిలో జగన్ కేవలం కీలు బొమ్మగా మారడంతో.. రా(ష్టానికి రావాల్సిన నిధులు రాబట్టడంలో పూర్తిగా విఫలమయ్యారు. కేంద్రం ఇచ్చిన మరికొన్ని గ్రాంట్స్ పక్కదారి పట్టించారు. కేవలం గిరిజనులను ఓట్ బ్యాంక్ గా చూసిన జగన్.. వారి మౌలిక సదుపాయాలు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారు.

**ఎన్ నీలంనాయుడు,**
**అనలిస్టు, టీడీపీ నాలెడ్జ్ సెంటర్**

# నవతి పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

● ప్రత్యేక డిపాజిట్ పథకాన్ని ప్రారంభించిన మంత్రి కె.అచ్చెన్నాయుడు



నిమ్మాడ (చైతన్యరథం): ది జిల్లా కేంద్ర సహకార బ్యాంకు లిమిటెడ్ (డీసీసీబీ) స్థాపించి 89 సంవత్సరాలు పూర్తి చేసుకుని 90 సంవత్సరంలోకి ప్రవేశిస్తున్న సందర్భంగా నూతనంగా ప్రవేశపెట్టిన 'నవతి ప్రత్యేక డిపాజిట్ పథకం'ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు. ఈ పథకాన్ని గురువారం నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో ఆయన లాంఛనంగా ప్రారంభించారు. 900 రోజుల కాలపరిమితితో అమలు చేయనున్న ఈ పథకంలో సీనియర్ సిటిజన్లకు 9 శాతం, ఇతరులకు 8.5 శాతం వడ్డీ చెల్లించనున్నట్లు బ్యాంకు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, డీసీసీబీ 89 సంవత్సరాలుగా ఖాతాదారులకు విశ్వసనీయ సేవలు అందించడం అభినందనీయమన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని,రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. ఆ లక్ష్య సాధనలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. 89 సంవత్సరాల సుదీర్ఘ సేవల అనుభవంతో డీసీసీబీ ఖాతాదారుల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ, 'నవతి ప్రత్యేక డిపాజిట్ పథకం' ద్వారా ప్రజలకు అధిక వడ్డీ రేటుతో మేలు చేస్తోందని. సీనియర్ సిటిజన్లకు 9 శాతం వడ్డీ అందించడం అభినందనీయమైన విషయమన్నారు .రైతులు, ప్రజలు ఖాతాదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బ్యాంకింగ్ సేవలు మరింత పారదర్శకంగా, వేగవంతంగా అందేలా ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని. రైతులకు రుణాల మంజూరులో ఎలాంటి ఆలస్యం లేకుండా బ్యాంకులు బాధ్యతతో పనిచేయాలి సూచించారు. కార్యక్రమంలో డీసీసీబీ ఛైర్మన్ ఎన్. సూర్యనారాయణ, బ్యాంక్ ఉద్యోగులు సత్యన్నారాయణ, వరప్రసాద్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# రెట్టింపు ఉత్సాహంతో ప్రజల కోసం పనిచేయండి



చీపురుపల్లి (చైతన్యరథం): రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో పార్టీ కార్యకర్తలు, నాయకులు రానున్న రోజుల్లో రెట్టింపు ఉత్సాహంతో ప్రజల కోసం పనిచేయాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే కిమిడి కళావెంకట్రావు పిలుపునిచ్చారు. విజయనగరం పార్లమెంటరీ ఉపాధ్యక్షులుగా నియమితులైన వెంపడాపు రమణమూర్తి, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ముల్లు రమాదేవి తదితరులు గురువారం కిమిడి కళావెంకట్రావును ఆయన నివాసం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కళావెంకట్రావు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టితో రాష్ట్రం ప్రగతి పథంలో దూసుకుపోతోందన్నారు. రాష్ట్ర అభివృద్ధి ఫలాలు క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లడంలో నూతన నాయకత్వం చురుకైన పాత్ర పోషించాలని కోరారు. తమపై నమ్మకం ఉంచి పదవులు అప్పగించిన అధిష్ఠానానికి, సహకరించిన ఎమ్మెల్యే కళావెంకట్రావుకు రమణమూర్తి, రమాదేవి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చీపురుపల్లి నియోజకవర్గ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# స్క్రబ్ టైఫస్‌పై ఆందోళన వద్దు... సకాలంలో గుర్తిస్తే తగ్గిపోతుందంటున్న వైద్యులు




స్క్రబ్ టైఫస్! ఈ జ్వరంతో రాష్ట్రంలో ఇప్పటివరకు 20 మంది చనిపోయారు. కలకలం రేపుతున్న ఈ జ్వరంపై ఆందోళన వద్దని వైద్యులు చెబుతున్నారు. సకాలంలో గుర్తించి చికిత్స తీసుకుంటే సాధారణ జ్వరంలానే తగ్గిపోతుందని స్పష్టం చేస్తున్నారు. మృతి చెందిన వారిలో దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు ఉన్న వారే అధికంగా ఉన్నారని, దీని గురించి భయపడాల్సిన అవసరం లేదని వైద్యులు భరోసా ఇస్తున్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా స్క్రబ్ టైఫస్ లక్షణాలతో కేసులు నమోదు అవుతున్నాయి. చిగ్గర్ అనే చిన్న పురుగు కుట్టడం వల్ల శరీరంపై నల్ల పొక్కు వస్తుంది. పురుగు కుట్టిన వారం రోజుల్లో చలిజ్వరం, ఒళ్లు నొప్పులు, తలనొప్పి లక్షణాలు ఉంటాయి. ఈ లక్షణాలతో శరీరంపై నల్లని పొక్కు ఉంటే స్క్రబ్ టైఫస్‌గా నిర్ధరించుకోవచ్చని వైద్యులు చెబుతున్నారు. శరీరంపై ఎలాంటి మచ్చ లేకుండా ఈ లక్షణాలు కనిపిస్తే ఎలైసా పరీక్ష నిర్వహించి స్క్రబ్ టైఫస్‌ను తెలుసుకోవచ్చు. ఈ జ్వరంతో రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 20 మృతి చెందారని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఈనెల 23న బాపట్లలో ఒకరు, కాకినాడలో ఒకరు టైఫస్ లక్షణాలతో మృతి చెందారు. గత 4 దశాబ్దాలుగా: స్క్రబ్ టైఫస్ తరహా జ్వరాలు గత 40 ఏళ్లుగా వస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. గత రెండు ఏళ్లుగా ఈ కేసుల సంఖ్య కొంత పెరిగిందంటున్నారు. టైఫస్ జ్వరాన్ని ముందుగానే గుర్తించి చికిత్స తీసుకుంటే త్వరగా నయమవుతుందని వైద్యులు అంటున్నారు. జ్వరాన్ని గుర్తించకుంటే ఇతర అవయవాలపై ప్రభావం చూపుతుందని హెచ్చరిస్తున్నారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, పీహెచ్‌సీ కేంద్రాల్లో స్క్రబ్ టైఫస్ పరీక్ష కిట్లను అందుబాటులో ఉంచామని వైద్యాధికారులు తెలిపారు. జ్వరం వచ్చిన వెంటనే వైద్య పరీక్షలు చేయించుకుని చికిత్స తీసుకుంటే ఎలాంటి దుష్ప్రభావం ఉండదని వైద్యులు సూచిస్తున్నారు. దీనిపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెబుతున్నారు.

# టీడీపీ నూతన కార్యవర్గానికి ఎంపీ శ్రీభరత్ శుభాకాంక్షలు



విశాఖపట్నం (చైతన్యరథం): విశాఖ లోక్‌సభ నియోజకవర్గ టీడీపీ నూతన కార్యవర్గానికి విశాఖ ఎంపీ శ్రీభరత్ శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ అధిష్టానం నూతన కమిటీని ప్రకటించిన తర్వాత తొలిసారి ఎంపీని గురువారం మర్యాదపూర్వకంగా కలిసి వీరంతా కృతజ్ఞతలు తెలియజేశారు. విశాఖ ఉత్తర నియోజవర్గం నుంచి పదవులు పొందిన వారిలో పార్టీ ఉపాధ్యక్షుడు కోటా నరేష్, కార్యనిర్వాహక కార్యదర్శి కొల్లి ఏడుకొండలు, ఆఫీస్ కార్యదర్శి బందారు అప్పారావు, అధికార ప్రతినిధులు పిలకా శ్రీదేవి, షేక్ బాజ్జీ ఉన్నారు. ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ... పార్టీ అధిష్ఠానం అప్పగించిన బాధ్యతను సమర్థంగా నెరవేర్చాలని తెలిపారు. ఇటు ప్రజలకు అటు ప్రభుత్వానికి వారధిలా సేవలందించాలని ఎంపీ పిలుపునిచ్చారు.

# తెలుగు రాష్ట్రాల్లో సింగిల్ డిజిట్‌కే పడిపోతున్న ఉష్ణోగ్రతలు

అమ్మో చలి.. స్వెట్టర్లు ఆగడం లేదు. బ్లాంకెట్లు, దుప్పట్లు కప్పుకున్నా.. వణుకు తగ్గట్లేదు. తెలుగు రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కే పడిపోతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యంత కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఒక రోజు కాదు, రెండు రోజులు కాదు. రెండు వారాలుగా తెలుగు రాష్ట్రాలపై చలి పంజా విసురుతోంది. తీవ్రమైన చలితో పాటు విపరీతంగా కురుస్తోన్న మంచు.. వెన్నులో వణుకు పుట్టిస్తోంది. ఉదయం 8 కాదు కదా.. 10 గంటలైనా బయటకు రాలేని పరిస్థితి. డిసెంబర్ మొదటి నుంచీ తెలుగు రాష్ట్రాల్లో చలి తీవ్రత పెరిగింది. ముందుముందు టెంపరేచర్స్ అత్యంత కనిష్టానికి పడిపోయే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. వచ్చే 4 రోజులు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఉష్ణోగ్రతలు మరింత పడిపోతాయని, జాగ్రత్తగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరించింది. హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకారం.. తెలంగాణ రాష్ట్రంలో క్రింది స్థాయి గాలులు ప్రధానముగా తూర్పు, ఈశాన్య దిశ నుండి వీస్తున్నవి.. దీని ప్రభావంతో ఈరోజు, రేపు మరియు ఎల్లుండి రాష్ట్రంలో పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉంది. రాబోయే రెండు రోజుల్లో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3°C నుండి 4°C తక్కువగా నమోదయ్యే అవకాశం ఉంది. అమరావతి వాతావరణ కేంద్రం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ - యానాంలో దిగువ ట్రోపో ఆవరణములో ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయి. వీటి ఫలితంగా రాష్ట్రంలో రాగల మూడు రోజుల వరకు వాతావరణ సూచనలు ఈ కింది విధంగా ఉన్నాయి. ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాం, దక్షిణ కోస్తాలలో గురువారం, శుక్రవారం, శనివారం పొడి వాతావరణం ఏర్పడే అవకాశము ఉంది. రాయలసీమలో గురువారం, శుక్రవారం, శనివారం పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉంది. రాగల 2 రోజుల్లో కోస్తా ఆంధ్రప్రదేశ్, యానం, రాయలసీమలో కనిష్ట ఉష్ణోగ్రతలు ఒకటి లేదా రెండు చోట్ల సాధారణము కంటే 2-4 డిగ్రీల సెంటీగ్రేడ్ తక్కువగా నమోదయ్యే అవకాశముంది. ఆ తర్వాత పెద్దగా మార్పు ఉండదు.

# క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న... ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి



నరసన్నపేట (చైతన్యరథం): శుక్రవారం నరసన్నపేట పట్టణంలో నారాయణ స్కూల్ ప్రక్కన ఉన్న చర్చిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ... క్రిస్మస్ పండుగ ప్రేమ, క్షమ, త్యాగం, సేవా భావాలకు ప్రతీక అని అన్నారు. యేసుక్రీస్తు బోధనలు మానవాళికి శాంతి, సౌభ్రాతృత్వం మార్గాన్ని చూపుతాయని పేర్కొన్నారు. అన్ని మతాలు సమానమే అనే భావనతో ప్రతి ఒక్కరూ ఐక్యతతో ముందుకు సాగాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అన్ని మతాల పండుగలకు సమాన గౌరవం ఇస్తూ ప్రజల మధ్య సహృదయ వాతావరణం పెంపొందించేందుకు కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చర్చి పాస్టర్లు, సంఘ పెద్దలు, స్థానిక ప్రజాప్రతినిధులు, క్రైస్తవ సోదర సోదరీమణులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పేద వితంతు మహిళలకు చీరలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఎంజీఆర్



పాతపట్నం (చైతన్యరథం): నియోజకవర్గంలోని కొత్తూరు మండలం, కురిగాం గ్రామంలో క్రిస్మస్ వేడుకల సందర్భంగా గ్రామానికి చెందిన చింతాడ తేజ మోహన్ నిర్వహించిన పేద వితంతు మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమంలో శాసనసభ్యులు మామిడి గోవిందరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వితంతు మహిళలకు చీరలను పంపిణీ చేసి, క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. పండుగల వేళ పేద కుటుంబాలకు సహాయం చేయడం మానవత్వానికి నిదర్శనమని, అన్ని వర్గాల ప్రజలు పరస్పరం ప్రేమాభిమానాలతో మెలగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

# నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి కార్పొరేట్ హంగులు

**●రూ.2.10 కోట్లతో 'ప్రసూతి నిరీక్షణ కేంద్రానికి' శంకుస్థాపన చేసిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు**



నర్సీపట్నం (చైతన్యరథం): నియోజకవర్గాన్ని మెడికల్ హబ్‌గా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని, పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేందుకు కృషి చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. శనివారం నర్సీపట్నం ఎన్టీఆర్ ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో రూ.2 కోట్ల 10 లక్షల వ్యయంతో నిర్మించనున్న 'ప్రసూతి నిరీక్షణ కేంద్రం' నిర్మాణానికి అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, డెక్కన్ ఫైన్ కెమికల్స్ ఈడీ కె.వి.ఎల్.పి రాజుతో కలిసి స్పీకర్ శంకుస్థాపన చేశారు. అనంతరం రూ.35 లక్షల విలువైన అత్యాధునిక 'టిఫా స్కానింగ్' మిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ... 1985లో ఎన్టీఆర్ హయాంలో ప్రారంభమైన ఈ ఆసుపత్రి నేడు వందలాది మందికి సేవలందిస్తోందని గుర్తుచేశారు. నర్సీపట్నం ఆసుపత్రిపై నమ్మకంతో తుని, పాడేరు వంటి సుదూర ప్రాంతాల నుండి కూడా గర్భిణీలు పసవాల కోసం ఇక్కడికే వస్తున్నారని తెలిపారు. అయితే, చివరి నిమిషంలో ఆసుపత్రికి రావడం వల్ల తలెత్తుతున్న అనర్థాలను నివారించేందుకు ఈ 'ప్రసూతి నిరీక్షణ కేంద్రం' ఎంతో ఉపయోగపడుతుందన్నారు. "గర్భిణీలు డెలివరీ డేట్‌కు రెండు రోజుల ముందే ఆసుపత్రికి వచ్చి, వైద్యుల పర్యవేక్షణలో ఉండేలా ఈ భవనాన్ని డిజైన్ చేశాం. గర్భిణీలతో పాటు ఒక సహాయకురాలికి కూడా ఇక్కడే ఉచిత భోజన వసతి, పడక సదుపాయం కల్పిస్తాం. జిల్లా కలెక్టర్ చొరవతో, డెక్కన్ ఫైన్ కెమికల్స్ సంస్థ వారు సీఎస్ఆర్ నిధుల కింద రూ.2.10 కోట్లు మంజూరు చేయడం అభినందనీయం," అని తెలిపారు. నర్సీపట్నంలోని 9 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అభివృద్ధికి ఎన్టీపీసీ సంస్థ రూ.72.5 లక్షలు మంజూరు చేసిందని, తద్వారా ఆయా ఆసుపత్రుల్లో మౌలిక వసతులు మెరుగుపడతాయని స్పీకర్ పేర్కొన్నారు.

**అరుదైన 'టిఫా స్కానింగ్' సౌకర్యం**

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం కేవలం 7 టిఫా స్కానింగ్ మిషన్లను మంజూరు చేయగా, అందులో ఒకటి నర్సీపట్నం ఆసుపత్రికి రావడం గర్వకారణమని స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. గర్భిణీ స్త్రీలు శిశువు ఆరోగ్య పరిస్థితిని, లోపాలను ముందుగానే గుర్తించడానికి ఈ మిషన్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. నియోజకవర్గంలో విద్య, వైద్య రంగాల అభివృద్ధికి సహకరిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్‌కి, దాతలైన డెక్కన్ కెమికల్స్ రాజుకి, ఎన్టీపీసీ యాజమాన్యానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# పి.జి.ఆర్.ఎస్ వ్యవస్థను ప్రజలందరూ సద్వినియోగించుకోవాలి : ఎమ్మెల్యే వెనిగండ్ల



గుడివాడ (చైతన్యరథం): ప్రజా సమస్యలు సత్వరం పరిష్కారం అయ్యేలా కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సూచించారు. గుడివాడ పట్టణం ఏలూరు రోడ్డులోని టిడిపి కార్యాలయం (ప్రజా వేదిక)లో... గుడివాడ పరిసర ప్రాంతాలకు చెందిన పలువురు సమస్యలను ఎమ్మెల్యే రాము దృష్టికి తీసుకొచ్చారు. న్యూ ఇందిరా నగర్ కాలనీలో డ్రైనేజీ సమస్య, పిన్నమనేని నగర్‌లో వాటర్ పైప్ లైన్ సమస్యపై... స్థానికులు ఇచ్చిన అర్జీల మేరకు మున్సిపల్ అధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే రాము... సమస్య పరిష్కార చర్యలు సూచించారు. పలువురు తమ సమస్యలను ఎమ్మెల్యే రాము దృష్టికి తీసుకొచ్చి... అర్జీలను అందజేశారు. ప్రతి అర్జీను పి.జి.ఆర్.ఎస్‌లో నమోదు చేసి సత్వర పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామని.... తనను కలిసిన వారికి ఎమ్మెల్యే రాము భరోసా ఇచ్చారు. ప్రజా వేదిక కార్యాలయంలో, ప్రజలు అందించే సమస్యలు పరిష్కారం అయ్యేలా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసామని ఎమ్మెల్యే రాము పేర్కొన్నారు. గుడివాడ అభివృద్ధి, ప్రజా సమస్యలను పరిష్కరించడం లక్ష్యంగా ముందుకు సాగుతున్నానని సందరరేగా ఎమ్మెల్యే రాము పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎం.ఈ ప్రసాద్, తాసిల్దార్ కుమార్, మున్సిపల్ డీ.ఈ కరుణ్ బాబు, మండల టీడీపీ అధ్యక్షుడు వాసే మురళి, మార్కెట్ యార్డ్ చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్,టీడీపీ నాయకులు రెడ్డి అప్పారావు, సమ్మెట బ్రహ్మాజీ, మున్సిపల్ ఏఈ శ్రావణ్, ఆర్డబ్ల్యుసి ఏఈ కిస్మత్ రాణి తదితరులు పాల్గొన్నారు.

# అర్యవైశ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : దూండీ



విజయవాడ (చైతన్యరథం): అర్యవైశ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని శనివారం నిర్వహించిన ఐవీఎఫ్ రాష్ట్ర సభ్యులతో ఇష్టాగోష్టి సమావేశంలో అర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దూండీ రాకేష్ వ్యాఖ్యానించారు. విజయవాడ, విద్యాధరపురం దూండి రాకేష్ కార్యాలయంలో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఇష్టాగోష్టి సమావేశం రాష్ట్ర సభ్యులతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ సెంట్రల్ సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాసగుప్త, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర విభాగం అధ్యక్షులు కోనా శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోంట్లా రమ్మోహనరావు రాష్ట్ర సభ్యులు తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో త్వరలో జరగబోయే భారీ ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ప్రతినిధుల సమావేశం ఏర్పాట్ల గురించి ఈ సమావేశంలో ప్రత్యేకంగా చర్చించడం జరిగిందని దూండీ రాకేష్ తెలిపారు. అనంతరం ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ వారి 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. రాష్ట్రంలో అర్యవైశ్యులు ఎదుర్కొంటున్న సమస్యలు, వివిధ పరిష్కారాల గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని దూండి రాకేష్‌ని ఐవీఎఫ్ సభ్యులు కోరారు.

# పార్టీలో, పాలనలో మహిళల భాగస్వామ్యం.. ప్రగతికి.. ప్రజా సంక్షేమానికి దోహదం

**●నరసరావుపేట పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి అమరా రమాదేవి అభినందించిన ప్రత్తిపాటి**

**●అన్నాక్యాంటీన్ల నూతన చైర్మన్లు, తెలుగు మహిళా నాయకురాలను సన్మానించిన మాజీ మంత్రి**



చిలకలూరిపేట (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ పదవులు, ప్రభుత్వ విభాగాల నియామకాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు మహిళలకు ఇస్తున్న ప్రాధాన్యత.. రాష్ట్ర ప్రగతికి, ప్రజా సంక్షేమానికి ఎనలేని దోహదం చేస్తుందని, తెలుగు మహిళల శక్తియుక్తులు ప్రపంచానికి తెలిసేలా చేసిన నాయకుడు చంద్రబాబు అని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు కొనియాడారు. శనివారం తనతో మర్యాదపూర్వకంగా సమావేశమైన నరసరావుపేట లోక్‌సభ టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శిగా ఇటీవల నియమితురాలైన అమరా రమాదేవి, పట్టణంలోని మూడు అన్నా క్యాంటీన్లకు కొత్తగా నియమింపబడిన చైర్మన్లు పాములపాటి శివమ్మ, రాయని హరిత, కనమర్లపూడి లక్ష్మీ తిరుమలను ఎమ్మెల్యే ప్రత్తిపాటి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పార్టీ అధిష్ఠానం.. ప్రభుత్వం తమపై ఉంచిన నమ్మకాన్ని మహిళా నాయకులు నిలబెట్టుకోవాలని, ప్రజాసేవతో పాటు.. సమస్యల పరిష్కారం.. రాష్ట్రాభివృద్ధిలో తమవంతు పనితీరు కనబరచాలని సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలుగుమహిళల సమర్థతపై మంచి నమ్మకం ఉందన్న ప్రత్తిపాటి, వారి శక్తియుక్తులు రాష్ట్రపురోగతికి ఉపయోగపడాలన్నదే ఆయన ఆకాంక్ష అన్నారు. తమకు అప్పగించిన బాధ్యతల్ని సమర్థవంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహిస్తామన్న మహిళా నేతలు.. తమ ఎంపికకు కారకులైన ప్రత్తిపాటిని సన్మానించి, కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఇటీవల పదవులు పొందిన తెలుగు మహిళా నాయకులకు నియోజకవర్గ వర్గ మహిళా అధ్యక్షురాలు అద్దంకి అనిత, ప్రధాన కార్యదర్శి గుదే అంజలి, అంగన్వాడీ నియోజకవర్గ ఎస్.హెచ్.జి నల్లమోతు ఉదయ లక్ష్మీ, పట్టణ అధ్యక్షురాలు కునాల ప్రమీలను అభినందించి, సన్మానించారు.

# వెంకటరమణకు కుడుపూడి సత్తిబాబు పరామర్శ



రాజోలు (చైతన్యరథం): పితృవియోగంతో బాధపడుతున్న టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, పెద్దాపురం నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు బోళ్ల వెంకటరమణను రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు పరామర్శించారు. శనివారం సొంతూళ్లో రాజోలులోని దివంగత బోళ్ల సుబ్బారావు నివాసానికి వచ్చిన సత్తిబాబు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ సమయంలో సుబ్బారావు చేసిన సేవలను సత్తిబాబు స్మరించారు. సుబ్బారావు ఆత్మశాంతికి భగవంతుడిని ప్రార్థిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కొత్తపేట పట్టణ టీడీపీ మాజీ అధ్యక్షుడు గుబ్బల మూర్తి, టీడీపీ జిల్లా లీగల్ సెల్ కార్యదర్శి గుబ్బల సుబ్రహ్మణ్యం, బీసీ నాయకులు చెల్లుబోయిన రాంబాబు, పృథ్వీ, కడలి కపిల్ తదితరులు వెంకటరమణను పరామర్శించారు.

**బోన్ క్యాన్సర్ పేషంట్‌కు ఆర్థిక సాయం**

రాజోలు పట్టణంలో బోన్ క్యాన్సర్‌తో బాధ పడుతున్న పిఠాని సత్యదుర్గా హరిప్రసాద్‌ను శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు పరామర్శించారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు హరిప్రసాద్‌కు అందజేశారు. హరిప్రసాద్‌కు శస్త్ర చికిత్స కోసం సీఎం నుంచి ఎల్ఓసి ఇప్పిస్తానని సత్తిబాబు ఈమేరకు హామీ ఇచ్చారు.

# అంగన్వాడీ కేంద్రాల్లో సేవలు మరింత పారదర్శకంగా

నిడదవోలు (చైతన్యరథం): ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాల ద్వారా అంగన్వాడీ కేంద్రాల్లో సేవలు మరింత పారదర్శకంగా, సాంకేతికంగా అభివృద్ధి చెందుతాయని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. శనివారం అంగన్వాడీ కార్యకర్తలకు మంత్రి స్మార్ట్‌ఫోన్లు అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పిల్లలు, గర్భిణులు, బాలింతలకు అందించే పోషకాహారం, ఆరోగ్య సేవలు మరింత సమర్థంగా అందించేందుకు ఈ స్మార్ట్ ఫోన్లు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో తక్షణ ఆరోగ్య అవసరాలకు ఫస్ట్ ఎయిడ్ కిట్స్ ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో పెరవలి ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి ఆశా రోహిణి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఘనస్వాగతం

గన్నవరం (చైతన్యరథం): కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ కు గన్నవరం విమానాశ్రయంలో పలువురు మంత్రులు ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. న్యూఢిల్లీ నుండి విమానంలో గన్నవరం గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న నిర్మల సీతారామన్ కు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు గుడివాడ ఎమ్మెల్యే వెనిగళ్ళ రాము, తదితర ప్రజాప్రతినిధులు పలువురు అధికారులు పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం ఆమె రోడ్డు మార్గాన విజయవాడ బయలుదేరి వెళ్లారు.

## ప్రజల కష్టాలు తీర్చడానికి టీడీపీ ఎప్పుడూ సిద్ధమే

◆ ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దేగల



గుంటూరు (చైతన్యరథం): ప్రజల కష్టాలు వినడానికి, కన్నీళ్లు తుడవడానికి తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ ముందుంటుందని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దేగల ప్రభాకర్ అన్నారు. దీని కోసం మంగళగిరి కేంద్ర తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రతిరోజు ప్రజాదర్బార్ కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు తెలుసుకొని సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీ (వినతుల)లను స్వీకరించి,వారి సమస్యలను స్వయంగా విని తెలుసుకున్నారు. ఆయా సమస్యలపై సంబంధిత అధికారులతో చర్చించి త్వరితగతిన పరిష్కారం అయ్యేలా చూడాలని అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా చైర్మన్ దేగల ప్రభాకర్ మాట్లాడుతూ... ప్రజాసేవలో భాగంగా ప్రత్యక్షంగా ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఫోన్ ద్వారా తెలియజేశామన్నారు. ప్రజా సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమని, అందరికీ అందుబాటులో ఉండే విధంగా సేవలను మరింత బలోపేతం చేస్తామని ఆయన తెలిపారు. వైకాపా ప్రభుత్వ హయాంలో పాలకులు ప్రజా సమస్యలను పూర్తిగా నిర్లక్ష్యపరిచారని విమర్శించారు. ముఖ్యంగా గత ప్రభుత్వంలో వైసీపీ నేతల అరాచకాలపై అత్యధికంగా ఫిర్యాదులు వచ్చాయన్నారు.ఓవైపు పారదర్శకంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూనే.. మరోవైపు ప్రతినిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోంది. వైఎస్సార్సీపీ నాయకుల భూకబ్జాలు, అక్రమకేసులు సహా ఎన్నో అంశాలపై దరఖాస్తులు వెల్లువెత్తుతుండడమే అందుకు నిదర్శనమన్నారు. ఫిర్యాదుదారుల్లో వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో నష్టపోయినవారే ఉండటం గమనార్హం అని అన్నారు.

## ఎంపీ కేశినేని శివనాథ్ క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్

◆అర్జీలతో భారీగా తరలివచ్చిన ప్రజానీకం



విజయవాడ (చైతన్యరథం): ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారం కోసమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఎన్డీయే కూటమి రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి వారం క్రమం తప్పకుండా 'ప్రజాదర్బార్' కార్యక్రమం నిర్వహిస్తుందని టీడీపీ నాయకులు వెల్లడించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎలాంటి జాప్యం జరగకూడదనే ఉద్దేశ్యంతో ఎంపీ కేశినేని శివనాథ్ ఆదేశాల మేరకు పశ్చిమ నియోజకవర్గంలో ప్రతివారం ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 53వ డివిజన్ గణపతిరావు రోడ్డులో గల ఎంపీ కేశినేని శివనాథ్ క్యాంప్ కార్యాలయంలో శనివారం ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులతో కలిసి టీడీపీ నాయకులు ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజాదర్బార్‌కి అధిక సంఖ్యలో ప్రజలు తమ సమస్యలపై అర్జీలతో తరలి వచ్చారు. ఈ ప్రజాదర్బార్ కార్యక్రమానికి డివిజన్ అధ్యక్షురాలు నందే విజయలక్ష్మీ అధ్యక్షత వహించగా, రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఫతావుల్లా, ఇతర టీడీపీ నాయకులు ప్రజలతో స్వయంగా మాట్లాడి వారి నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రతి అర్జీపై సంబంధిత శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచనలు అందించారు. అధికారులు కొన్ని అర్జీలను అక్కడికక్కడే పరిష్కరించారు. రేషన్‌కార్డ్ మ్యాపింగ్, కొత్త రేషన్ కార్డ్, టిడ్కో ఇళ్లు, ఇంటి స్థలాలు, వితంతు, ఒంటరి మహిళల పెన్షన్లు, దివ్యాంగుల పెన్షన్లు, ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ సమస్యలు, సీనియర్ సిటిజన్ సమస్యలపై ప్రజలు ఎక్కువగా అర్జీలు వచ్చాయని నేతలు తెలిపారు.

## నగరాభివృద్ధిపై గుంటూరు కౌన్సిల్ సమావేశంలో చర్చ



గుంటూరు (చైతన్యరథం): నగర పాలక సంస్థలోని కౌన్సిల్ సమావేశ మందిరం నందు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అధ్యక్షతన జరిగిన సాధారణ కౌన్సిల్ సమావేశము నందు పలువురు ప్రజా ప్రతినిధులు పలు ప్రజా సమస్యలపై సుదీర్ఘంగా చర్చించి, అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు మొహమ్మద్ నసీర్, బూర్ల రామాంజనేయులు కమిషనర్ పులి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాల కల్పనకు తొలి ప్రాధాన్యం : మంత్రి కొల్లు

◆బందరులో ప్రతి వీధిలో రోడ్లు, డ్రైనేజీలు పూర్తి చేస్తాం

◆గిలకలదిండి 20వ డివిజన్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



మచిలీపట్నం (చైతన్యరథం): నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో, ప్రతి వీధిలో పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నం 20వ డివిజన్ గిలకలదిండిలో డ్రైనేజ్, మంచి నీటి పైపులైన్, గ్రామీణ రోడ్లు పనులకు శంకుస్థాపన చేశారు. 2014-19 మధ్య కాలంలో కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టాం. తర్వాత వచ్చిన పాలకులు నాశనం చేశారని ధ్వజమెత్తారు. గిలకలదిండి ప్రాంత ప్రజలకు తాగు నీరు పంపిణీ చేయడం కోసం వాటర్ ట్యాంకు నిర్మిస్తే.. దాన్ని కూడా నాశనం చేశారు. తాజాగా రూ.30లక్షల వ్యయంతో రోడ్డు పనులకు శంకుస్థాపన చేయడం ఆనందంగా ఉంది. నియోజకవర్గంలో డ్రైనేజ్ పనుల కోసం ఇప్పటికే రూ.12 కోట్లు ఖర్చు చేశాం. మరో రూ.70 కోట్ల వ్యయంతో మరిన్ని అభివృద్ధి పనులు చేయబోతున్నాం. అవసరమైన అన్ని అభివృద్ధి పనులు పూర్తి చేసి నియోజకవర్గానికి నూతన శోభ తీసుకొస్తామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, మార్కెట్ యార్డు చైర్మన్ కుంచె దుర్గాప్రసాద్, లంకె నారాయణ ప్రసాద్, కొక్కిలిగడ్డ నాగ రమేష్, గిలకలదిండి ఇంచార్జి రమేష్, టౌన్ పార్టీ అధ్యక్షుడు లోగిశెట్టి స్వామి, టౌన్ పార్టీ మాజీ అధ్యక్షులు ఇలియాస్ పాషా, బచ్చుల అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు తోడ్పడాలి : జీవీ

పిడుగురాళ్ల (చైతన్యరథం): పిడుగురాళ్ల మండలంలోని జూలకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ... చదువుకున్న పాఠశాలను, గురువులను మర్చిపోకుండా, స్నేహితులందరూ ఒకే వేదికపైకి రావడం అభినందనీయమని కొనియాడారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాల అభివృద్ధికి ప్రతి ఒక్క పూర్వ విద్యార్థి తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థులను తీర్చిదిద్దిన రిటైర్డ్ ఉపాధ్యాయులను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గురజాల నియోజకవర్గ శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజాదర్బార్...



వినుకొండ పట్టణంలోని ప్రభుత్వ చీఫ్ విప్ కార్యాలయంలో ప్రజాదర్బార్‌లో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు పాల్గొన్నారు. నియోజకవర్గంలోని పలు మండలాల నుండి ప్రజలు తరలివచ్చి తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ప్రజల విజ్ఞప్తులను సావధానంగా ఆలకించిన జీవీ... వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని, ప్రతి ఒక్కరి సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రజా దర్బార్ ద్వారా ప్రజలకు మరింత చేరువయ్యే అవకాశం లభిస్తుందని, వారి సమస్యలను నేరుగా తెలుసుకోవడం వల్ల సత్వర పరిష్కారం సాధ్యమవుతుందని ఆయన అన్నారు.

## రైతుల అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

◆ నందిగామలో రైతులకు కోటి రూపాయల చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



నందిగామ (చైతన్యరథం): చందర్లపాడు మండలం లక్ష్మీపురం గ్రామంలో ఉన్న లక్ష్మీపురం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పరిధిలో శనివారం నాడు రైతులకు ఆర్థిక భరోసా కల్పించే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అధికారులు మరియు కూటమి నేతలతో కలిసి 20 మంది రైతులకు మొత్తం రూ.1 కోటి విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ... రైతులే రాష్ట్రానికి వెన్నెముక అని, వారి అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. సహకార పరపతి సంఘాల ద్వారా రైతులకు సకాలంలో రుణాలు అందించి, వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడమే కూటమి ప్రభుత్వ ఉద్దేశమని చెప్పారు. రైతులు ఈ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకొని పంటల దిగుబడిని పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లాల్ బహదూర్ లెఫ్ట్ కెనాల్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కోటా వీరబాబు, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్లు పటాపంచల రాంబాబు, వాసిరెడ్డి ప్రసాద్, సంబంధిత శాఖల అధికారులు, సహకార సంఘం ప్రతినిధులు, కూటమి నాయకులు, నీటి సంఘం అధ్యక్షులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రైతులు ప్రభుత్వ సహకారంతో తమకు లభించిన ఈ సహాయానికి హర్షం వ్యక్తం చేశారు.

## ఎంటీఎంసీ పరిధిలోని కూడళ్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



మంగళగిరి (చైతన్యరథం): రాష్ట్ర ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ముఖ్యమైన కూడళ్లను అధునాతన హంగులతో తీర్చిదిద్దటం జరుగుతుందని కమిషనర్ అలీం బాషా అన్నారు. శనివారం ప్రకాశం బ్యారేజ్ లోటస్ ఎదురుగా ఉన్న కూడలి, ఉండవల్లి సెంటర్ కూడలి, ముగ్గురోడ్డు సాయిబాబు గుడి దగ్గర ఉన్న కూడలి, ఎర్రబాలెం డాన్ బాస్కో స్కూల్ దగ్గర కూడళ్ల అభివృద్ధి పనులకు స్థానిక కూటమి నాయకులతో కలిసి కమిషనర్ అలీం బాషా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అలీం బాషా మాట్లాడుతూ ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, పాదచారుల భద్రతతో పాటు సులభంగా వెళ్లడం, వాహనవేగం తగ్గడం, ప్రమాదాలను అరికట్టడమే లక్ష్యంగా ఎంటీఎంసీ పరిధిలోని కూడళ్లను అధునాతన హంగులతో తీర్చిదిద్దటం జరుగుతుందని చెప్పారు. మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్‌ను రాష్ట్రంలో ఉత్తమ మున్సిపల్ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దటమే మంత్రి నారా లోకేష్ లక్ష్యమన్నారు.

# భావితరాల పిల్లల భవిష్యత్ ఆరోగ్యానికి పునాది

## అంగన్వాడీలకు సెల్ ఫోన్ పంపిణీ చేసిన మంత్రి సవిత




పెనుకొండ, (చైతన్యరథం): భావితరాల పిల్లల భవిష్యత్ ఆరోగ్యానికి పునాది అంగన్వాడీలని మంత్రి సవిత తెలిపారు. పెనుకొండలోని క్యాంపు కార్యాలయంలో పెనుకొండ నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న 459 మంది అంగన్వాడీ వర్కర్లకు 5జీ సామ్సంగ్ ఫోన్‌లను అందచేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా 57 మంది అంగన్వాడీ మినీ వర్కర్లను మెయిన్ వర్కర్‌గా ఉన్నతీకరించారు. వారికి ధ్రువీకరణ పత్రాలు మంత్రి సవితమ్మ అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మెరుగైన సేవలను అందించేందుకు ప్రభుత్వం అంగన్వాడీ కార్యకర్తలకు సెల్ ఫోన్‌లను పంపిణీ చేయడం జరుగుతోందని తెలిపారు. అంగన్వాడీలు ప్రతి రోజూ బాల సంజీవని, పోషణ్ ట్రాకర్, మాతృవందన యోజన తదితర యాప్‌లలో పిల్లల పోషణ, బరువు, ఎత్తు కొలతలు వంటి వాటిని నమోదు చేయాలన్నారు. పిల్లలకు మరో తల్లిలాగా అన్నీ నేర్పేది అంగన్వాడీలేనన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో పరిశుభ్రమైన వాతావరణం ఉండాలని తెలిపారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అన్ని అంగన్వాడీ భవనాలను పూర్తి చేస్తామని తెలిపారు. అదేవిధంగా బాల్య వివాహాలపై గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించి బాల్య వివాహాలను అరికట్టాలని మంత్రి సవిత తెలిపారు. ఈ కార్యక్రమంలో ×జణూ అధికారులు, నియోజకవర్గంలోని అంగన్వాడీలు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# దాతల వితరణతో పోలీసు స్టేషన్లకు కొత్త వాహనాలు

## గుడిలో పూజ చేసినందకు మత రాజకీయాలు చేయడం దారుణం

కదిరి, (చైతన్యరథం): కదిరి నియోజకవర్గంలోని పోలీస్ స్టేషనులకు పోలీసు వాహనాలు సమకూర్చామని కదిరి ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్ తెలిపారు. చాలామంది దాతల సహాయ సహకారాలు, సీఎస్సార్ నిధులతో వాహనాలను సమకూర్చినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. వాహనాలను పోలీస్ శాఖకు అప్పగించే సందర్భంగా లక్ష్మీ నరసింహ స్వామి గుడి ఆవరణంలో పూజలు చేశారు. తర్వాత గుడి బయట సర్వమత ప్రార్థనలు చేయించి అప్పజెప్పాలని ఆలోచనతోనే కార్యక్రమం చేశామన్నారు. అందులో భాగంగా మొదటిగా స్వామి పూజ చేసిన తర్వాత గుడి బయట, గుడి ఆవరణంలో కాదు సర్వమత ప్రార్థనలు చేసినప్పుడు దానిపై చర్చకు తెరలేపారన్నారు. ఇది ఒక ధార్మిక సంస్థను నొప్పించాలని ఉద్దేశంతో చేయలేదన్నారు. ఏ ధర్మానికి వ్యతిరేకంగా ప్రవర్తించాలని ఆలోచనతో మేం చేయలేదన్నారు. ఇది ఊరి కోసం, ఈ నియోజకవర్గం కోసం వాహనాలు సమకూర్చామన్నారు. దీంట్లో ఏ ఒక్క కులానికో మతానికో ఒకరికే అప్పచెప్పారనే ఆలోచన రాకూడదని ఒక సత్సంకల్పంతో చేసిందే కానీ అన్యమత ప్రచారం చేయాలని కాదన్నారు. అన్యమత ప్రచారం అక్కడ జరగగుడి ఆవరణంలో ఏ రకమైనటువంటి కార్యక్రమాలు జరగలేదన్నారు. కేవలం నేను, ఎస్పీ, అడిషనల్ ఎస్పీ ఈవో గుడిలో వెళ్లి పూజలు చేసుకొని రావడం జరిగింది. తర్వాత స్వామి కూడా బయటకు వచ్చేశారన్నారు. దయచేసి ఒక మంచి ఆలోచనతో చేసిన కార్యక్రమాల్ని మీరు అపార్థం చేసుకోవద్దని కోరుతున్నానన్నారు. ఈ నియోజకవర్గంలో ఎప్పుడు కూడా ఎవరి పండగ జరిగినా అందరి పండగల్లో భాగస్వామ్యం పంచుకున్న మనస్తత్వం కలిగిన వాళ్ళమనేది ప్రజలందరికీ తెలుసని గుర్తుచేశారు. ప్రత్యేకించి వినాయక చవితి కావచ్చు ఇతరత్రా నరసింహస్వామి ఉత్సవాలలో కావచ్చు సంతోషంగా భాగస్వామ్యం పంచుకున్నటువంటి వ్యక్తులు మేము. ఎవరినో ఒక వర్గాన్ని కించపరచాలని ఆలోచన మాకు ఎప్పుడు ఉండదన్నారు. రాజకీయం చేయాలని ఆలోచన కూడా మాకు లేదు. ఇప్పుడు ఏమి నాకు ఎన్నికలు లేవు, ఎన్నికల కోసం చేసింది కాదు, ొప్పి పడి కొంతమంది మధ్యకాలంలో సోషల్ మీడియా వేదికగా చేస్తున్నటువంటి ఆలోచనలు గాని, వ్యాఖ్యానాలకు గాని ముగింపు పలకాలని ఉద్దేశంతో మాట్లాడుతున్నానన్నారు. సర్వమత ప్రార్థనలు అనేటివి ప్రజా జీవితంలో ఒక భాగస్వామ్యం ఉంటుందన్నారు. నిర్వహించాల్సి వస్తే మీరు ఎక్కడైతే నొప్పి పడ్డారో ఆ రకంగా మిమ్మల్ని భవిష్యత్తులో నొప్పించేటటువంటి కార్యక్రమాలు చేయనని తెలియచెప్తున్నానన్నారు.

# గురుకుల విద్యార్థులకు మెరుగైన సేవలు

## గిరిజన పాఠశాలను సందర్శించిన కదిరి ఎమ్మెల్యే కందికుంట



కదిరి, (చైతన్యరథం): కదిరిలో ట్రైబల్ వెల్ఫేర్ గురుకులం పాఠశాలను పరిశీలించిన ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్న ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ఎస్టి కమిషన్ మెంబర్ వెంకటప్పాఠశాలలో నెలకొన్న అన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన ఎమ్మెల్యేమీడియా సమావేశంలో కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ కామెంట్స్‌గురుకులం పాఠశాలలో నెలకొన్న సమస్యలను రెండు రోజుల్లో పరిష్కరిస్తాంవందకు వంద శాతం సమస్యలు పరిష్కరిస్తాంకుళ్ళిన కూరగాయలు పురుగులు పడిన ఆహారం విద్యార్థులకు వడ్డించడంపై వెంటనే స్పందించంసంబంధిత కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి ప్రిన్సిపాల్ పై శాఖపరమైన చర్యలు చేపట్టాంఅంతటితో మా బాధ్యత అయిపోదు 29వ తేదీ లోపల పాఠశాలలో నెలకొన్న అన్ని సమస్యలను పరిష్కరిస్తాంమళ్లీ రెండు రోజుల్లో పాఠశాలలను సందర్శిస్తాంవిద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తాంవిద్యార్థుల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతున్నదని తెలిపిన ఎమ్మెల్యే. ప్రభుత్వానికి, ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌కు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

# అందుబాటులోకి వందేభారత్ రైలు

## హిందూపురం నేతలకు కేంద్రమంత్రి సోమన్న హామీ



హిందూపురం, (చైతన్యరథం): హిందూపురం రైల్వే స్టేషన్ లో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభించేందుకు ముఖ్య అతిథులుగా హాజరైన కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రివర్యులు సోమన్నకు హిందూపురం ఎంపీ పార్థసారథి తో కలిసి మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఘన స్వాగతం పలికారు, రైల్వే సహాయం మంత్రి సోమన్న ను కలిసిన సందర్భంగా మచిలీపట్నం -ధర్మవరం, ఇదే రైలును హిందూపూర్, మచిలీపట్నం వరకు నడపాలని కోరారు. దాని మూలంగా హిందూపూర్, మడకశిర, పెనుగొండ, ప్రాంత ప్రయాణికులకు, విద్యార్థులకు, వర్తక వాణిజ్య సంస్థల వారికి, కార్మికులకు చాలామందికి అనుకూలంగా ఉంటుందని మంత్రి సోమన్నను కోరుతూ వినతి పత్రం ఇచ్చారు. దీనికి సానుకూలంగా స్పందించిన మంత్రి త్వరలో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కేంద్ర రైల్వే సహాయ మంత్రి సోమన్నకి మడకశిర ప్రాంత తరుపున కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఘనంగా తెలుగునాడు క్యాలెండర్ విడుదల

ఒంగోలు, (చైతన్యరథం): ఒంగోలులో టీఎన్‌టీయూసీ అనుబంధ సంఘం తెలుగు నాడు విద్యుత్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన 43 వ డైరీ ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి డోలా వీర బాలాంజనేయులు, మాజీ ఎమ్మెల్సీ పరుచూరి అశోక్ బాబు, ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ, కమిటీ చైర్మన్, రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రామరాజు ఒంగోలు జిల్లా పార్టీ అధ్యక్షులు, కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి, సంతనూతలపాడు ఎమ్మెల్యే. విజయ్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుచూరి ప్రసాద్ తెలుగు నాడు విద్యుత్ కార్మిక సంఘ నాయకులు పాల్గొన్నారు.





## గురుగోవింద్‌సింగ్ ధర్మం కోసం నిలబడమన్నారు

**- జన్మదినం సందర్భంగా ప్రధాని మోదీ శుభాకాంక్షలు**

ఢిల్లీ: గురుగోవింద్ సింగ్ జీ మహరాజ్ జన్మదినం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. మనల్ని సత్యం, న్యాయం, ధర్మం కోసం నిలబడమని, మానవ గౌరవాన్ని కాపాడమని ప్రేరేపించారని... ధైర్యం, కరుణ, త్యాగానికి ప్రతీక. గురూజీ జీవితం, ఆయన బోధనలు తరతరాలను సేవ, నిస్వార్థ కర్తవ్యం వైపు నడిపిస్తాయని మోదీ చెప్పారు. ఈ సందర్భంగా ఈ ఏడాది, పాట్నాలోని సాహిబ్ తఖ్త్ శ్రీ హరిమందిర్‌ని సందర్శించుకున్న జ్ఞాపకాలను మోదీ సోషల్ మీడియాలో పంచుకున్నారు. అక్కడ గురుజీ, మాతా సాహిబ్ కౌర్ జీ.. పవిత్ర జోరే సాహిబ్ దర్శనం చేసుకున్నట్లు మోదీ తెలిపారు. అప్పటి ఫొటోలను మోదీ తన ఎక్స్ ఖాతా ద్వారా షేర్ చేశారు. ఇలా ఉండగా, గురు గోవింద్ సింగ్ జన్మదినం పురస్కరించుకుని ఇవాళ దేశంలోని గురుద్వారాలు అందంగా ముస్తాబ య్యాయి. పెద్ద సంఖ్యలో భక్తులు గురుద్వారాలు సందర్శిస్తున్నారు. ఆనంద్ పాఠ్, ప్రభాత్ ఫేరీలతో ఈ ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ముందురోజు (డిసెంబర్ 26) వీర్ బాల్ దివస్‌ను జరుపుకున్నారు. సాహిబ్జాదా జోరావర్ సింగ్, ఫతేహ్ సింగ్‌ల త్యాగాన్ని స్మరించుకుంటూ.. గురుగోవింద్ సింగ్ జీ బోధనలు ఈనాటి సమాజానికి మార్గదర్శకాలు అని చెప్పారు.

### గానవి కేసులో ఊహించని ట్విస్ట్..

## ఆత్మహత్య చేసుకున్న భర్త



కొత్త పెళ్లి కూతురు గానవి కేసులో ఊహించని పరిణామం చోటుచేసుకుంది. గానవి భర్త సూరజ్ ఆత్మహత్య చేసుకున్నాడు. అంతేకాదు.. అతడి తల్లి కూడా ఆత్మహత్యకు ప్రయత్నించటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇంతకీ సంగతేంటంటే.. బెంగళూరుకు చెందిన 26 ఏళ్ల గానవికి అదే ప్రాంతానికి చెందిన సూరజ్‌తో రెండు నెలల క్రితం పెళ్లయింది. భార్యాభర్తలిద్దరూ హనీమూన్ కోసం శ్రీలంక వెళ్లారు. అక్కడ భార్యాభర్తల మధ్య గొడవలు జరిగాయి. గానవి పెళ్లికి ముందు ఓ వ్యక్తిని ప్రేమించింది. ఈ విషయమై సూరజ్ భార్యను ప్రశ్నించాడు. దీంతో ఇద్దరి మధ్య గొడవ మొదలైంది. అది చినికి చినికి గాలి వానలా మారింది. హనీమూన్ మధ్యలోనే గానవి బెంగళూరుకు వచ్చేసింది. నేరుగా పుట్టింటికి వెళ్లిపోయింది. అక్కడ ఆత్మహత్యకు యత్నించింది. ఇది గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను ఆస్పత్రికి తరలించారు. అయితే, సరైన వైద్యం అందకపోవటంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గానవి కన్నుమూసింది. గానవి సూసైడ్‌పై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సూరజ్‌తో పాటు అతడి కుటుంబసభ్యులను విచారిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తల్లి జయంతి, సోదరుడు సంజయ్‌తో కలిసి నాగ్‌పూర్ వెళ్లిపోయాడు.



పోలీసులు చెబుతున్న దాని ప్రకారం.. గానవి ఆత్మహత్య చేసుకోవ టానికి కారణం సూరజ్ అని ఆరోపిస్తూ గానవి కుటుంబసభ్యులు అతడిపై యుద్ధం ప్రకటించారు. అతడిని వేధింపులకు గురి చేస్తూ ఉన్నారు. వారి వేధింపులు రోజురోజుకు ఎక్కువవటంతో సూరజ్ తట్టుకోలేకపోయాడు. ఆత్మహత్య చేసుకుని ప్రాణాలు తీసుకున్నాడు. అతడి తల్లి జయంతి కూడా ఆత్మహత్యకు ప్రయత్నించింది. ప్రస్తుతం ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. గొడవల కారణంగా నెలరోజుల వ్యవధిలో రెండు ప్రాణాలు పోవటం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# ఎఫ్‌టీఏతో ఉద్యోగాలు, ఆదాయం, వాణిజ్యం

**- న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్**



భారత్ – న్యూజిలాండ్ మధ్య చారిత్రక.. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) పూర్తయింది. ఈ ఒప్పందం గురించి న్యూజిలాండ్ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లక్సన్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'మా మొదటి టర్మ్‌లో భారత్‌తో ఎఫ్‌టీఏ సాధించామని చెప్పాం, ఇప్పుడు అది నెరవేర్చాం. ఈ ల్యాండ్‌మార్క్ ఒప్పందం 1.4 బిలియన్ భారతీయ కస్యూమర్లకు తలుపులు తెరిచి, మరిన్ని ఉద్యోగాలు, ఎక్కువ ఆదాయాలు, ఎక్కువ ఎగుమతులు తెస్తుంది' అని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

**ఒప్పందంలోని ప్రధాన అంశాలు:**

– ఒప్పందం మార్చి 16, 2025న ప్రారంభమై, కేవలం 9 నెలల్లో పూర్తయింది. భారత్‌కు అత్యంత వేగవంతమైన ఎఫ్‌టీఏలలో ఒకటి. భారత ఎగుమతులకు 100% డ్యూటీ-ఫ్రీ యాక్సెస్ (టెక్స్‌టైల్స్, లెదర్, మెరైన్ ప్రొడక్ట్స్, జెమ్స్/జ్యువెలరీ వంటివి). న్యూజిలాండ్ ఎగుమతులపై 95 శాతం టారిఫ్‌ల తగ్గింపు లేదా రద్దు. సర్వీసెస్ రంగంలో (ఐటీ, ఎడ్యుకేషన్, టూరిజం) మరిన్ని అవకాశాలు ఉంటాయి. భారత నిపుణులకు 5,000 తాత్కాలిక వీసాలు (ఐటీ, ఇంజినీరింగ్, హెల్త్‌కేర్ వంటివి). ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 5 సంవత్సరాల్లో రెట్టింపు చేయడం, న్యూజిలాండ్ నుంచి 20 బిలియన్ పెట్టుబడులు లక్ష్యంగా దీన్ని రూపొందించారు. ఈ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంతో రెండు దేశాలకు ఆర్థిక వృద్ధి, ఉద్యోగాల సృష్టి, ఎంఎస్ఎంఈలకు మద్దతు ఇస్తుందని భావిస్తున్నారు. వికసిత్ భారత్ 2047 లక్ష్యానికి అనుగుణంగా ఇది ఒక మైలురాయని భారత ప్రభుత్వం చెబుతోంది.

### న్యూ ఇయర్ సెలబ్రేషన్స్..

# ఢిల్లీ పోలీసుల ఉక్కుపాదం

**- ఒకేరోజు 600 మంది అరెస్ట్**



పలు నగరాల్లో న్యూ ఇయర్ వేడుకలు వారంరోజుల ముందే మొదలయ్యాయి. క్రిమినల్ గ్యాంగ్స్ రెచ్చిపోయి ప్రవర్తిస్తున్నాయి. విచ్చలవిడిగా తమ దందా కొనసాగిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే క్రైమ్‌ను అరికట్టడానికి ఢిల్లీ పోలీసులు రంగంలోకి దిగారు. 'ఆపరేషన్ అఘాత్ 3.0'ను మొదలుపె ట్టారు. నేరాలకు పాల్పడుతున్న క్రిమినల్స్‌ను ఎక్కడికక్కడ అరెస్ట్ చేస్తున్నారు. నిన్న ఒక్క రోజే సౌత్, సౌత్ ఈస్ట్ ఢిల్లీ జిల్లాల్లో 660 మందిని అరెస్ట్ చేశారు. వారినుంచి డజన్ల సంఖ్యలో ఆయుధాలు, లక్షల రూపాయల డబ్బు, అక్రమ మద్యం, డ్రగ్స్, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. న్యూ ఇయర్ సందర్భంగా క్రైమ్స్‌ను అరికట్టడానికి పోలీసులు ఈ నిర్ణయం తీసుకున్నారు. క్రైమ్స్ అధికంగా జరిగే ప్రదేశాల్లో నిన్న ఉదయం మొదలైన సోదాలు ఈ రోజు ఉదయం వరకు కొనసాగాయి. క్రైమ్‌కు పాల్పడే అవకాశం ఉందని భావించే వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సౌత్, సౌత్ ఈస్ట్ జిల్లా పోలీసులు జాయింట్ ఆపరేషన్ నిర్వహించి మరీ క్రిమిన ల్ రికార్డులు ఉన్న వారిని అరెస్ట్ చేశారు. కేవలం ఒక్క సౌత్ ఈస్ట్ జిల్లాలో మాత్రమే ఏకంగా 285 మంది అరెస్ట్ అయ్యా రు. పలు సెక్షన్ల కింద పోలీసులు వారిని అదుపులోకి తీసుకు న్నారు. ప్రివెన్షన్ ఆఫ్ ది ఆర్మ్స్ యాక్ట్, ది ఎక్సైజ్ యాక్ట్, ఎన్‌డీపీఎస్ యాక్ట్, గ్యాంబ్లింగ్ యాక్ట్ కింద ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా వారిని అరెస్ట్ చేశారు. ఆపరేషన్ అఘాత్ 3.0 భాగంగా పోలీసులు ఇప్పటి వరకు 2,800 మందిని విచారించారు. జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (సెక్యూరిటీ) మీడియాతో మాట్లాడుతూ.. 'డ్రైవ్ విజయవంతం అయింది. రెండు జిల్లాలో మొత్తం 850 మందిని అదుపులోకి తీసుకున్నాం. వీరిలో 150కి పైగా మంది చెడు ప్రవర్తన (తరచుగా నేరాలకు పాల్పడేవారు) కలిగిన వారు ఉన్నారు. ఎలాంటి గొడవలు లేకుండా న్యూ ఇయర్ వేడుకలు జరగాలి' అని అన్నారు.

# రైల్వే ప్రయాణికులకు గుడ్ న్యూస్

**2030 కల్లా పూర్తిస్థాయి వసతులు**



రైల్వే ప్రయాణికులకు గుడ్ న్యూస్. నానాటికీ పెరుగు తున్న ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా మౌలిక వసతులను విస్తృత పరిచేందుకు రైల్వే శాఖ రంగంలోకి దిగింది. సమగ్ర ప్రణాళికను అమలు చేసేందుకు రెడీ అయింది. ముఖ్యంగా అర్బన్ ప్రాంతాల్లోని రైళ్ల నిర్వహణకు సంబంధించి మౌలిక వసతుల సామర్థ్యాన్ని రెట్టింపు చేయనున్నారు. 2030 కల్లా పూర్తిస్థాయిలో వసతులను అప్‌గ్రేడ్ చేసేలా రైల్వే శాఖ కసరత్తు చేస్తోంది. రైల్వే శాఖ అధికారుల ప్రకారం, ఈ సమగ్ర ప్రణాళికలో భాగంగా వివిధ రైల్వే స్టేషన్‌లల్లో అదనపు ప్లాట్ ఫామ్‌లు, స్టేబ్లింగ్ లైన్స్, పిట్ లైన్స్, అవసరాలకు సరిపడా షంటింగ్ ఫెసిలిటీలను ఏర్పాటు చేయనున్నారు. అర్బన్ ప్రాంతాల్లో అవసరాలను బట్టి కొత్త టర్మినల్స్‌ను కూడా ఏర్పాటు చేయనున్నారు. రైళ్ల నిర్వహణ, మరమ్మతుల కోసం మెగా కోచింగ్ కాంప్లెక్స్ సహా వివిధ రకాల మెయింటెనెన్స్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ట్రెయిన్ ఫెసిలిటీ వర్క్స్ ద్వారా స్టేషన్ సామర్థ్యం పెంపు, పెరుగుతున్న రైళ్ల సంఖ్యకు అనుగుణంగా సిగ్నలింగ్, మల్టీట్రాకింగ్ వ్యవస్థను మెరుగుపరచనున్నారు. మొత్తం 48 నగరాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి రైల్వే శాఖ నడుం బిగించింది. ప్రధాన స్టేషన్‌లలో పాటు చుట్టుపక్కల ఉన్న స్టేషన్‌లలోనూ మౌలిక వసతులను మెరుగుపరుస్తామని అధికారులు చెప్పారు. ఈ ప్లాన్‌లో భాగంగా సబర్బన్‌తో పాటు దూర ప్రాంతాలను అనుసంధానించే నెట్‌వర్క్‌లను కూడా బలోపేతం చేయనున్నారు. ఆయా నగరాల్లో డిమాండ్‌కు అనుగుణంగా ప్రత్యేక ప్లాన్‌ను కూడా సిద్ధం చేస్తున్నారు. అవసరాల మేరకు కొన్ని స్టేషన్‌లల్లో త్వరితగతిన మౌలిక వసతులను మెరుగుపరచనున్నారు. ఈ మేరకు సమగ్ర ప్లాన్‌తో సిద్ధం కావాలని వివిధ జోనల్ కార్యాలయాలను రైల్వే శాఖ కోరింది. టర్మినల్స్ అభివృద్ధితో పాటు నిర్వహణ పరమైన సవాళ్లను కూడా దృష్టిలో పెట్టుకుని రెడీ కావాలని కోరింది. ఢిల్లీ, ముంబై (సీఆర్, డబ్ల్యూఆర్), హైదరాబాద్ సహా మొత్తం 48 అర్బన్ ప్రాంతాల్లో రైల్వే మౌలిక వసతులను అభివృద్ధి పరచనున్నారు.

## పులి దాడిలో ఫారెస్ట్ గార్డ్ మృతి

అడవి జంతువుల సంరక్షణ కోసం పాటు పడుతున్న ఓ ఫారెస్ట్ గార్డ్ పులి చేతిలో ప్రాణాలు కోల్పోయాడు. ఈ సంఘటన కర్నాటకలో చోటుచేసుకుంది. చామరాజనగర్ జిల్లా గుండ్లపేట్ తాలూకాకు చెందిన 56 ఏళ్ల సన్న హైద అనే వ్యక్తి బండిపూర్ టైగర్ రిజర్వ్ ఏరియాలోని మరహళ్ల పోచింగ్ క్యాంప్‌లో ఫారెస్ట్ గార్డుగా పని చేస్తున్నాడు. అక్కడి అడవి జంతువుల కదలికలపై నిఘా వేయటం. శనివారం మధ్యాహ్నం సన్న హైద మరో నలుగురు గార్డులతో కలిసి అడవిలో ప్రతీరోజూ లాగే బీటింగ్‌కు వెళ్లారు. ఈ నేపథ్యంలోనే అతడు అడవిలో గడ్డి కోసు కుంటూ ఉన్నాడు. అప్పుడు ఊహించని సంఘటన చోటుచేసుకుంది. ఓ పులి సన్న హైదపై దాడి చేయసాగింది. అతడి అరుపులు విన్న మిగిలిన గార్డ్స్ అలర్ట్ అయ్యారు. గట్టిగా అరుస్తూ పులి ఉన్న చోటుకు వెళ్లారు. పులి భయపడి అక్కడి నుంచి పారిపోయింది. సన్న హైద అప్పటికే మరణించాడు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

# వారెవా.. చైనా హైస్పీడ్ రైల్!

## రెండు క్షణాల్లో 700కెఎంపీహెచ్ వేగం అందుకోగల సత్తా



సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో ముందుండే చైనా సరికొత్త ఆవిష్కరణలు చేస్తూ ప్రపంచాన్ని ఆశ్చర్యపరుస్తోంది. గత కొన్నేళ్లుగా హైస్పీడ్ రైలు నెట్‌వర్క్‌పై ప్రత్యేకంగా దృష్టిసారించిన బీజింగ్ తాజాగా విమానంతో పోటీపడే సరికొత్త హైస్పీడ్ రైలును పరిచయం చేస్తూ.. మరో ప్రపంచ రికార్డును ఆవిష్కరించింది. 2 సెకన్లలోనే 700 కిలోమీటర్ల వేగాన్ని అందుకునే రైలును ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో పరీక్షించింది. మ్యాగ్నెటిక్ లెవిటేషన్ టెక్నాలజీతో ఈ మ్యాగ్లెవ్ మోడల్ రైలును రూపొందించినట్టు చైనా నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ డిఫెన్స్ టెక్నాలజీ వెల్లడించింది. దీని బరువు దాదాపు టన్ను వరకు ఉందని తెలిపింది. మెరుపు వేగంతో దూసుకుపోయే ఈ రైలును అనుకున్న విధంగానే స్టేషన్లలో ఆపినట్టు పేర్కొంది. దీన్ని పరీక్షిస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. 400 మీటర్ల (1,310–అడుగులు) మ్యాగ్లెవ్ ట్రాక్‌పై దీన్ని పరీక్షించినట్టు చైనా నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ డిఫెన్స్ టెక్నాలజీ ప్రొఫెసర్ లి జీ తెలిపారు. ఇప్పటివరకు తాము రూపొందించిన అత్యంత వేగవంతమైన సూపర్ కండక్టింగ్ ఎలక్ట్రిక్ మ్యాగ్లెవ్ రైలుగా ఇది నిలిచిందని పేర్కొన్నారు. ఇంతవేగం అందుకునే సామర్థ్యంతో రాకెట్‌ను కూడా ప్రయోగించగలమన్నారు. ఈ ప్రాజెక్టు కోసం తమ బృందం పదేళ్లుగా పని చేస్తోందని.. దీని ద్వారా భవిష్యత్తులో చైనా చేసే అల్ట్రా–హైస్పీడ్ మ్యాగ్లెవ్ పరిశోధనలు మరింత వేగవంతమయ్యే అవకాశం ఉందన్నారు. దాదాపు మూడు దశాబ్దాల క్రితం ఇదే విశ్వవిద్యాలయం దేశంలో మొట్టమొదటి మానవ సహిత సింగిల్–బోగీ మ్యాగ్లెవ్ రైలును అభివృద్ధి చేసిందని తెలిపారు.

# అమెరికాను మించి..!

## భారతీయుల డిపోర్టేషన్‌లో సౌదీ టాప్

### 24.5వేలమందిని వెనక్కిపంపిన 81 దేశాలు

ఇటీవల అమెరికానుంచి పెద్దఎత్తున భారతీయుల బహిష్కరణలు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. అయితే, ఈ ఏడాది అత్యధికంగా భారతీయులను స్వదేశానికి డిపోర్ట్ చేసింది ఏ దేశమో తెలుసా.. సౌదీ అరేబియా..! ఈమేరకు కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ రాజ్యసభకు సమర్పించిన నివేదికతో విషయం వెల్లడైంది. ఈ డేటాను ఇటీవల అందించగా.. ఆ సమాచారం తాజాగా బయటికొచ్చింది. 2025లో దాదాపు 24,600 మంది భారతీయులను 81 దేశాలు స్వదేశానికి పంపించాయి.

ఈ ఏడాది సౌదీ అరేబియా 11వేల మందికిపైగా భారతీయులను వెనక్కి పంపింది. అమెరికా 3,800 మందిని భారత్‌కు డిపోర్ట్ చేసింది. వీరిలో ప్రయివేట్ ఉద్యోగులు, విద్యార్థులు కూడా ఉన్నారు. మయన్మార్ 1,591 మందిని, మలేసియా 1,483 మందిని, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ 1,469 మంది భారతీయులను స్వదేశానికి పంపించాయి. సైబర్ ముఠాల్లో చిక్కుకున్న కేసులకు సంబంధించి మయన్మార్ అనేకమందిని భారత్‌కు పంపించింది. వీరిలో ఎక్కువమంది తెలుగువారు ఉన్నట్టు సమాచారం. వీసా కాలపరిమితి తీరడం లేదా అనుమతుల్లేకుండా ఉద్యోగాలు చేయడంవంటి కారణాలతో గల్ఫ్ దేశాలు ఎక్కువమంది భారతీయులను డిపోర్ట్ చేశాయి. ఈ బహిష్కరణల్లో విద్యార్థులే ఎక్కువమంది ఉన్నారు. ఈ ఏడాది యూకే 170 మంది, ఆస్ట్రేలియా 114 మంది, రష్యా 82మంది, అమెరికా 45మంది భారతీయ విద్యార్థులను



స్వదేశానికి పంపించాయి. అమెరికాలో గత ఐదేళ్లలో ఈసారే అత్యధిక బహిష్కరణలు చోటుచేసుకున్నాయి. ఎక్కువగా వాషింగ్టన్ డీసీనుంచి 3,414 మంది భారతీయులను డిపోర్ట్ చేసింది. ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత అక్రమ వలసలపై కఠిన చర్యల నేపథ్యంలో భారతీయులను అగ్రరాజ్యం స్వదేశానికి పంపించిన సంగతి తెలిసిందే. ప్రత్యేక సైనిక విమానాల్లో డిపోర్ట్ చేసింది. ఆ సమయంలో వలసదారుల చేతులు, కాళ్లను బంధించి తరలించడంపై తీవ్ర వివాదం రాజుకుంది.

## ప్రకృతి ప్రకోపానికి..

# మూల్యం చెల్లించుకున్నాం!

### పది అత్యంత ప్రమాద విపత్తుల్లో రూ.10 లక్షల కోట్ల నష్టం

ప్రపంచవ్యాప్తంగా ఈ ఏడాదిలో సంభవించిన పలు ప్రకృతి విపత్తులు తీవ్ర నష్టాలనే మిగిల్చాయి. ఆయా దేశాల్లో వడగాల్పులు, కార్చిచ్చులు, కరవు, తుపాన్లకు సంబంధించిన పది ఘటనలవల్ల దాదాపు 120 బిలియన్ డాలర్లకు (రూ. 10.77లక్షల కోట్లు) పైగా నష్టం వాటిల్లినట్టు అంచనా. వాతావరణ మార్పులు, ప్రకృతి ప్రకోపం కారణంగా సంభవించిన ఈ పరిణామాలను విశ్లేషించిన బ్రిటన్‌కు చెందిన ఓ స్వచ్ఛంద సంస్థ.. ఈ ఆర్థిక నష్టాల అంచనాలను రూపొందించింది.

ఈ ఏడాదిలో ఎక్కువ ఆర్థిక నష్టానికి కారణమైన ఘటనల విషయానికొస్తే.. అమెరికాకు కాలిఫోర్నియా కార్చిచ్చు తీవ్రనష్టాన్ని మిగిల్చింది. దీని కారణంగా సుమారు 60 బిలియన్ డాలర్ల నష్టం వాటిల్లినట్టు అంచనా. 400కు పైగా మరణాలు సంభవించాయి. ఇక –ఆగ్నేయాసియాను తుపాన్లు, వరదలు అతలాకుతలం చేశాయి. వీటివల్ల 25 బిలియన్ డాలర్ల నష్టంతోపాటు 1750మంది ప్రాణాలు కోల్పోయారు. థాయిలాండ్, ఇండోనేసియా, శ్రీలంక, వియత్నాం, మలేసియాల్లోనూ విపత్తులవల్ల కలిగిన ఆర్థిక నష్టం ఎక్కువగానే ఉంది. అలాగే, చైనాలో వరదల కారణంగా 11.7 బిలియన్ డాలర్ల నష్టం వాటిల్లగా.. వేలాదిమంది సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాల్సి వచ్చింది. బ్రెజిల్లో కరవు, స్పెయిన్, పోర్చుగల్లులో కార్చిచ్చులు.. ఆస్ట్రేలియా, ఆఫ్రికా తీరప్రాంతాల్లో తుపానులు.. ఇలా ప్రపంచ నలుమూలలా ఇలాంటి ఉపద్రవాలు తీవ్ర ప్రభావం చూపాయి.



ఇక, భారత్‌లోనూ భారీ వరదలు తీవ్ర నష్టాన్ని తెచ్చిపెట్టాయి. పాకిస్థాన్‌లో వరదల కారణంగా 1860మంది మరణించగా దాదాపు 70లక్షలమంది ప్రభావితమయ్యారు. మొత్తంగా ఇక్కడ 6 బిలియన్ డాలర్ల నష్టం వాటిల్లినట్టు అంచనా. ఫిలిప్పీన్స్‌లో టైఫూన్ల కారణంగా లక్షలాది సురక్షిత ప్రాంతాలకు తరలిపోగా.. దాదాపు 5 బిలియన్ డాలర్లకంటే ఎక్కువ నష్టం వాటిల్లినట్టు అంచనా. మొత్తంగా పది అత్యంత తీవ్ర విపత్తుల ప్రభావాలు 122 బిలియన్ డాలర్లమేర నష్టం కలిగించాయని తాజా నివేదిక అంచనా వేసింది. బీమా నష్టాల ఆధారంగా వీటిని రూపొందించగా.. అసలు ఆర్థిక నష్టం మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని తెలిపింది. మానవ నష్టం వీటికి అదనం. ధనిక దేశాల్లో బీమాను ఎక్కువమంది వినియోగిస్తుండటంతో ఇక్కడ నష్టాల విలువపై పూర్తి గణాంకాలు ఉన్నాయని తాజా నివేదిక పేర్కొంది. పేద దేశాల్లోనూ అత్యంత వినాశకర ఘటనలు ఆర్థికంగా భారీ నష్టాన్ని కలిగించాయని వెల్లడించింది.

# కెనడాలో 'వన్ స్టాప్ సెంటర్'

### భారతీయ మహిళలకు ప్రత్యేక సహాయ కేంద్రం



కెనడాలో ఆపదలోవున్న భారతీయ మహిళల కోసం ప్రత్యేక సహాయ కేంద్రం ఏర్పాటైంది. వీరికోసం "వన్ స్టాప్ సెంటర్ ఫర్ వుమెన్"ను ప్రారంభించినట్టు టొరంటోలోని భారత కాన్సులేట్ వెల్లడించింది. 24 గంటలూ అందుబాటులో ఉండే విధంగా హెల్ప్ లైన్‌ను కూడా ఏర్పాటు చేసినట్టు పేర్కొంది. గృహ హింస, దాడి, కుటుంబ వివాదాలు, దోపిడీ, న్యాయపరమైన సవాళ్లు ఎదుర్కొనే భారత పాస్‌పోర్టు కలిగిన మహిళలకు క్లిష్టమైన, సకాలంలో తోడుగా నిలిచే లక్ష్యంతో దీన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపింది. దీనిద్వారా బాధిత మహిళలకు తక్షణమే కౌన్సిలింగ్ ఇవ్వడం, మానసిక– సామాజిక మద్దతు అందించడం, ఆయా విభాగాల సమన్వయంతో చట్టపరమైన సాయం, సలహాలు అందిస్తామని వెల్లడించింది. కెనడా చట్టాలకు లోబడి ఓఎస్‌సీడబ్ల్యూ తోడ్పాటు అందిస్తుందని కార్యాలయవర్గాలు తెలిపాయి. మహిళా అధికారిణి నేతృత్వంలో ఈ కేంద్ర నిర్వహణ ఉంటుందని, వీటికి సంబంధించిన కాంటాక్టు వివరాలు కాన్సులేట్ వెబ్‌సైట్‌లో ఉన్నాయని తెలిపింది.

# కీవ్‌పై విరుచుకుపడిన రష్యా

### – ట్రంప్, జెలెన్ స్కీ భేటీ సమయంలో దాడి

ఉక్రెయిన్‌పై రష్యా భారీ దాడులకు పాల్పడింది. రాజధాని నగరం కీవ్‌పై క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడింది. ఉక్రెయిన్ ఇంధన, మిలిటరీ సదుపాయాలే లక్ష్యంగా దాడులు చేపట్టామని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. కీవ్ తమ దేశంలోని జనావాసాలపై చేసిన దాడులకు ప్రతీకారమే ఈ దాడులని పేర్కొంది. ఈ భారీ దాడిలో మొత్తం 500 డ్రోన్లు. 40 క్షిపణులను రష్యా ప్రయోగించిందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ తెలిపారు. ఈ ఘటనలో ఒకరు మృతిచెందగా.. 27మంది గాయపడ్డారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ ఫ్లోరిడాలో ఆదివారం భేటీకానున్న సంగతి తెలిసిందే. శాంతి ఒప్పందానికి సంబంధించిన కొన్ని పత్రాలు పూర్తిగా సిద్ధమయ్యాయని, మరికొన్ని తుది దశకు చేరుకున్నట్టు తెలుస్తోంది. ఈ భేటీ నేపథ్యంలో క్షిపణులతో రష్యా విరుచుకుపడటం గమనార్హం.

# బంగ్లాలో ఉద్రిక్తతలు

### రాక్‌స్టార్ కాన్సర్ట్‌పై మూకదాడి

బంగ్లాదేశ్‌లో ప్రముఖ రాక్‌స్టార్ కాన్సర్ట్‌పై మూక దాడి జరిగింది. షో ప్రారంభానికి ముందే కొంతమంది ఆందోళనకారులు వేదిక వద్దకు దూసుకొచ్చారు. ఉద్రిక్తతల నేపథ్యంలో నిర్వాహకులు షోను రద్దు చేశారు. ఈ దాడిలో 20మంది గాయపడినట్టు తెలుస్తోంది. ఫరీదాపూర్‌లో ఓ పాఠశాల 185వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని.. సాంస్క ృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా బంగ్లాదేశ్‌కు చెందిన ప్రముఖ గాయకుడు జేమ్స్ కాన్సర్ట్‌ను ఏర్పాటుచేశారు. పూర్వ విద్యార్థులతో సహా వేలాదిమంది ఇందులో పాల్గొనేందుకు వచ్చారు. అయితే, ఈ కాన్సర్ట్ ప్రారంభానికి ముందు.. ఉన్నట్టుండి ఆందోళనకారులు వేదిక వద్దకు దూసుకొచ్చారు. భద్రతా సిబ్బంది వారిని ఆపేందుకు ప్రయత్నించినప్పటికీ.. సాధ్యం కాలేదు. కాన్సర్ట్‌కు వచ్చిన వారిపై ఆందోళనకారులు రాళ్లు, ఇటుకలతో దాడి చేశారు. దీంతో పలువురు పాఠశాల విద్యార్థులు గాయపడ్డారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు అక్కడికి చేరుకొని నిరసనకారులను చెదరగొట్టే ప్రయత్నం చేశారు. భద్రతా కారణాల రీత్యా కాన్సర్ట్‌ను రద్దు చేస్తున్నట్టు నిర్వాహకులు వెల్లడించారు. ఆందోళనకారుల దాడినుంచి గాయకుడు జేమ్స్ త్రుటిలో తప్పించుకున్నారు. ఉద్రిక్తతలు మొదలవగానే భద్రతా సిబ్బంది ఆయనను అక్కడినుంచి తరలించారు. జేమ్స్, ఆయన సిబ్బందికి ఎలాంటి గాయాలు కాలేదని స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి.

చైతన్యరథం



# ఎన్నాళ్లకెన్నాళ్లకు..!

## ఆస్ట్రేలియా గడ్డపై ఇంగ్లాండ్ టెస్ట్ విజయం

**- యాషెస్ సిరీస్ నాలుగో టెస్ట్‌లో 4 వికెట్లతో గెలుపు**

**- బౌలర్ల హవా.. రెండు రోజుల్లోనే ముగిసిన మ్యాచ్**

ఆస్ట్రేలియా గడ్డపై చాలా సంవత్సరాల నిరీక్షణ తరువాత ఇంగ్లాండ్ చిరస్మరణీయ విజయం సాధించింది. యాషెస్ సిరీస్‌లో తొలి మూడు టెస్టులు ఓడిపోయి సిరీస్‌ను 3–0తో కోల్పోయినప్పటికీ మెల్‌బోర్న్‌లో జరిగిన నాలుగో టెస్ట్‌లో ఇంగ్లాండ్ పుంజుకుని గెలుపొందింది. రెండు రోజుల్లోనే ముగిసిన ఈ బాక్సింగ్ డే టెస్టులో 4 వికెట్ల తేడాతో ఇంగ్లాండ్ ఘన విజయం సాధించింది. ఆస్ట్రేలియా గడ్డ మీద దాదాపు 15 ఏళ్ల తర్వాత టెస్ట్ ఫార్మాట్‌లో ఇంగ్లండ్ ఈ విజయం సాధించడం గమనార్హం. 175 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లండ్ 32.2 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 178 పరుగులు చేసింది. ఇంగ్లండ్ బ్యాటర్లలో ఓపెనర్లు క్రాలీ (37: 48 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), బెన్ డకెట్ (34: 26 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్) జట్టుకు శుభారంభాన్ని అందించారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు 42 బంతుల్లోనే 51 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. అనంతరం జాకబ్ బెథెల్ 40 (46 బంతుల్లో, 5 ఫోర్లు) సమయోచిత ఇన్నింగ్స్ ఆడాడు. బ్రైడన్ కార్స్(6), జో రూట్(15), బెన్ స్టోక్స్(2) బ్యాటింగ్‌లో మరోసారి విఫలమయ్యారు. హ్యారీ బ్రూక్(2), జెమీ స్మిత్(3) నాటౌట్‌గా నిలిచారు. ఆసీస్ బౌలర్లలో స్కాట్ బోలాండ్, రిచర్డ్‌సన్, మిచెల్ స్టార్క్ తలో రెండు వికెట్లు తీసుకున్నారు.

తొలుత 4/0 ఓవర్ నైట్ స్కోరుతో రెండో రోజు శనివారం ఆటను ప్రారంభించిన ఆసీస్.. 34.3 ఓవర్లలో 132 పరుగులకు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం 42 పరుగులతో కలిపి ఇంగ్లాండ్‌కు 175 పరుగుల విజయ లక్ష్యాన్ని నిర్దేశించింది. ఆసీస్ బ్యాటర్లలో ట్రావిస్ హెడ్(46) ఒక్కడు రాణించాడు. స్కాట్ బోలాండ్ 6, జేక్ వెదర్లాడ్ 5, లబుషేన్ 8, ఉస్మాన్ ఖవాజా 0, కామెరూన్ గ్రీన్ 19, మైఖేల్ నీసర్ 0, మిచెల్ స్టార్క్ 0, రిచర్డ్‌సన్ 7.. బ్యాటింగ్‌లో విఫలమయ్యారు. స్టీవ్ స్మిత్ 24 నాటౌట్‌గా నిలిచాడు. ఇంగ్లాండ్ బౌలర్లలో బ్రైడన్ కార్స్ 4, జోష్ టంగ్, బెన్‌స్టోక్స్ చెరో 2, గస్ అట్కిన్సన్ 1 వికెట్ తన ఖాతాలో వేసుకున్నాడు. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 7 వికెట్లు తీసుకున్న జోష్ టంగ్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. ఈ మ్యాచ్‌లో తొలిరోజు ఆటలో 20 వికెట్లు నేలకూలిన విషయం తెలిసిందే. అలాగే రెండో రోజు ఆటలో బౌలర్లు 16 వికెట్లు తమ ఖాతాలో వేసుకున్నారు. ఈ టెస్ట్ మ్యాచ్‌లో ఇరు జట్లకు చెందిన బ్యాటర్లెవరూ కనీసం హాఫ్ సెంచరీ సాధించలేకపోవడం గమనార్హం.

# హర్మన్‌ప్రీత్ ప్రపంచ రికార్డ్





టీమిండియా మహిళా జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ప్రపంచ రికార్డ్ సాధించింది. టీమిండియా మహిళా జట్టు ప్రస్తుతం శ్రీలంకతో ఐదు టీ20ల సిరీస్ ఆడుతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే మూడు మ్యాచ్‌లు ఆడిన భారత్.. ఇంకా రెండు మ్యాచ్‌లు ఉండగానే సిరీస్‌ను దక్కించుకుంది. తిరువనంతపురం వేదికగా శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో శ్రీలంకపై టీమిండియా 8 వికెట్ల తేడాతో గెలిచింది. ఐసీసీ మహిళల వన్డే ప్రపంచ కప్ 2025 గెలిచిన తర్వాత టీమిండియాకు ఇదే తొలి సిరీస్. తొలి మ్యాచ్ నుంచే తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్న భారత అమ్మాయిలు.. విజయ పరంపరను కొనసాగిస్తూ వరుసగా మూడు టీ20ల్లో ఘన విజయాలు నమోదు చేశారు. అటు బౌలింగ్‌లో, ఇటు బ్యాటింగ్‌లో సత్తా చాటారు.

ఈ నేపథ్యంలో భారత కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ ఓ ప్రపంచ రికార్డును నెలకొల్పింది. హర్మన్ ప్రీత్‌కు కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇది 77వ విజయం. తద్వారా అంతర్జాతీయ మహిళల పొట్టి క్రికెట్‌లో అత్యధిక విజయాలు సాధించిన సారథిగా హర్మన్ చరిత్ర సృష్టించింది. ఆస్ట్రేలియా దిగ్గజ కెప్టెన్ మెగ్ లానింగ్ పేరిట ఉన్న ప్రపంచ రికార్డును బద్దలు కొట్టి.. ఈ జాబితాలో తొలి స్థానానికి ఎగబాకింది.

**అత్యధిక విజయాల కెప్టెన్లు**

**హర్మన్ ప్రీత్ కౌర్(భారత్)- 130 మ్యాచుల్లో 77 విజయాలు**
**మెగ్ లానింగ్(ఆస్ట్రేలియా)- 100 మ్యాచుల్లో 76 విజయాలు**
**హీదర్ నైట్(ఇంగ్లండ్)- 96 మ్యాచుల్లో 72 విజయాలు**
**చార్లెట్ ఎడ్‌వర్డ్స్(ఇంగ్లండ్)- 93 మ్యాచుల్లో 68 విజయాలు**
**ఎన్ చైవాయి(థాయ్‌లాండ్)- 79 మ్యాచుల్లో 55 విజయాలు**

# కొద్ది నిమిషాల్లో మ్యాచ్ గ్రౌండ్‌లోనే కుప్పకూలి కోచ్ మృతి



బంగ్లాదేశ్ క్రికెట్‌లో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్ (బీపీఎల్)లో ఢాకా క్యాపిటల్స్ ఫ్రాంచైజీ అసిస్టెంట్ కోచ్ మహబూబ్ అలీ జాకీ(59) మరణించారు. శనివారం సిల్‌హౌట్ వేదికగా రాజ్‌షాహి రాయల్స్‌తో జరగాల్సిన మ్యాచ్‌కు కొద్ది నిమిషాల ముందు మహబూబ్ అలీ మైదానంలోనే కుప్పకూలారు. వెంటనే ఫిజియోలు వచ్చి సీపీఆర్ చేసి హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. కాగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. ఈ విషయాన్ని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు చీఫ్ ఫిజీషియన్ దేబాశిష్ చౌదరి ధ్రువీకరించారు. అయితే మరణాన్ని గల కచ్చితమైన కారణాలను వెల్లడించలేదు. మైదానంలో ఉన్న ఆటగాళ్లు, అధికారులు విషయం తెలియగానే తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. వెంటనే సిల్‌హౌట్ టైటాన్స్, నోవాఖాలీ ఎక్స్‌ప్రెస్, చట్టోగ్రామ్ రాయల్స్ జట్లకు చెందిన ప్లేయర్లు, కోచ్‌లు తమ ప్రాక్టీస్ ఆపేసి ఆసుపత్రికి చేరుకున్నారు. ఆయన మృతి పట్ల బంగ్లాదేశ్ క్రికెట్ ఎక్స్ వేదికగా సంతాపం వ్యక్తం చేసింది.

**లెజెండరీ కోచ్**

బంగ్లాదేశ్ పేస్ బౌలింగ్ విభాగంలో మహబూబ్ అలీ ఒక లెజెండరీ కోచ్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. అండర్–19 వరల్డ్ కప్(2020)ను బంగ్లాదేశ్ సొంతం చేసుకోవడంలో బౌలింగ్ కోచ్‌గా ఆయనది కీలక పాత్ర. అదేవిధంగా టాస్కిన్ అహ్మద్, షోరిఫుల్ ఇస్లాం వంటి స్టార్ పేసర్లు ఆయన కోచింగ్‌లోనే రాటుదేలారు. ఆయన బంగ్లాదేశ్ క్రికెట్ జట్టు స్పెషలిస్ట్ బౌలింగ్ కోచ్‌గా, బౌలింగ్ యాక్షన్ రివ్యూ కమిటీ సభ్యుడిగా సేవలందించారు.

# కోహ్లి పెద్ద మనసు..




టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి పెద్ద మనసు చాటుకున్నాడు. తనను అవుట్ చేసిన బౌలర్‌ను అభినందించి అతడితో ఫొటో దిగాడు. కోహ్లి.. ప్రస్తుతం దేశవాళీ టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో ఆడుతున్న విషయం తెలిసిందే. ఢిల్లీ తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్న విరాట్.. ఆంధ్రా జట్టుతో జరిగిన తొలి మ్యాచులో సెంచరీ(131)తో చెలరేగాడు. గుజరాత్–ఢిల్లీ మధ్య జరిగిన మ్యాచులో హాఫ్ సెంచరీ(77) నమోదు చేసి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. అయితే తొలి మ్యాచ్‌లో సెంచరీ చేసి జోరు మీదున్న కోహ్లి.. గుజరాత్‌తో మ్యాచులోనూ శతకం బాదేస్తాడనే అనుకున్నారంతా. కానీ గుజరాత్ స్పిన్నర్ విశాల్ జైస్వాల్ అద్భుతమైన బంతి సంధించి కోహ్లిని పెవిలియన్‌కు పంపాడు. అతడు సంధించిన బంతిని ముందుకువచ్చి షాట్ ఆడే ప్రయత్నంలో విరాట్ కోహ్లి మిస్ చేశాడు. దీంతో ఆ బాల్‌ను అందుకున్న వికెట్ కీపర్ ఉర్విల్ పటేల్.. విరాట్‌ను స్టంపౌట్ చేశాడు. ఈ మ్యాచ్‌లో జైస్వాల్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. 10 ఓవర్లలో అతడు 42 పరుగులిచ్చి 4 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు.

మ్యాచ్ అనంతరం విరాట్ కోహ్లి తన వికెట్ తీసిన విశాల్ జైస్వాల్‌కు మరిచిపోలేని బహుమతి ఇచ్చాడు. ఆటోగ్రాఫ్ చేసిన బంతిని అంతడికి ఇవ్వడంతో పాటు, అతడితో ఫొటో కూడా దిగాడు. ఈ ఫొటోలను విశాల్ తన ఇన్‌స్టా ఖాతాలో పంచుకున్నాడు. 'కోహ్లి ఆటను టీవీలో చూసినప్పటి నుంచి అతడితో మైదానం పంచుకున్నప్పటి వరకు.. గ్రేట్ ఫుల్ మూమెంట్స్' అంటూ ఆ పోస్ట్ కింద రాసుకొచ్చాడు. ఈ పోస్ట్ పెట్టిన కొన్ని గంటల్లోనే 53 వేలకు పైగా లైక్స్ వచ్చాయి. అలాగే తాను విరాట్ వికెట్ తీసుకున్న బౌలింగ్ వీడియోనూ కూడా జైస్వాల్ ఇన్‌స్టాలో పోస్ట్ చేశాడు. దానికి ఏకంగా 2.7 మిలియన్ వ్యూస్ వచ్చాయి. ఈ పోస్టుకు అభిమానుల నుంచి విశేష స్పందన వచ్చింది. విరాట్ కోహ్లిని ఫ్యాన్స్ కొనియాడుతున్నారు.

# అండర్–19 వరల్డ్‌కప్: భారత జట్టు ప్రకటన

***వైభవ్ సూర్యవంశీకి చోటు***



వచ్చే ఏడాది జనవరి 15 నుంచి నమీబియా, జింబాబ్వే వేదికగా జరగనున్న అండర్–19 ప్రపంచ కప్ టోర్నమెంట్ కోసం భారత జట్టును బీసీసీఐ శనివారం ప్రకటించింది. ఈ జట్టుకు ఆయుష్ మాత్రే కెప్టెన్‌గా, విహాన్ మల్హోత్రా వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. టీనేజీ సంచలనం వైభవ్ సూర్యవంశీ ప్రపంచ కప్ జట్టులో చోటు దక్కించుకున్నాడు. కాగా వరల్డ్ కప్ కంటే ముందు జనవరి 3–7 మధ్య సౌతాఫ్రికాతో అండర్–19 భారత్ జట్టు మూడు వన్డేల సిరీస్‌లో తలపడనుంది. ప్రపంచ కప్‌నకు ఎంపిక చేసిన జట్టే సౌతాఫ్రికాతో వన్డే సిరీస్‌లోనూ ఆడనుంది. అయితే ప్రస్తుతం మణికట్టు గాయాలతో బాధపడుతున్న ఆయుష్ మాత్రే, విహాన్ మల్హోత్రా సఫారీలతో వన్డే సిరీసుకు అందుబాటులో ఉండరు. దీంతో సౌతాఫ్రికాతో జరిగే మ్యాచ్‌లకు వైభవ్ సూర్యవంశీ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు.

సౌతాఫ్రికాతో వన్డే సిరీస్‌కు భారత జట్టు: వైభవ్ సూర్యవంశీ (కెప్టెన్), ఆరోన్ జార్జ్ (వైస్ కెప్టెన్), వేదాంత్ త్రివేది, అభిజ్ఞాన్ కుందు, హర్వాన్ సింగ్, ఆర్.ఎస్. అంబరీష్, కాన్షిక్ చౌహాన్, ఖిలాన్ పటేల్, మహమ్మద్ ఎనాన్, హెనిల్ పటేల్, దీపేశ్ దేవేంద్రన్, కిషన్ కుమార్ సింగ్, ఉదవ్ మోహన్, యువరాజ్ గోహిల్, రాహుల్ కుమార్.

అండర్–19 ప్రపంచ కప్ 2026 కోసం భారత జట్టు: ఆయుష్ మాత్రే (కెప్టెన్), విహాన్ మల్హోత్రా (వైస్ కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, ఆరోన్ జార్జ్, వేదాంత్ త్రివేది, అభిజ్ఞాన్ కుందు, హర్వాన్ సింగ్, ఆర్.ఎస్. అంబరీష్ కాన్షిక్ చౌహాన్, ఖిలాన్ పటేల్, మహమ్మద్ ఎనాన్, హెనిల్ పటేల్, దీపేశ్ దేవేంద్రన్, కిషన్ కుమార్ సింగ్, ఉదవ్ మోహన్.

చైతన్య రథం
సినిమా
ఆదివారం 28 డిసెంబర్ 2025




# ‘ఆర్ యూ రెడీ’

‘ఆర్ యూ రెడీ’ అంటూ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు అగ్రకథానాయకులు చిరంజీవి, వెంకటేశ్. అనిల్ రావిపూడి దర్శకత్వంలో చిరంజీవి హీరోగా నటిస్తోన్న చిత్రం ‘మన శంకరవరప్రసాద్ గారు. వెంకటేశ్ అతిథిపాత్రలో సందడి చేయనున్నారు. సంక్రాంతి కానుకగా జనవరి 12న సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రచారంలో భాగంగా ‘ఆర్ యూ రెడీ’ అంటూ సాగే పాట ప్రోమోను తాజాగా విడుదల చేశారు ఈ పూర్తిపాట డిసెంబర్ 30న రానుంది.

## కావాల్సినవారే..
# కిరికిరి చేశారు!



బాగా కావాల్సిన వారే కుట్ర చేస్తారని ఊహించలేదని అన్నారు నటుడు శివాజీ. మహిళల దుస్తులపై ‘దండోరా’ ప్రీ-రిలీజ్ ఈవెంట్లో శివాజీ చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల వేదికగా తీవ్ర దుమారం రేపడంతో క్షమాపణ చెప్పడం తెలిసిందే. అయినా.. తెలంగాణ మహిళా కమిషన్ నోటీసులు పంపడంతో.. శనివారం కమిషన్ ముందు హాజరై చైర్‌పర్సన్ నేరెళ్ల శారదకు వివరణ ఇచ్చారు. అనంతరం శివాజీ మాట్లాడుతూ.. “నేను ఏం తప్పు చేశానని నా మీద ఇంత కోపం. మీ అమ్మానాన్న మీ ఇంట్లో మీకు జాగ్రత్తలు చెప్పరా? ఇంతకుముందు ఇలాంటి వ్యాఖ్యలు ఎవరూ చేయలేదా? వారి మీద ఇలానే మాట్లాడారా? సినిమా ప్రమోషన్ కోసమని కొందరు ప్రచారం చేస్తున్నారు.

‘దండోరా’ ఈవెంట్‌లో నేను చేసిన కామెంట్‌కు కమిషన్ నాకు నోటీసులు ఇచ్చింది. నా వ్యాఖ్యల వల్ల బాధపడ్డవారి తరపున కమిషన్ ప్రశ్నలు అడిగింది. వాటికి నేను సమాధానం చెప్పా. నేను ఎవరినీ నొప్పించాలని మాట్లాడలేదు. ఇటీవల చోటు చేసుకున్న సంఘటనల నేపథ్యంలో మాట్లాడేటప్పుడు తప్పులు దొర్లాయి. నాపైన కుట్ర జరుగుతోంది. నాతో కెరీర్ మొదలు పెట్టినవారికి నాపై కోపం ఉంది. నా వ్యాఖ్యల తర్వాత నన్ను ఇబ్బంది పెట్టాలని కొందరు జూమ్ మీటింగ్ పెట్టుకుని చర్చించారు. నాకు బాగా కావాల్సిన వారు ఇంత కుట్ర చేస్తారని అనుకోలేదు” అన్నారు. “కమిషన్ అడిగిన వాటికి సమాధానం చెప్పాను. ఇంకా వివరణ ఇవ్వాల్సి వస్తే మళ్లీ కమిషన్ ముందుకు వస్తా. వాళ్లకు నచ్చని ఆ మాటలను వెనక్కి తీసుకుంటున్నా. ఈ విషయాన్ని ఇక్కడితో వదిలేద్దాం. సినిమాలు రాకపోతే, వ్యవసాయం చేసుకొని బతుకుతా. నాది రైతు కుటుంబం. నేను ఎవరినీ నొప్పించాలని మాట్లాడలేదు. ప్రతి ఒక్క దానికి కాలమే సమాధానం చెబుతుంది. ఈ భూమ్మీద ఎవరినీ ఎవరూ సంతృప్తి పరచలేరు. “యథార్థ వాది లోక విరోధి” అని శివాజీ వ్యాఖ్యానించారు.

# చిక్కుల్లో.. అక్షయ్‌ఖన్నా!



*దురంధర్‌తో భారీ ఫేమ్ సొంతం చేసుకున్న బాలీవుడ్ నటుడు అక్షయ్‌ఖన్నా చిక్కుల్లో పడ్డారు. ‘దృశ్యం-3’ నిర్మాత కుమార్ మంగత్ పాఠక్ అతడిపై దావా వేశారు. లీగల్ నోటీసు పంపినట్టు వెల్లడించారు. దృశ్యం-3 కోసం చేసుకున్న ఒప్పందాన్ని ఉల్లంఘించారని, సినిమాలో భాగంకావడం లేదని టెక్ట్స్ మెసేజ్ పంపించారని నిర్మాత ఆరోపించారు. తమ మధ్య ఒప్పందం జరిగిందని, అప్పుడే కొంతమొత్తంలో అడ్వాన్స్ చెల్లించినట్టు చెప్పారు.*

*షూటింగ్‌పై ప్రభావం పడటంతో అక్షయ్ స్థానంలో జైదీప్ అహ్లావత్‌ను తీసుకున్నట్టు వెల్లడించారు. “రెండేళ్లుగా దృశ్యం-3 సినిమా కోసం పనిచేస్తున్నాం. అక్షయ్‌ఖన్నాకు ఆ విషయం తెలుసు. స్క్రిప్ట్ మొత్తం విన్నప్పుడు అతనికి నచ్చింది. అన్నీ మాట్లాడుకున్న తర్వాతే సంతకాలు చేసుకున్నాం. కానీ ఒకరోజు ఈ సినిమా చేయట్లేదని మెసేజ్ పంపారు. అతడిని సంప్రదించాలని ప్రయత్నించినా అందుబాటులోకి రాలేదు. తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటాం” అని పాఠక్ వెల్లడించారు. ఈ వ్యాఖ్యలపై అక్షయ్ టీమ్‌నుంచి ఎలాంటి స్పందనారాలేదు.*

*అజయ్ దేవగణ్ ప్రధాన పాత్రలో నటిస్తోన్న దృశ్యం-3.. 2026 అక్టోబర్ 2న విడుదల కానుంది. నటి శ్రియశరణ్, రజత్ కపూర్, టబు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కాగా.. దృశ్యం-2లో భాగమైన అక్షయ్ ఇటీవల విడుదలైన ధురంధర్ చిత్రంతో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నారు. ఆ చిత్రంలో అతడు వేసిన స్టెప్పులు నెట్టింట్లో వైరల్ అయిన సంగతి తెలిసిందే.*

# ప్రభాస్.. వెరీ స్వీట్ పర్సన్



ప్రభాస్‌తో కలిసి ‘ది రాజాసాబ్ అంటూ సందడి చేసేందుకు నిధి అగర్వాల్ సిద్ధమయ్యారు. వీరిద్దరి కాంబోలో తెరకెక్కిన సినిమా జనవరి 9న విడుదల కానుంది. ప్రచారంలో భాగంగా నిధి వరుస ఇంటర్వ్యూలు ఇస్తూ ఆసక్తికర విషయాలు పంచుకుంటున్నారు. “ఈ సినిమాలో ప్రతిఒక్కరి పాత్రకూ ప్రాధాన్యముంది. ప్రభాస్ 6.2 అడుగులు, నేను 5.7 అడుగులు.. ఆయన హైట్‌ను బ్యాలెన్స్ చేయడం కోసం పెద్ద హీల్స్ వేసుకుని యాపిల్ బాక్స్‌పై నిల్చున్నా, సహనా సహనా సాంగును స్క్రీన్పై కొత్తగా చూస్తారు. కాస్ట్యూమ్స్ కలర్‌ఫుల్‌గా కనిపిస్తాయి. నిర్మాత ఏ విషయంలోనూ రాజీ పడలేదు. తెరపైనే కాదు.. నిజజీవితంలోనూ ప్రభాస్ స్వీట్ పర్సన్. నా కెరీర్లో అంత మంచి వ్యక్తిని చూడలేదు. ఆయన అతిథి మర్యాదల గురించి ప్రత్యేకంగా చెప్పాలి. ఇంటినుంచి భోజనం తెప్పిస్తారు. నేను విరామ సమయంలో కుటుంబంతో గడుపుతాను. ధ్యానం చేసుకుంటా. సామాజిక సేవ చేస్తాను. కానీ, దాని గురించి బయటకు చెప్పడం ఇష్టం లేదు. విదేశాల్లో షూటింగుకు వెళ్లినప్పుడు చిన్న గ్యాస్ సిలిండర్‌వెంట తీసుకెళ్తాను. ప్రతిరోజు టిఫిన్, డిన్నర్ నేనే వండుకుంటాను”

“రాజాసాబ్ విడుదలయ్యాక నా అప్‌కమింగ్ ప్రాజెక్ట గురించి చెబుతాను. తెలుగులో మూడు సినిమాలు చేస్తున్నా. ఇతర భాషల్లోనూ కొన్నిటికి సైన్ చేశా. 2026 మొత్తం బిజీనే. నాకు ఓటీటీ సినిమాలంటే ఇష్టం. డైరెక్ట్ ఓటీటీ ప్రాజెక్టలు చేయడానికి సిద్ధంగా ఉన్నా. మంచి కథ ఉంటే కచ్చితంగా చేస్తా. 2025లో రెండు ప్రత్యేక అనుభవాలు ఉన్నాయి. రాజాసాబ్ షూటింగ్, ‘హరిహర వీరమల్లు’ ప్రచార సమయంలో పవన్ నన్ను ప్రశంసించడం ఎప్పటికీ మర్చిపోలేను” అన్నారు నిధి అగర్వాల్.

# ఆ తప్పులు.. రిపీట్ చేయను



తన గత చిత్రంపై చాలా విమర్శలు వచ్చాయని.. వాటిని సరిదిద్దుకుంటానంటున్నాడు దర్శకుడు లోకేశ్ కనగరాజ్. రజనీకాంత్ హీరోగా ఆయన తెరకెక్కించిన చిత్రం ‘కూలీ’. ఈ ఏడాది ఆగస్టులో ప్రేక్షకుల ముందుకువచ్చిన సినిమా గురించి లోకేశ్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. దీని విడుదల సమయంలో వచ్చిన విమర్శల గురించీ ప్రస్తావించారు. “కూలీ’ సినిమాపై ఎన్నో విమర్శలు వచ్చాయి. నేను తర్వాత తీయనున్న చిత్రంలో వాటిని సరిదిద్దుకునే ప్రయత్నం చేస్తాను. అన్ని ట్రోల్స్ వచ్చినప్పటికీ ప్రేక్షకులు రజనీకాంత్ కోసం సినిమా చూశారు. దీనికి రూ.500 కోట్లు వచ్చాయని నిర్మాతలు చెప్పారు. ఈ విషయంలో అందరికీ ధన్యవాదాలు చెప్పాలి. నేను అంచనాల ఆధారంగా కథలు రాయలేను. రాసుకున్న కథలోని పాత్రలు ప్రేక్షకుల అంచనాలు అందుకుంటే ఆనందిస్తాను. ఒకవేళ అలా అందుకోలేకపోతే.. తర్వాత సినిమాలో అయినా వాటికోసం ప్రయత్నిస్తాను” అని తెలిపారు. రజనీకాంత్, నాగార్జున, శ్రుతిహాసన్, సత్యరాజ్, ఉపేంద్ర, ఆమిర్ ఖాన్ నటించిన యాక్షన్ థ్రిల్లర్ ‘కూలీ’. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమాలో రజనీ తన మార్క్‌తో అలరించారు. ‘వార్ 2’తో పోటీపడిన ఈ మూవీ రూ.500 కోట్లు వసూలు చేసింది. స్నేహితుడి ఆకస్మిక మరణం వెనక కారణాలను తెలుసుకునే దేవ పాత్రలో రజనీకాంత్ కనిపించారు.

# ప్రాజెక్టుల లైనప్‌లో చరణ్ వెనకపడ్డాడా..?



రామ్‌చరణ్.. ప్రస్తుతం “పెద్ది”తో బిజీగా ఉన్నాడు. మంచి అంచనాలు సెట్ చేసుకున్న సినిమా వచ్చే ఏడాది గ్రాండ్‌గా రిలీజ్ కాబోతుంది. ఈ సినిమా తరువాత దర్శకుడు సుకుమార్‌తో చేసే సినిమా వరకు ఓకే కానీ.. ఆ తర్వాత ఏంటి? అంటే ఫ్యాన్స్ సైడ్‌నుంచి స్పందన వచ్చే పరిస్థితి లేదు. కానీ చరణ్‌తోవున్న తన కోస్టార్స్ జూనియర్ ఎన్టీఆర్, అల్లు అర్జున్‌లు మాత్రం సాలిడ్ లైనప్‌ని సెట్ చేసుకుంటున్నారు. ప్రభాస్ చేతిలోనూ ఎన్నో సినిమాలున్నాయి. కానీ రామ్‌చరణ్ నుంచి మాత్రం నెక్ట్స సుకుమార్ సినిమా తర్వాత ఎవరితో చేస్తారు అనేది ఇంకా ఎలాంటి కన్ఫర్మేషన్ లేదు. దీనితో తన లైనప్ విషయంలో ఫ్యాన్స్ ఇపుడు వర్రీగానే ఉన్నారు. సందీప్‌రెడ్డి వంగ, లోకేష్ కనగరాజ్ అంటూ ఆ మధ్య కొన్ని రూమర్స్ వినిపించాయి కానీ అవి కూడా తర్వాత తేలిపోయాయి. మరి ఈ విషయంలో మాత్రం చరణ్ కొంచెం వెనుకబడ్డాడని చెప్పక తప్పదు.

# మేం చేసినట్టు.. వాళ్లు చేయడం లేదు



ఇప్పుడు దక్షిణాది సినిమా దగ్గర మాత్రమే కాకుండా ఇండియన్ సినిమా దగ్గర కూడా బిగ్గెస్ట్ సినిమా ఇండస్ట్రీగా నిలిచిన ఇండస్ట్రీలలో కన్నడ ఒకటి. అయితే కన్నడ సినిమానుంచి సుదీప్, శివరాజ్‌కుమార్ లాంటి స్టార్స్ ఇతర భాషల్లో సాలిడ్ కామియో రోల్స్ చేసిన సంగతి తెలిసిందే. కానీ తాము చేసినట్టు ఇతర ఇండస్ట్రీనుంచి ఎవరూ తమ సినిమాల్లో కామియో రోల్స్ చేసేందుకు రావడం లేదని సుదీప్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో చేసిన కామెంట్స్ వైరల్‌గా మారాయి. నేనే చాలా సినిమాల్లో కనీసం ఎలాంటి పేమెంట్ తీసుకోకుండా నటించాను. కానీ తను పర్శనల్ రిక్వెస్ట్ చేసినప్పటికీ ఎవరూ తమ సినిమాల్లో నటించేందుకు ముందుకు రాలేదని సుదీప్ తెలిపారు. పరస్పర సాయం లోపించిందన్న సుదీప్ షాకింగ్ కామెంట్స్ వైరల్‌గా మారాయి.